# బైబిలు సంఘము

## THE CHURCH OF THE BIBLE

**(Telugu)**

Author

**J.C. Choate**

Translator

**Joshua Gootam**

**WORLD LITERATURE PUBLICATIONS**

**SATYA VANI**

P.O. Box. 80, KAKINADA, INDIA - 53 001

# పరిచయము

బైబిలు సంఘము అను పుస్తకము ఇండియాలో అనేక సార్లు ముద్రింపబడినది. అది ఇంగ్లీషులోను, హిందీలోను ఇప్పుడు తెలుగులోను ప్రచురింపబడినది. అది ఈ దేశములోనేగాక, శ్రీలంకలోను, అమెరికాలోను ప్రచురింపబడినది. సరిగదా అనేక దేశములలో అది ఫలవంతముగా వినియోగింపబడినది.

ఈ పుస్తకములో యున్న సమాచారము అంతయు సూక్ష్మమైనది. అందువలన ప్రతివారు దీనిని అనుసరించుట కవకాశమున్నది. బైబిలులో మనకు ఒకే ఒక్క సంఘము కన్పడుచున్నది. ఇందున్న పాఠములు చదువువారు ఆ నిజసంఘమును గుర్తించుటకు సహాయకరముగా వ్రాయబడినవి. ఎవరిని అన్యమార్గమున నడిపించుటకు ఈ గ్రంధకర్త యొక్క ఉద్దేశము కాదు. సరిగదా బైబిలు బోధించు సంగతులను విపులముగా చూపించుటయే నా ముఖ్య ఉద్దేశము. ప్రభువు శరీరమైన సంఘమునకు తగిన విలువ నిచ్చుటకు మనము నేర్చుకొనవలెను. దేవుని వాక్యము దానికి ఎంత ప్రాముఖ్యతను ఇచ్చుచున్నదో దానినే సంఘమునకు మనము ఇయ్యవలెను.



ఈ అంశముపై బైబిలు ఏమి బోధించుచున్నదో మీరు తెలిసికొనవలెను. అందువలన మీ బైబిలుతో సహా ఈ పుస్తకమును మీరు చదివి గ్రహించుకొనవలెనని హెచ్చరించుచున్నాను. ఈ అంశముపై నున్న సత్యమును మీ నేత్రములను విప్పి చూచిన యెడల మీరు సులభముగా గ్రహించగలరు. అన్నింటికంటె ముఖ్యముగా సత్యమును అంగీకరించి దానికి విధేయులగుడి. అప్పుడు ఖచ్చితముగా మీరు కూడ క్రీస్తు సంఘ సభ్యులగుదురు.

క్రీస్తు నందు నా సోదరుడును, సహసేవకుడును, కాకినాడ వాస్తవ్యుడునగు జాషువా గూటంగారు ఈ పుస్తకమును ఆంగ్లము నుండి తెలుగునకనువదించి, ముద్రించుటలో సహాయపడి నందుకు, ఆయనకు నా నిండు వందనములు.

**- J.C. CHOATE**

Church of Christ
New Delhi, India.

Telugu

Reprint July - 2008

# విషయ సూచిక


| | | పేజీ |
|---|---|---|
| 1. | సంఘము యొక్క అర్థము .......... | 1 |
| 2. | సంఘావతరణము .......... | 5 |
| 3. | సంఘ స్థాపనము .......... | 9 |
| 4. | సంఘ రూపురేఖలు .......... | 13 |
| 5. | సంఘ నామము .......... | 18 |
| 6. | సంఘపాలన పద్ధతి .......... | 22 |
| 7. | సంఘ ప్రవేశము .......... | 27 |
| 8. | సంఘారాధన .......... | 32 |
| 9. | సంఘము యొక్క పని .......... | 37 |
| 10. | సంఘ ఐక్యత .......... | 43 |
| 11. | సంఘ విశ్వాసము .......... | 48 |
| 12. | సంఘ ప్రభువు రాత్రి భోజనము .......... | 53 |
| 13. | సంఘ సంగీతము .......... | 60 |
| 14. | సంఘ పునాది .......... | 65 |
| 15. | సంఘము యొక్క ఆత్మ .......... | 71 |
| 16. | సంఘ పవిత్రత .......... | 78 |
| 17. | సంఘ సహవాసము .......... | 84 |
| 18. | సంఘ క్రమశిక్షణ .......... | 91 |
| 19. | సంఘమునకు తిరిగి చేరుకొనుట .......... | 97 |
| 20. | సంఘమందలి దీవెనలు .......... | 102 |
| 21. | సంఘ ఆర్థికం .......... | 107 |
| 22. | సంఘముకై క్రీస్తు రాకడ .......... | 113 |
| 23. | సంఘ చరిత్ర .......... | 120 |
| 24.. | నేటి క్రీస్తు సంఘము .......... | 127 |

1 వ పాఠము

# సంఘము యొక్క అర్థము

(Meaning of the Church)

బైబిలు ఒక సంఘము గూర్చి చెప్పుచున్నదని ఎవరు కాదనరు. అయితే ఎవరి సంఘము? ఏ సంఘము? ఈ ప్రశ్నలకును, మరికొన్నిటికిని రాబోవు పుటలలో జవాబీయబడును. గాని ఇప్పుడు, సంఘమనగా ఏమియెూ మనము తెలిసికొనగోరుచున్నాము. అయితే అది ఏమైయుండలేదో ముందు తెలిసి కొనుట మంచిది. బైబిలు నందు వర్ణించబడిన సంఘము కేథలిక్కులది గాని, ప్రొటెస్టాంటులదిగాని, యూదులదిగాని కాదు. అది డినామినేషన్ కాదు. అంతర్దినామినేషనల్ అంతకుముందే కాదు. అది మతశాఖలదికాదు. అది రాజకీయ సంస్థగాని, మరొక సాంఘిక సంస్థగాని కాదు. అది భౌతిక సంబంధమైన కూడిక గృహము (గుడి) కాదు. గనుక అది ఇవన్నియు కానట్లయితే, మరి ఏమైయున్నది? సంఘమును అనేకులు గ్రహించు కొనలేరు, ఏలయనగా అదేమిటో వారెరుగరు. అందువలన వారు దాని ప్రయోజనమును, ప్రాముఖ్యతను, పనిని గ్రాహ్యము చేసికొనలేరు. కాని అదేమైయున్నదో బైబిలు విపులముగ మనకు బోధించుచున్నది. సంఘము అను పదము "ఎక్లీషియా" అను గ్రీకుపదము నుండి ఉద్భవించినది. ఎక్లీషియా అనగా పిలువబడినవారు అని యర్థము. గనుక సంఘము పిలువ బడిన సంస్థయైయున్నది. అది ఈ లోకము నుండి దేవుని ప్రియకుమారుని రాజ్యములోనికి పిలువబడిన ప్రజలై యున్నది (కొలస్స 1:13). అది క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైయున్నది (1కొరింధి 12:27). అది క్రీస్తునకు

విధేయులైన వారితో (హెబ్రీ 5:8,9) అనగా ఆయన ద్వారా రక్షింపబడి అందు చేర్చబడిన వారితో సమకూర్చబడినది (మార్కు 16:16, అపొ.కా. 2:47). ఇంకొక మాటలో సంఘము క్రీస్తు యొక్క అనుచరులతో నింపబడినదైయున్నది.

సంఘము అను పదము బైబిలు నందు రెండు భావములతో కన్పడును. మొదటిది, అది సార్వజనికము (Universal) అను భావము. ఈ భావముతోనే క్రీస్తు పేతురుతో ఇట్లు పలికెను: "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవు" (మత్తయి 16:18). సంఘము సార్వజనికమైయున్నదని చెప్పు అనేక వచనములున్నవి. అనగా ఈ లోకములో ఎక్కడయినను సంఘమున్న యెడల, అది బైబిలు సంఘమయిన యెడల, అది నేను కట్టుదునని యేసు చెప్పిన సంఘమై యుండును. రెండవది, అది స్థానికము (Local) అను భావము. ఉదాహరణకు, పౌలు రోమాలో యున్న సంఘమునకు వ్రాయునపుడు, అనేక స్థానిక సంఘములను (Local Congregations) గూర్చి చెబుతూ "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని పలికెను (రోమా 16:16). ఈ సంఘములన్నియును డినామినేషన్లు అను భావముతో గాక, అవన్నియు వేర్వేరు చోట్లనున్న స్థానిక క్రీస్తు సంఘములు అను భావముతో అతడు పలికెను. దీనిని ఇంకా వివరించవలెననిన, లేఖనములు కొరింథులో నున్న సంఘము అనియు, ఎఫెసులో నున్న సంఘమనియు, ఫిలిప్పీలోనున్న సంఘమనియు పలుకుట నీవు గమనించగలవు (1 కొరింథి 1:2, ఎఫెసీ 1:1; ఫిలిప్పీ 1:1). సంఘమును డినామినేషనల్ భావముతో చూచుటకు అలవాటుపడిన వారికిదంతయును గలిబిలిగా యుండును. మొదటి డినామినేషన్‌ను గూర్చి నీవు బైబిలు



నందు చదువలేవు. పై నుదహరించబడిన సందర్భములో అనేక స్థానిక సంఘములను గూర్చి పలుకబడుట నీవు చూడగలవు. అవన్నియు కలిసి సార్వజనిక సంఘమగును. మనము డినామినేషన్లను మరచిపోయి, బైబిలునందు ప్రభువు ఇచ్చిన సంఘమును కనుగొనుట చాలా సులభము.

సంఘము యొక్క అర్థమును ఇంకను మనము గ్రహించు నిమిత్తము సంఘమును బైబిలు ఈ క్రింది రీతిగ వర్ణించుచున్నది.

**1. క్రీస్తు శరీరము :** అది ఆయన ఆత్మీయ శరీరమైయున్నది. దానికి శిరస్సు క్రీస్తే (ఎఫెసీ 5:23). ఒకే ఒక్క శరీరమున్నది (ఎఫెసీ 4:4). ఆ ఒక్క శరీరము ఒకే సంఘమైయున్నది (కొలస్స 2:18).

**2. దేవుని గృహము :** లేఖనములలో గృహము అనుపదము కుటుంబమును సూచించుచున్నది, అనగా సంఘము దేవుని కుటుంబమై యున్నట్లు మనకు గ్రాహ్యమగుచున్నది. 1 తిమోతి 3:15లో దేవుని మందిరము లేక గృహము అనగా జీవము గల దేవుని సంఘము అని పౌలు పలికెను. దేవుడు తండ్రి మన మాయన కుమారులము (గలతి 3:26, 27; ఎఫెసీ 3:3).

**3. దేవుని రాజ్యము :** రాజ్యము ఒకే రాజును సూచించుచున్నది. గనుక క్రీస్తు రాజై యున్నాడు (ప్రకటన 17:14). అయితే రాజై యుండుటకు ఆయన ఇప్పుడు రాజ్యమును కలిగి యుండవలెను. దానిని ఆయన కలిగియున్నాడు (అపొ.కా. 8:12). మన మాయన సేవకులము, ఈ ప్రపంచము ఆయన పాలించు ప్రదేశము, క్రొత్త నిబంధన ఆయన చట్టము. ఇదీ సంఘము (మత్తయి 16:18,19).

**4. దేవుని ద్రాక్షతోట :** క్రీస్తు ద్రాక్షవల్లియై యుండగా వ్యక్తిగత

క్రైస్తవులు తీగలైయున్నారు (యోహాను 15:1-8). దీనిని బట్టి మనము ఆయన తోటలో పనిచేసి ప్రభువు కొరకు ఫలములను ఫలించవలెనను భావము ఇందున్నది.

సంఘము ఈ విధముగ నిర్వచింపబడినది. లేఖనముల ననుసరించి ఈ సంగతులను దయచేసి చదివి నీకు నీవే పరిశీలించుము. ప్రభువు సంఘమును ఆయన కోరురీతిగ నీవు గ్రహించు కొనగలిగినయెడల, నీ తత్వమంతయు, బహుశ నీ జీవిత మంతయు మార్చబడగలదు.



2 వ పాఠము

# సంఘావతరణము

## (The Coming of the Church)

సంఘము అకస్మాత్తుగా అవతరించలేదు. అది ముందుగా ఆలోచించ బడి, ప్రవచింపబడి, వాగ్దానము చేయబడి స్థాపించబడెను. దీనినంతటినీ బైబిలు విపులముగ విశదీకరించుచున్నది.

మొదటిగా సంఘము జగత్తు పునాది వేయబడకమునుపే దేవునిచే నిర్ణయించబడెను. దీనిని పౌలు ఎఫెస్సులోనున్న పరిశుద్ధులకిట్లు తెలియ జేసెను: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తు నందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమ చేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:3-6). ఎఫెస్సులో నున్న సంఘమునకు వ్రాయుచూ వారిని దేవుడు జగత్పునాది వేయబడక ముందే ఏర్పరచు కొనెనని అతడక్కడ వ్రాయుచున్నట్లు దయచేసి గమనించుము. ప్రపంచములు నిర్మించబడక ముందే దేవుడు సంఘమును గూర్చి ఆలోచించుచున్నట్లు దీని భావము. అనగా ఆ సమయమందు ఆయన

దాని నమూనాల నేర్పరచెను. గనుక అది ముందు దేవుని మనస్సు నందు ఉద్భవించెను. ఆది నుండియు దేవునిచే నిర్ణయించబడిన దానిని మనము స్వల్పముగాను, సంకుచింతముగాను చేయుట ఎంతయో విపరీతమైన సంగతి.

రెండవదిగా, సంఘము ప్రవచనరీతిగ అనేక పర్యాయములు పలుకబడెను. యెషయా ఇట్లు పలికెను: "అంత్య దినములలో పర్వతముల పైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దాని లోనికి వచ్చెదరు" (యెషయా 2:2,3). యోవేలు ఇట్లు పలికెను: "తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మ కుమ్మరింతును; మీ కుమారులును, కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు; మీ ముసలివారు కలలు కందురు, మీ యౌవనస్థులు దర్శనములు చూతురు. ఆ దినములలో నేను పనివారి మీదను, పనికత్తెల మీదను నా ఆత్మను కుమ్మరింతును" (యోవేలు 2:28,29). అటు తరువాత దానియేలు ఇట్లు సూచించెను: "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దానిని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగయుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44). ఇప్పుడు కొన్ని అభిప్రాయములను పొందుపరచుదము:

1. స్థాపించబడు రాజ్యము చివరి దినములలో స్థాపించబడును.

2. అది పర్వతములలో స్థాపించబడును.

3. సమస్త జనులు దానిలోనికి ప్రవాహము వలె ప్రవేశింతురు.



4. సమస్త జనుల మీద ప్రభువు తన ఆత్మను కుమ్మరించును.

5. ఆది నాలుగవ భూసామ్రాజ్య కాలమున స్థాపించబడును.

6. అది రాజ్యముల నన్నిటిని నిర్మూలించును గాని, అది యుగముల వరకు నిలుచును.

ఇదంతయు ఎక్కడ నెరవేరెను? అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయమును చదువుము.

మూడవదిగా సంఘము వాగ్దానము చేయబడెను. అది సమీపించి యున్నదని యోహాను చెప్పెను (మత్తయి 3:2). అది త్వరలో రాబోవుచున్నదని, త్వరలో స్థాపించబడబోవుచున్నదని దీని యర్థము. క్రీస్తు ఇట్లు వాగ్దానము చేసెను: "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:18). "మరియు ఆయన ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచు వరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" (మార్కు 9:1). ఆయన వారి మనస్సును తెరచి, క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను; మీరు పై నుండి శక్తి పొందు వరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను" (లూకా 24:46-49). ఇప్పుడు ఈ క్రింది వాస్తవములను గమనించుము:

1. రాజ్యము సమీపించి యుండెను.

2. మరణమయినను సరే దానిని నిర్మింతునని క్రీస్తు వాగ్దానము చేసెను.

3. క్రీస్తుతోనున్న వారిలో కొందరు అది స్థాపించబడుసరికి సజీవులై యుందురు.

4. అది బలముతో వచ్చును.

5. సమస్త జనములలో మారుమనస్సు, పాపక్షమాపణ ఆయన పేరట ప్రకటించబడును.

6. అది యెరూషలేమునందు ఆరంభమగును.

7. అపొస్తలులు యెరుషలేములో పై నుండి శక్తి పొందెదరు.

సంఘంస్థాపనము అను అంశము తెలిసికొనువరకు పై నుదహరించబడిన సంగతులను మనస్సునందు ఉంచుకొనుము. అప్పుడు ఇదంతయు నీకు విడమరచబడును.

అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయమును కొద్దిమారులు పఠించుము. బైబిలువేత్తలందరు సంఘము ఆ అధ్యాయము చెప్పుకాలము నందు స్థాపించబడెనని ఒప్పుకొందురు. అంతేకాదు, అది యెరూషలేము నందు స్థాపించబడెను. శక్తి వచ్చెను, సమస్త జనులకు మారుమనస్సు, పాపక్షమాపణలు ప్రకటించబడెను. అప్పటి నుండియు సంఘము ఉనికి కలిగియుండెను. గనుక దేవుని మనస్సునందున్న సంఘంము స్థాపించబడెను. దాని సంబంధమైన ప్రవచనములు, వాగ్దానములు నెరవేర్చబడెను.



3 వ పాఠము

# సంఘ స్థాపనము

## (The Establishment of the Church)

గత పాఠములో యెషయా 2:2-3, యోవేలు 2:28-29, దానియేలు 2:44 లను చదివి చూడగా దేవుని రాజ్యము (సంఘము) అంత్యదినములలో యెరూషలేము నందు, ఆత్మ వచ్చిన మీదట స్థాపించబడుననియు, సమస్త జనులు దాని లోనికి ప్రవేశింతురనియు, అది చిరకాలము నిలుచుననియు గ్రహించితిమి. క్రీస్తు మత్తయి 16:18, మార్కు 9:1, లూకా 24:46-49లలో సంఘమును స్థాపింతుననియు, అది శక్తితో అవతరించుననియు, మరియు ఆయన నామమున మారుమనస్సు, పాపక్షమాపణ సమస్త జనులలోను ప్రకటింపబడుననియు వాగ్దానము చేసెను. అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో చూచిన యెడల పైన చెప్పబడిన ప్రవచనములు, చేయబడిన వాగ్దానములు అన్నియును నెరవేర్చబడినట్లు కనుగొనగలము.

అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయము మనము చదివిన యెడల, అపొస్తలులందరు యెరూషలేము నందున్నట్లు చూడగలము. "పెంతెకోస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలి వంటి యొక ధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ, అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మవారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది

అన్యభాషలతో మాటలాడ సాగిరి. ఆ కాలమున ఆకాశము క్రింద నుండు ప్రతిజనములలో నుండి వచ్చిన భక్తి గల యూదులు యెరుషలేములో కాపుర ముండిరి. ఈ శబ్దము కలుగగా జనులు గుంపులుగా కూడి వచ్చి ప్రతి మనుష్యుడు తన స్వభాషతో వారు మాటలాడుట విని కలవరపడిరి" (అపొ.కా. 2:1-6).

వారు అందరు విభ్రాంతి నొంది యెటు తోచక యిదేమగునో అని ఒకనితో ఒకడు చెప్పుకొనిరి. కొందరైతే వీరు క్రొత్త మద్యముతో నిండి యున్నారని అపహాస్యము చేసిరి. అయితే పేతురు ఆ పదునొకరితో కూడ లేచి నిలిచి బిగ్గరగా వారితో ఇట్లనెను – "యూదయ మనుష్యులారా, యెరూషలేములో కాపురమున్న సమస్త జనులారా, యిది మీకు తెలియును గాక, చెవి యొగ్గి నా మాటలు వినుడి. మీరు ఊహించినట్టు వీరు మత్తులు కారు. ప్రొద్దుబొడిచి జామయిన కాలేదు. యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే, ఏమనగా – అంత్యదినముల యందు నేను మనుష్యులందరి మీద నా ఆత్మ కుమ్మరించెదను. మీ యౌవనులకు దర్శనములు కలుగును, మీ వృద్ధులు కలలు కందురు". "అప్పుడు ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయువారందరు, రక్షణ పొందుదురు" (అపొ.కా. 2:12-17,21).

అప్పుడు జరుగుచున్న దంతయు పాతనిబంధన ప్రవచనముల నెరవేర్పు అని వారికి చూపించిన తరువాత, పేతురు తన ప్రసంగమును గంభీరముగా ఉద్ఘాటించెను. దేవుడు యేసు చేత అద్భుతములను, మహత్కార్యములను, సూచక క్రియలను వారి మధ్యను చేయించి ఆయనను తన వలన మెప్పు పొందిన వానిగా వారికి కనబరచెనని అతడు విశదీకరించెను. ఆయన ఎట్లు అప్పగింపబడి దుష్టుల చేత సిలువ



వేయబడి చంపింపబడెనో అతడు చెప్పెను. అయితే దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను. వారిలో నమ్మకము కలుగునట్లు క్రీస్తును గూర్చి దావీదు చెప్పిన మాటలను వారికి అతడు వినిపించెను. క్రీస్తు జీవించెను చనిపోయెను, పాతిపెట్టబడెను, పునరుత్థానుడై దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడెను. "ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము; కాగా ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రి వలన పొంది మీరు చూచుచు, వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు. దావీదు పరలోకమునకు ఎక్కిపోలేదు; అయితే అతడిట్లనెను నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద పాదపీఠముగా ఉంచువరకు నీవు నా కుడి పార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను. మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసి కొనవలెనని చెప్పెను. వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని – సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును, కడమ అపొస్తలులను అడుగగా – పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్తులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచినవారి కందరికిని చెందునని వారితో చెప్పెను. ఇంకను అనేక విధము లైన మాటలతో సాక్ష్యమిచ్చి మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించెను. కాబట్టి అతని వాక్యము అంగీకరిం చినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి". "వారు ఆనందముతోను,

నిష్కపటమైన హృదయము తోను ఆహారము పుచ్చుకొనుచుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను" (అపొ.కా. 2:32-41,47).

పైన పేర్కొనిన లేఖనములలో ప్రభువు సంఘము స్థాపించబడెను. అదంతయు యెరూషలేములో జరిగెను. పరిశుద్ధాత్మ కుమ్మరించబడెను. ప్రవచనములు నెరవేర్పు ఇక్కడ జరిగెను. "యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే" అని పేతురు ప్రత్యేకముగా చెప్పెను (అపొ.కా. 2:16). గనుక దీనిని గూర్చి సంశయించనవసరము లేదు. ఈ సంగతులన్నియు అంత్యదినములలో జరుగునని ప్రవక్తలు చెప్పిరి, ప్రవక్తలు చెప్పినట్లే అది జరిగెనని పేతురు కూడా చెప్పెను. గనుక అంత్యదినములలో సంఘము స్థాపించబడెను. మారు మనస్సు, పాపక్షమాపణలు బోధించబడగా సమస్త జనులు దానిని వినిరి. మూడు వేల మంది సువార్తకు లోబడిరి, రక్షించబడిరి, సంఘముతో చేర్చబడిరి. గనుక క్రీస్తు తన సంఘమును యెరూషలేములో క్రీ॥శ॥ 33వ సం॥లో స్థాపించెను. అప్పటి నుండి అది నిలిచియున్నది.



4 వ పాఠము

# సంఘ రూపురేఖలు

(Identity of the Church)

అనేక సంవత్సరముల నుండి తప్పిపోయిన మిత్రుని నీవు ఎట్లు కనుగొనగలవు? ముందుగా నీవు అతని రూపురేఖలను గూర్చిన సమాచారము నంతయు సేకరించి అప్పుడు అతని వెదక మొదలిడుదువు గదా? నీవు వెదుకుచున్న మిత్రుని పోలికలన్నిటిని కలిగినవానిని చివరకు నీవు అంగీకరించుదువు. అట్లే ఈ లోకములో అనేక సంఘములున్నవి. అయితే వీటన్నిటిలోను సరియైనది, నిజమైనది ఏదో మనకు ఎట్లు తెలియును? దీనిని తెలిసికొనుటకు మనము నిజ సంఘము యొక్క రూపురేఖలను తెలిసికొని ఈ లోకములో యున్న సంఘములనన్నిటిని ఆ నిజసంఘముతో పోల్చిచూడవలెను. అన్ని విషయములలోను నిజసంఘము యొక్క పోలికలు గల దానినే నిజసంఘమని మనము అంగీకరించక తప్పదు. అయితే నిజసంఘము యొక్క లక్షణములు ఏమి? అవి మనకు ఎక్కడ దొరకును? బైబిలు గ్రంథమే దీనికి జవాబు.

సంఘము యొక్క నిజలక్షణములనన్నిటిని బైబిలు బోధించుచున్నది. గనుక అవి ఏమిటో ఇప్పుడు చూచెదము :

1. క్రీస్తు సంఘమును స్థాపించెను. "మరియు నీవు పేతురువు. ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళ లోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు" అని యేసు చెప్పెను (మత్తయి 16:18).

2. అది యెరూషలేము నందు ఆరంభించబడెను. లూకా 24:45-49 మరియు అపొ.కా. 2:5 లో ఇది మనకు కనబడుచున్నది.

3. అది క్రీ॥శ॥ 33వ సంవత్సరములో ఆరంభించబడెను. పెంతెకోస్తు దినమున ఇది జరిగెను. ఇది అపొ.కా. 2వ అధ్యాయము నందు మనకు కన్పించుచున్నది.

4. సంఘము క్రీస్తు నామమును ధరించెను. అనేక స్థానిక సంఘములను గూర్చి చెబుతూ "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని పౌలు పలికెను (రోమా 16:16). కొరింధులోనున్న సంఘమును ఉద్దేశించి, "మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి, వేరువేరుగా అవయవములైయున్నారు" అని అతడు పలికెను (1 కొరింధి 12:27). అయితే ఈ శరీరమేమైయున్నది? సంఘమైయున్నది (ఎఫెసీ 1:22,23).

5. దాని సభ్యులు క్రైస్తవులనబడిరి. "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొ.కా. 11:26). "అందుకు అగ్రిప్ప–ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే అని పౌలుతో చెప్పెను" (అపొ.కా. 26:28). "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు 4:16). "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:12).

6. క్రీస్తు దానికి శిరస్సు అయియున్నాడు. "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు. ఆయనకు అన్నిటిలోను ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను (కొలస్స 1:18).



7. ఒకే ఒక్కటి ఉన్నది. "శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే. ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి" (ఎఫెసీ 4:4). అయితే ఈ శరీరమేమిటి? అది సంఘము (కొలస్స 1:18). గనుక ఒకే శరీరమున్నట్లయితే ఆ శరీరము సంఘమయితే సంఘము ఒక్కటే యున్నది.

8. సంఘములో చేరుటకు కొన్ని షరతులున్నవి. అవి విశ్వాసము (హెబ్రీ 11:6), మారుమనస్సు (అపొ.కా. 17:30), ఒప్పుకోలు (రోమా 10:9,10), బాప్తిస్మము అనునవి (మార్కు 16:16). ఒకడు రక్షింపబడిన తరువాత సంఘములో చేర్చబడును (అపొ.కా. 2:47). మరియు రోమా 6:3,4; గలతి 3:26,27; 1 కొరింధి 12:13లో చూచిన మనము క్రీస్తు లోనికి, ఆయన సంఘములోనికి బాప్తిస్మము పొందినట్లు గ్రహించగలము. ఈ ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా ఒకడు ఆయన రాజ్యములో లేక సంఘములో జన్మించిన వాడనబడును (యోహాను 3:3,5).

9. సంఘము యొక్క ఆరాధన ప్రత్యేకమైనది. క్రైస్తవులు ఆదివారమున కూడుకొందురు (అపొ.కా. 20:7), పాటలు పాడుదురు (ఎఫెసీ 5:19), ప్రార్ధన చేయుదురు (అపొ.కా. 2:42), వాక్యమును చదువుదురు (2తిమో 2:15), ప్రభువు రాత్రి భోజనమును చేయుదురు (1కొరింధి 11), మరియు చందానిచ్చెదరు (1 కొరింధి 16:2).

10. సంఘబోధ అంతయు బైబిలుపై ఆధారపడియున్నది. దానికి కొంత కలుపుటగాని, తీసివేయుటగాని లేదా మరింకొక దానిని చేయుటగాని జరుగదు (ప్రకటన 22:18,19; గలతి 16–11). బైబిలు ఒక్కటి మాత్రమే సంఘ విశ్వాస ప్రమాణ పుస్తకమైయున్నది. మిగిలిన వాటినన్నిటిని అది తిరస్కరించును.

11. సంఘము యొక్క పరిపాలన అంతయు దేవుని వాక్యమును బట్టి జరుగవలెను. క్రీస్తే శిరస్సు. ప్రతి స్థానిక సంఘము దాని పెద్దలను, పరిచారకులను కలిగియుండవలెను (1తిమోతి 3; తీతు 1). ప్రభువు సంఘమునకు భూలోకములో ఏ మానవుడు శిరస్సుగా లేడు. దానికి ఒక ముఖ్య కేంద్రము లేదు. సరిగదా దానికి జాతీయముగా గాని, అంతర్జాతీయముగా గాని ఒక మానవ కల్పిత ఆర్గనైజేషన్ లేదు.

12. సంఘము యొక్క పని మూడు విధములు. అది సువార్తను ప్రకటించును (మార్కు 16:15,16). ఆపదలో నున్నవారికి సహాయము చేయును (గలతి 6; యాకోబు 2). మరియు సభ్యులను వాక్యము నందు హెచ్చరించును (హెబ్రీ 3:12-14).

13. ప్రతి క్రైస్తవుడు నమ్మకమైన క్రైస్తవ జీవితమును జీవించవలెను. మనము లోకమును ప్రేమించరాదు (1 యోహాను 2:15; యాకోబు 4:4). గాని ఆత్మఫలములను ప్రేమించవలెను (గలతి 5:22,23). నమ్మకమైన జీవితమును జీవించినవారికే నిత్య జీవ కీరిట మియ్యబడును (ప్రకటన 22:10).

పైన చెప్పబడినవి సంఘము యొక్క కొన్ని రూపురేఖలు లేదా లక్షణములు. ఇవన్నియును బైబిలు నుండి తీయబడినవి. నీ సంఘమును వీటితో పోల్చి చూడుము. ఉదాహరణకు మొదటి నాలుగు అంశములను చూడుము. నీ సంఘమును ఎవరు స్థాపించిరి? క్రీస్తా లేక ఒక మానవుడా? నీ సంఘము ఎక్కడ స్థాపించబడినది? యెరూషలేము నందా లేక మరొక చోటనా? నీ సంఘము ఎప్పుడు స్థాపించబడినది? అది క్రీ॥శ॥ 33వ సంవత్సరము తరువాతనైతే అది ప్రభువు సంఘము కానేరదు. నీ సంఘము ఏ నామమును ధరించుకొన్నది? అది క్రీస్తు నామమును ధరించక



పోయినట్లయితే ప్రభువు సంఘమెట్లగును? ఈ లాగున నీవు పరిశోధించిన యెడల నీ సంఘము ప్రభువునిదో లేక మరొక మానవునిదో ఇట్టే గమనించగలవు. మిగిలిన సంఘముల నన్నిటిని నీవు ఇట్లే పోల్చి చూడుము. మంచి మనస్సాక్షి గలవాడవైతే వాటి భేదములను నీవు సులభముగ గ్రహించగలవు.

నీ సంఘము బైబిలు నందున్నట్టి నిజసంఘము కాదని నీవు గ్రహించినట్లయితే దానిని వెనుక వదిలిపెట్టి, సత్యమును తెలిసికొని, దానికి లోబడి, క్రీస్తు సంఘ సభ్యుడవు అగుటకు త్వరపడవలెనని కోరుచున్నాను. అప్పుడు రక్షణ దేనిలో యున్నదో దానిలో నీవు ఉండగలవు.

5 వ పాఠము

# సంఘ నామము

## (Name of the Church)

సంఘము వాక్యప్రకారమైనదయితే అది వాక్యము ననుసరించి యున్న పేరును కలిగియుండవలెను. అయితే నేడు మానవ కల్పిత నామములు కలిగియున్న అనేక మానవ కల్పిత సంఘములున్నవి. ఇవన్నియును ఎట్లు వచ్చినవి? కొన్ని సంఘములు వాటిని స్థాపించిన వారి గౌరవార్థముగా వారి పేర్ల చొప్పుననే పిలువబడినవి. ఉదాహరణకు "లూథరన్" అను నామము. కొన్ని సంఘములు అవి బోధించు బోధను బట్టి గాని లేదా పని చేయు పద్ధతిని బట్టిగాని పిలువబడుచున్నవి. కొన్నయితే ఒక దినమును ప్రాముఖ్యముగా నెంచి ఆ దినమును బట్టియే పిలువబడుచున్నవి. ఉదా: పెంతెకోస్తు, ఏడవదిన అడ్వెంటిస్టువారు. మరి కొన్ని వాటి పరిపాలనా పద్ధతిని బట్టి పిలువబడుచున్నవి. ఇట్టి సంఘములన్నియును క్రీస్తుకు చెందవలసిన మహిమ, స్తుతి, గౌరవములను ఆయన నుండి తీసివేసి వాటితో ఆరంభించిన మానవ నామములకు, బిరుదులకు ఇచ్చుచున్నారు.

మానవ కల్పిత నామములు, బిరుదులు సరియైనవి కావు అని చెప్పుటకు అనేక కారణములున్నవి. మొదటిగా, అవి చీలికలు కల్గించును. దేవుడు కల్పించని భేధములను అవి కల్పించును. మానవులను అవి విడదీయును. ఆయన శిష్యులందరును ఏకమైయుండవలెనని క్రీస్తు యోహాను 17లో చేసిన ప్రార్థనను అవి వ్యతిరేకించును. రెండవదిగా, లేఖనముల యందు అవి ఖండించబడెను. 1 కొరింథి 1:10-17లో మానవ కల్పిత నామములు ధరించుకొని గుంపులుగా చీలికలగుట



దోషము అని అపొస్తలుడైన పౌలు తెలియజేసేను. మూడవదిగా, అవి క్రీస్తు నామమునకు బదులుగా మనుష్యుల నామములను కల్పించును. అయితే క్రీస్తు నామమును గూర్చి వాక్యము ఇట్లు చెప్పుచున్నది: "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపో.కా. 4:12). నాలుగవదిగా, మానవ కల్పిత నామములు విశ్వాసులలో అపార్థములను, గందరగోళమును, విభిన్నతను కలుగజేయును. అవిశ్వాసమునకు అవి దారి తీయును. ఐదవదిగా ఆ నామములు ధరించిన వారినందరినీ అవి క్రీస్తు నుండి తొలగించి నాశనమునకు నడిపించును. అందువలన మానవ కల్పిత నామములు పాపమును, దోషమును అగును.

సంఘమునయితే క్రీస్తే స్థాపించెదనని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). దానిని ఆయన తన స్వరక్తమిచ్చి సంపాదించెను (అపో.కా. 20:28). ఆయన దాని రక్షకుడు (ఎఫెసీ 5:23); దాని శిరస్సు ఆయనే (కొలస్స 1:18). అందువలన సంఘము దాని స్థాపకుని, నిర్మాణకుని, రక్షకుని, శిరస్సుగానున్న వానిని గౌరవించు నిమిత్తము ఆయన పేరునే సహజముగ ధరించుకొనును. గనుక పౌలు రోమాలో యున్న సంఘమునకు ఒక పత్రికను వ్రాయుచు "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యనెడి శుభవచనమును వారికి పంపెను (రోమా 16:16). కొరింథులో నున్న సంఘములో "మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి వేరు వేరుగా అవయవములై యున్నారు" అని అతడు పలికెను (1 కొరింథి 12:27). అయితే శరీరమే సంఘమై యున్నందున అతడు క్రీస్తు సంఘమును గూర్చి మాట్లాడుచున్నాడు (ఎఫెసీ 1:22,23). అది దేవుని సంఘము (1 కొరింథి 1:2, అపో.కా. 20:23). దేవుని

రాజ్యము (ఎఫెసీ 5:5), ఆయన ప్రియకుమారుని రాజ్యము (కొలస్స 1:13), ప్రభువు రాజ్యము (2 పేతురు 1:1). సంఘము (అపొ.కా. 13:1), సజీవుడైన దేవుని సంఘము (1 తిమోతి 3:15), జ్యేష్ఠుని సంఘము (హెబ్రీ 12:23) అనియు పిలువబడినది. ఇవన్నియును సంఘమును వర్ణించుచున్న బైబిలు పదములు. ఏదయితే దేవునిదో అది క్రీస్తుది కూడానని గుర్తుంచుకొనవలెను. పైనుదహరించిన నామములన్నియును క్రీస్తు స్థాపించిన సంఘమును సూచించుచున్నవి. అది క్రీస్తు సంఘము కాని యెడల మరి యెవరి సంఘము? సంఘమును వర్ణించు ఇన్ని పదములు వాక్యము నందుండగా క్రీస్తు సంఘమును వేరొక నామముతో పిలుచువారు లేఖనముల నుండి దూరమైపోవుచున్నారు. గనుక బైబిలు చెప్పునట్లే మనము చేయుదము. అప్పుడు మనము సరిగనుందుము.

సంఘ సభ్యుల నామమును కూడ లేఖనములు వివరించుచున్నవి. దేవుడు తన ప్రజలకు ఒక క్రొత్త నామమును ఇచ్చును అని ప్రవక్తయైన యెషయా ముందుగనే ప్రవచించెను (యెష 62:2). అనేక సంవత్సరముల తరువాత పౌలు ఆ నామమును ధరించెను (అపొ.కా. 9:15). గాని అన్యజనులు కూడ దేవుని వాక్యమునకు లోబడువరకు అది ఈయబడలేదు. ప్రభువు యొక్క శిష్యులు మొట్టమొదట అంతియొకయలో క్రైస్తవులనబడి నప్పుడు ఇదంతయు నెరవేరెను (అపొ.కా. 11:26). కొంత కాలము తరువాత పౌలు అగ్రిప్పరాజుకు వాక్యమును బోధించగా అతడు “ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే” అని పౌలుతో చెప్పెను (అపొ.కా. 26:28). పేతురు కూడ ఇట్లు పలికెను : “ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను” (1 పేతురు 4:16).



దీనిని బట్టి క్రీస్తు అనుచరులు క్రొత్త నిబంధన కాలములో క్రైస్తవులనియు, కేవలము క్రైస్తవులనియు మాత్రమే మనకు విశదమగుచున్నది. ఈనాడు మనము కూడ అట్లే యుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. క్రైస్తవుడు అను పేరునకు మరి కొంత కలిపిన నామమును మనము ధరించిన యెడల మనము నిజ క్రైస్తవులము కాము. క్రైస్తవుడు అను నామము లోకము నుండి ఒకని వేరు చేయును. ప్రభువు కోరునది కూడా అదే.

సంఘ నామమందును, సభ్యుల నామమందును క్రీస్తు నామము హెచ్చించబడవలెను. ఎందువలన? ఏలయనగా అది కుటుంబ నామమయి నందువలన (ఎఫెసీ 3:14,15). ఆ నామము అన్ని నామముల కంటె పై నామమయినందువలన (ఫిలిప్పీ 2:9-11), మరియు ఆ నామములోనే రక్షణ యున్నందువలన (అపొ.కా. 4:12). అందుచే మనము క్రీస్తు నామమందు విశ్వాసముంచవలెను (1 యోహాను 5:13), ఆ నామమును ఒప్పుకొనవలెను (2 తిమో 2:19), మారుమనస్సు పొంది ఆ నామమున బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:38). ఆ నామమున ఆరాధనకు కూడుకొనవలెను (మత్తయి 18:20), అంతయు ఆ నామమున చేయవలెను (కొలస్స 3:17). అట్లు చేయుటచే ఆయన నామమున మనము నిత్య జీవమును పొందగలము (యోహాను 20:30,31).

పై నుదహరించబడిన వానినన్నిటిని గ్రహించిన తరువాత పేరులో ఏమియును లేదు అని ఎవరు చెప్పగలరు? మానవుల నామములలోను, బిరుదులలోను ఏవిధమైన రక్షణ లేదు. వాటిని ధరించుకొనినవారు వాటి వలన నాశనమునకు పోవుదురు. అయితే క్రీస్తు నామమున మాత్రమే రక్షణ యున్నది.

6 వ పాఠము

# సంఘపాలన పద్ధతి

## (Organisation of the Church)

క్రీస్తు సంఘమును స్థాపించెను (మత్తయి 16:18). లోకములో నుండి పిలువబడిన వారందరితో అది కూడియున్నది. (కొలస్స 1:13,14). రక్షింప బడిన వారితో అది సమకూర్చబడినది (అపొ.కా. 2:47). అది క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైయున్నది (కొలస్స 1:18). అది ఒక్కటే ఒక్కటి యున్నది (ఎఫెసీ 4:4).

సంఘము సార్వజనిమైనది. వేలకొలది స్థానిక సంఘములతో అది సమకూడినది. అయితే ప్రతి స్థానిక సంఘము వ్యక్తిగత సభ్యులతో సమకూర్చ బడినది. అందువలన సంఘ ప్రభుత్వము స్థానికమేగాని అది జాతీయము గాని, అంతర్జాతీయము గాని కాదు. వేరొక మాటలో ప్రభువు సంఘమునకు భూలోక సంబంధమైన అధికారి గాని, ముఖ్యకేంద్రము గాని లేదు.

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడని లేఖనములు బోధించుచున్నవి. ఈ క్రింది వచనములను మనము గమనించుదము: "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22,23). "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు" (ఎఫెసీ 5:23). "సంఘము అను శరీరమునకు



ఆయనే శిరస్సు: ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (కొలస్స 1:18). ఈ వచనము లన్నియు ఏమి బోధించుచున్నవి? సంఘము అను శరీరమునకు క్రీస్తే శిరస్సు అని చెప్పబడియున్నది. అయితే ఎన్ని శిరస్సులున్నవి? ఒక్కటి మాత్రమే. అది క్రీస్తు మాత్రమే అయియున్నాడు. ఇతరులెవరితోను ఆయన పంచుకొనలేదు.

అనేక స్థానిక సంఘములతో కూడిన సంఘమునకు క్రీస్తు శిరస్సై యున్నాడు గనుక ఆయన ప్రతి స్థానిక సంఘమునకు, ప్రతి స్థానిక సభ్యునికి శిరస్సై యున్నాడు. దీనికి అనుగుణముగా పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను" (1 కొరింధి 11:3).

ప్రతి స్థానిక సంఘము (Local Congregation) స్థానిక పరిపాలనను కలిగియుండవలెను. క్రీస్తు శిరస్సు అయియుండగా, సంఘము యొక్క ఆత్మీయ, శారీర అవుసరములను తీర్చుట కొరకు, సభ్యులలో నుండి పెద్దలు, పరిచారకులు నియమింపబడవలెను. సభ్యుల ఆత్మలను పెద్దలు సన్మార్గమున నడిపించవలెను (హెబ్రీ 13:7). పరిచారకులయితే భౌతిక అవుసరములను సరిదిద్దవలయును (అపొ.కా. 6). ప్రతి స్థానిక సంఘములోను పెద్దలు, పరిచారకులు అని బహువచనమునే లేఖనములు బోధించుచున్నట్లు గమనించుము. దీనిని బట్టి సంఘములో ఒక్కడే పెద్ద గాని పరిచారకుడుగాని ఎన్నడు ఉండరాదు అని అర్ధమగుచున్నది. ఒక స్థానిక సంఘ పెద్దలు, పరిచారకులు మరియొక

సంఘము పైనిగాని, సంఘముల పైనిగాని అధికారమును చెలాయించరాదు. సంఘములయితే ఒకరితో నొకరు సహవాసము కలిగియుండవలెను గాని, ఒకదానిపై నొకటి అధికారము చెలాయించరాదు.

సంఘ పెద్ద (Elder), కాపరి (Pastor), అధ్యక్షుడు (Bishop) మరియు ప్రెస్బిటర్ (Presbyter) అను పదములన్నియును ఒకే పదవిని సూచించుచున్నవి. 1 తిమోతి 3:1–7 లో పౌలు అనేక అర్హతలను సూచించెను: “ఎవడైనను అధ్యక్ష పదవిని ఆశించిన యెడల అట్టివాడు దొడ్డపనిని ఆపేక్షించుచున్నాడనుమాట నమ్మదగినది. అధ్యక్షుడగువాడు నిందారహితుడును, ఏకపత్నీ పురుషుడును, మితానుభవుడును, స్వస్థబుద్ధి గలవాడును, మర్యాదస్థుడును, అతిథి ప్రియుడును, బోధింపతగినవాడునై యుండి, మద్యపానియు, కొట్టువాడును కాక, సాత్వికుడును, జగడమాడని వాడును, ధనాపేక్ష లేనివాడునై సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరుచుకొనుచు, తన యింటి వారిని బాగుగా ఏలువాడునై యుండ వలెను. ఎవడైనను తన యింటి వారిని ఏలనేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అతడు గర్వాంధుడై అపవాదికి కలిగిన శిక్షావిధికి లోబడకుండునట్లు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు. మరియు అతడు నిందాపాలై అపవాది ఉరిలో పడిపోకుండునట్లు సంఘమునకు వెలుపటి వారి చేత మంచి సాక్ష్యము పొందినవాడై యుండవలెను”. ఇదే అర్హతలు తీతు 1:5–9 లో కూడ చెప్పబడెను. గనుక సంఘములో నున్న ప్రతివారు పెద్దలు కాజాలరు. అర్హత కల్గినవారే సంఘములో పెద్దలుగా నియమింపబడవలెను. అట్టివారు ఒకరి కంటె ఎక్కువ మంది యుండవలెను. ఏ సంఘములోనయితే వారు సభ్యులో ఆ సంఘములోనే వారు పెద్దలుగా నియమింప బడవలెను. అట్టివారు



ఒకరి కంటె ఎక్కువ మంది యుండవలెను. ఏ సంఘములోనయితే పెద్దలుగా నియమింపబడుటకు తగు అర్హత గలిగిన వారు లేరో, అట్టి వారు అర్హతలను పొంది పెద్దలుగా నియమింపబడు వరకు సంఘ పనులను అందున్న పురుషులు చక్కబెట్టవలెను.

పెద్దలతో కలిసి పనిచేయుటకు పరిచారికులను కూడ నియమింప వలెను. వారు సేవకులని పిలువబడుచు స్థానిక సంఘ పెద్దల నడిపింపు చొప్పున పనిచేయవలెను. వారికుండవలసిన అర్హతలను పౌలు ఇట్లు నుడువుచున్నాడు: “అలాగుననే పరిచారకులు మాన్యులై యుండి, ద్విమనస్కులును, మిగుల మద్యపానాసక్తులును , దుర్లాభమునపేక్షించు వారు నైయుండక, విశ్వాస మర్మమును పవిత్రమైన మనసాక్షితో గైకొనువారై యుండవలెను. మరియు వారు మొదట పరీక్షింపబడవలెను; తరువాత వారు అనింద్యులైతే పరిచారకులుగా ఉండవచ్చును. అటువలె పరిచర్య చేయు స్త్రీలును మాన్యులై కొండెములు చెప్పనివారును, మితానుభవము గలవారును, అన్ని విషయములలో నమ్మకమైనవారునై యుండవలెను. పరిచారకులు ఏకపత్నీ పురుషులును, తమ పిల్లలను తమ యింటివారిని బాగుగా ఏలువారునై యుండవలెను. పరిచారకులై యుండి ఆ పనిని బాగుగా నెరవేర్చినవారు మంచి పదవిని సంపాదించుకొని క్రీస్తు యేసు నందలి విశ్వాసమందు బహుధైర్యము గలవారగుదురు” (1 తిమోతి 3:8–13).

ఇది దైవికమైన సంఘ పరిపాలన పద్ధతి. ప్రతి స్థానిక సంఘము నందు పెద్దలు, పరిచారకులు ఉండగా క్రీస్తు దానికి శిరస్సై యున్నాడు. వారి అధికారము క్రిందనే బోధకులు, ఉపదేశకులు, సభ్యులు నడుచు కొనవలెను. ఇట్లుండగా ఏదైన ఒక స్థానిక సంఘము అసత్య మార్గమునకు

తొలగిపోయిన యెడల, మిగిలిన సంఘములు నమ్మకముగా యుండ వచ్చును. ఒకటి తప్ప అన్ని స్థానిక సంఘములు విశ్వాసము నుండి తొలగిపోయిన యెడల, ఆ ఒక్క సంఘమే నమ్మకముగా నుండ వీలగును. ప్రభువు దృష్టిలో ప్రతి స్థానిక సంఘము స్వయంపాలనను కలిగి, మిగిలిన వాటి నుండి స్వతంత్రత కలిగియున్నది. స్థానిక సంఘములన్నియు మానవ కల్పిత చట్టములతో గాక ప్రేమతో పరస్పరము బంధింపబడియున్నవి. అందువలన అవి ఒకదానితో నొకటి సహవాసము కలిగి, కలసి కృషి చేయును. ఏలయనగా అవి క్రీస్తు నందు ఏకమైయున్నవి. దైవమార్గమును మనము అభివృద్ధి చేయలేము.

పేతురు గాని లేదా వేరొక మానవుడు గాని సంఘమునకు శిరస్సుగా నియమింపబడినట్లు లేఖనములలో నీవు ఎక్కడను కనుగొనలేవు. ఒక బిషప్ అనేక సంఘములపై అధికారము కల్గినట్లుగాని లేదా "పాదిరి" సంఘ నాయకునిగా యున్నట్లుగాని నీవు వాక్యమందు ఎన్నడును కనుగొనలేవు. సామాన్య సభ్యులు – గురువులు అను భేదములను కూడ నీవు కనుగొనలేవు. ఈనాడు క్రైస్తవులమని చెప్పుకొను "క్రైస్తవలోకము" దేవుడిచ్చిన స్థానిక సంఘ పాలన పద్ధతి నుండి తొలగిపోయినది. అందువలన వారిలో వేలకొలది చీలికలు ఏర్పడినవి. గనుక సత్య సంఘము యొక్క పరిపాలనా పద్ధతి ననుసరించుట కొరకు అన్ని విషయములలోను బైబిలు ననుసరించి నడుచు కొనుటకు మనము నిశ్చయించుకొందుము గాక.



7 వ పాఠము

# సంఘ ప్రవేశము

## (Entering the Church)

ఇంత వరకు చదివిన దానిలో సంఘము యొక్క ప్రాముఖ్యతను గమనించితిమి. అనేక సంగతులను బట్టి సంఘము ప్రాముఖ్యమైనదని అర్థమగుచున్నది. అవేవన, సంఘము కొరకు క్రీస్తు చనిపోయెను (ఎఫెసీ 5:25), దానిని ఆయన తన స్వరక్తమిచ్చి సంపాదించెను (అపొ.కా. 20:28), దాని రక్షకుడు ఆయనే (ఎఫెసీ 5:23) అని లేఖనములు బోధించుచున్నవి. అయితే ఇప్పుడు కొన్ని ప్రశ్నలు ఉద్భవించుచున్నవి: ప్రాముఖ్యత లేని దాని కొరకు క్రీస్తు చనిపోవునా? విలువ లేని దాని కొరకు ఆయన తన రక్తమును చిందించునా? దానిలో లేకుండగనే ఒకడు రక్షింపబడగలిగితే, అట్టి దానికి ఆయన రక్షకుడగునా? 'అట్లు కాదు' అని ఈ ప్రశ్నలన్నింటికి నీవు జవాబు ఇయ్యగలవు. అది మంచిదే, గాని సంఘము ప్రాముఖ్యము కాదనియు, దానిలో సభ్యులము కాకుండగనే రక్షింపబడగలమనియు కొందరు ఏల చెప్పుచున్నారు? ఏలయనగా అట్టి ప్రజలు సంఘమును అపార్థము చేసికొని యున్నారు. అట్టి విధముగ ఆలోచించుకొనునట్లు వారు మోసగించబడి యున్నారు.

సంఘము రక్షించునని బైబిలు బోధించుట లేదు గాని ఒకడు రక్షింపబడవలెనంటే సంఘమందు ఉండవలెనని బోధించుచున్నది. నోవహు నిర్మించిన ఓడ రక్షకుడు కాదు గాని, నోవహు, అతని కుటుంబము జలప్రళయము నుండి రక్షింపబడుటకు ఓడలో నుండవలసివచ్చెను. సంఘము యొక్క సంగతి కూడ అంతే. అంతే

కాదు, ఒకడు రక్షింపబడగా అతనిని ప్రభువు సంఘముతో చేర్చును. పెంతెకోస్తు నాటి నుండి నేటి వరకు ప్రజలు సువార్తను విని, దానికి లోబడి "రక్షణ పొందుచున్న ప్రతి వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెను" (అపో.కా. 2:47). గనుక ఒకడు రక్షింపబడినట్లయితే అతడు క్రీస్తు సంఘ సభ్యుడగును. సభ్యుడు కాని యెడల అతడు రక్షింపబడలేదు. ఇది బహు సులభమైనది. ఇంకొక మాటలో సంఘమునకు వెలుపల రక్షణ అనేది లేదు. డినామినేషన్ లోను మానవ సంస్థలలోను సభ్యుడు కాకుండ ఒకడు రక్షణ పొందగలడు. గాని అతడు క్రీస్తు సంఘ సభ్యుడు కాకుండ మాత్రము రక్షణ పొందుట అసాధ్యము.

ఇంకొక సంగతి ఏమంటే, క్రీస్తు సంఘము నందు ఒకడు తనకుగా తాను చేరలేడు; గాని రక్షణ పొందుచున్న వారిని ప్రభువు తన సంఘముతో చేర్చును. ఆయన రక్షణ పొందిన వారిని మాత్రమే సంఘ మందు చేర్చును. గనుక సంఘములో రక్షింపబడిన వారుందురు. ఒకని విధేయత నిజమైనదో కాదో మనఃపూర్వకమైనదో కాదో యని ప్రభువు అతని హృదయమును ఆంతరంగిక తలంపులను పరిశీలించును. ఒకడు సహృదయుడై లోబడిన యెడల ప్రభువు అతనిని సంఘముతో చేర్చును. కాని యెడల అతడు బాహ్యక్రియలకు విధేయత చూపించుచున్నట్లు జరిగించినను, అతడు ప్రభువు వలన సంఘమందు చేర్చబడడు. ఒకడు తనకు తానే సంఘమందు చేరగలిగిన యెడల, మనుష్యుల ఆంతరంగిక భావము లెట్లున్నను అందరు అందులో ప్రవేశించగలరు. అందువలననే ఒకని సంఘముతో చేర్చు బాధ్యతను ప్రభువే కలిగియున్నాడు. రక్షింపబడిన వారెవరో, కేవలము బాహ్యక్రియలను చేయు వారెవరో ఆయన యెరుగును గనుక ఆయన తప్పు చేయడు.



సంఘమునకు రక్షకుడు క్రీస్తే; రక్షింపబడిన వారిని అందు చేర్చువాడు ఆయనే గనుక, ఆయన సంఘమందు చేర్చబడుటకు మనము ఏమి చేయవలెనని ఆయన కోరుచున్నాడో సహజముగా తెలిసికొనుట మంచిది. దేవుని వాక్యము నందు ఇది విపులముగ వ్రాయబడియున్నది. అపొస్తలుల కార్యములు అను పుస్తకములో యున్న అనేక మంది మార్పు చెందిన సందర్భములలో ఇది విశదమగుచున్నది. గనుక ప్రభువు సంఘము నందు చేర్చబడుటకు ఉన్న మెట్టులను జాగ్రత్తగ పరిశీలించుదము:

1. ఒకడు సత్యమును వినవలెను. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును: వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17).

2. అతడు దేవుని యందును, క్రీస్తు నందును విశ్వాసముంచవలెను. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయ చేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచుచున్నారు, నా యందును విశ్వాసముంచుడి" యని క్రీస్తు చెప్పెను (యోహాను 14:1).

3. అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును అలాగే నశింతురు" అని క్రీస్తు చెప్పెను (లూకా 13:3).

4. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని ఒప్పుకొనవలెను. అట్లు ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును

వానిని ఒప్పుకొందును అని క్రీస్తే చెప్పెను (మత్తయి 10:32).

5. మరియు అతడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. ఈ బాప్తిస్మము ఒక నీటి సమాధి (రోమా 6:3,4; అపొ.కా. 8:36-39). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

ఈ సంచికలో ముందు మనము ఏమి నేర్చుకొంటిమి? రక్షింపబడిన వారిని ప్రభువు సంఘముతో చేర్చునని కనుగొంటిమి. అనగా ఒకడు ప్రభువునకు విధేయుడై, రక్షింపబడినప్పుడు అతడు తక్షణమే సంఘముతో చేర్చబడును. ఒకడు సత్యమును విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని, బాప్తిస్మము పొందినపుడు అతడు రక్షించబడునని గమనించితిమి. ఒక వ్యక్తి ఈ క్రియలను జరిగించినపుడు అతడు సంఘముతో చేర్చబడును. ప్రభువు ఆజ్ఞలకు మనము విధేయత చూపుట ద్వారా మనము రక్షించబడినపుడు మనలను ఆయనే తన సంఘముతో చేర్చును. ఇది సులభము కదా?

మరొక విధముగ చెప్పవలెనంటే ఒకడు ఆత్మమూలముగను. నీటి మూలముగను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో చేరలేడు అని ప్రభువు చెప్పెను (యోహాను 3:3-5). అయితే దేవుని రాజ్యము అనగా యేమి? అదే క్రీస్తు సంఘము (మత్తయి 16:18,19). సంఘములో ప్రవేశించ వలెననిన ప్రభువు మన కొరకు రెండు మార్గములు నుంచునా? ఎన్నడు కాదు. గనుక ఒకడు నమ్మి బాప్తిస్మము పొందినపుడు (వాక్యము వలన



ఆత్మ ద్వారా జన్మించి, ఆ బోధకు లోబడినపుడు) అతడు దేవుని రాజ్యము లోనికి లేదా దేవుని కుటుంబములోనికి లేదా ప్రభువు సంఘము లోనికి జన్మించినవాడగును.

మరల, మనము ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీ 12:13). అయితే శరీరమనగా యేమి? అదే సంఘము (కొలస్స 1:18). అయితే అవి ఎన్ని ఉన్నవి? ఒక్కటి మాత్రమే (ఎఫెసీ 4:4; 1:22,23). ఒకడు దానిలో ఎట్లు ప్రవేశించును? బాప్తిస్మము పొందుట ద్వారా. అయితే ఒకడు రక్షింపబడవలెననిన, నమ్మి బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). కొరింధులో నున్నవారు దానినే చేసిరి (అపొ.కా. 18:8). గనుక ఒకడు సంఘములోనికి బాప్తిస్మము పొందినపుడు అతడు దానిలో ఒక భాగమవును లేదా దానితో చేర్చబడును.

మనము చూచిన దానిని బట్టి రక్షింపబడుటకు ఒకే ఒక్క మార్గము ఉన్నది. రక్షణ పొందినవారిని ప్రభువు తన సంఘముతో చేర్చును. నీవు బైబిలు నందున్నట్టి సంఘ సభ్యుడవా? కాని యెడల నీవు రక్షించబడలేదు. బైబిలును పరిశోధించి, పఠించి ప్రభువునకు లోబడుము. అప్పుడు ఆయనే నిన్ను తన సంఘముతో చేర్చును.

8 వ పాఠము

# సంఘారాధన

## (Worship of the Church)

రక్షణ పొందిన వారితో సంఘము సమకూర్చబడియున్నది. యేసు క్రీస్తు ద్వారా దేవుని సేవించి, ఆరాధించుటయే దాని ముఖ్యోద్దేశమైయున్నది. పౌలు ఇట్లు చెప్పెను : "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరిట చేయుడి" (కొలస్స 3:17).

క్రొత్త నిబంధనలో మూడు రకములైన ఆరాధనలు కన్పడుచున్నవి. మొదటిది, తెలియని ఆరాధన. పౌలు ఏథెన్సు పట్టణములో యున్న అనేక విగ్రహములను చూచి ఇట్లు చెప్పెను: "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దాని మీద తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేని యందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచు చున్నాను" (అపో.కా. 17:23). తెలియని ఆరాధనను జరిగించువారు ఆనాడు, ఈనాడు కూడ కొందరు కలరు. లక్షలాది ప్రజలు విగ్రహములకు, ప్రతిమలకు మ్రొక్కుట మాత్రమే గాక, వేలకొలది ప్రజలు లేఖనములు నెరుగక అనేక మతాచారము లలోబడియున్నారు.

రెండవది, వ్యర్థారాధనను గూర్చి బైబిలు బోధించుచున్నది. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని క్రీస్తు చెప్పెను (మత్తయి



15:9). ప్రజలలో అనేకులు ఈనాడు దేవుని వ్యర్థముగా ఆరాధించుచున్నారు. వారు ప్రభువునే ఆరాధించుచున్నారన్న మాట నిజమే, కాని వారి ఆరాధన దైవచిత్తము ననుసరించి యుండనందునను, మానవ కల్పిత సిద్ధాంతముల పైనను, ఉపదేశముల చొప్పున ఉండుటవలనను, అది వ్యర్థము. అట్టిది ప్రయోజన శూన్యమైనది.

మూడవది, సత్యారాధనను గూర్చి బైబిలు బోధించుచున్నది. అది ఆత్మతోను, సత్యముతోను కూడినదైయున్నది. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" అని క్రీస్తు పలికెను (యోహాను 4:24). దేవుడు అంగీకరించు ఆరాధన ఇది ఒక్కటి మాత్రమే. క్రీస్తు దినములలోను, ఇప్పుడు మన దినములలోను ఇది నిజము. ఆత్మ వలన దేవుని తట్టు జరిగించు ఆరాధన ఇది. వినయముతో భావసహితమై యుండి సత్య లేఖనముల ననుసరించి యుండు ఆరాధన ఇది. ఆరాధన చేయుమని దేవుడు ఎవరినీ బలవంతము చేయడు. కాని ఆయన నారాధించువారు ఆయన చెప్పునట్లు చేయవలెను.

క్రీస్తు సంఘము చేయవలసిన ఆరాధన యెట్టిది? అది తెలియని ఆరాధనా? కానే కాదు. మానవ కల్పిత బోధనల ననుసరించియున్న ఆరాధనా? అంతకు ముందే కాదు. కాని అది ఆత్మతోను, సత్యముతోను యుండి దేవుని కంగీకారమైనదై యుండవలెను. మనము క్రొత్త నిబంధనను చదువుచుండగా అందున్న ఆజ్ఞలు మూలముగను, మాదిరిని బట్టియు చూచిన ఆదిమ సంఘము ఈ క్రింది 5 అంశములను ఆరాధనలో జరిగించినట్లు కనుగొందుము:

1. వాక్యము చదువుటకు వారు కూడుకొనిరి. పరిశుద్ధ లేఖనములను తిమోతి బాల్యము నుండియు ఎరిగినను (2 తిమో 3:15),

“దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగ ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము” అని పౌలు అతనిని హెచ్చరించెను. ఇది క్రైస్తవులందరికీ, మరి ముఖ్యముగ ఆరాధనకు కూడి వచ్చిన వారికి వర్తించును. వాక్యము ద్వారా దేవుడు తన బిడ్డలతో మాటలాడు సమయమిది. అపొస్తలులు కార్యములు 20:7 లో సహోదరులకు పౌలు ప్రసంగించుట ద్వారా వాక్యమును బోధించినట్లు గ్రహించగలము.

2. వారు ప్రార్థన చేసిరి. పెంతెకోస్తు దినమున సువార్తకు లోబడిన వారు “అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి” (అపొ.కా. 2:42). ప్రార్థన ద్వారా దేవుని బిడ్డలకు పరలోకమందున్న తండ్రితో మాటలాడు తరుణము దొరకుచున్నది. క్రైస్తవులు ఆరాధనకు కూడి వచ్చినప్పుడు ప్రార్థన చేయకపోవుట జరుగదు.

3. వారు కీర్తనలు పాడిరి. పౌలు తన సహోదరులకు ఇట్లు వ్రాసెను: “ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు, కీర్తించుచు దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి” (ఎఫెసీ 5:19). మరియు కొలస్స 3:16, హెబ్రీ 13:15 లను చదువుము. రెండు రకములైన సంగీతము కలదు. ఒకటి గాత్రము, రెండవది జంత్రము. అయితే దేవుడు కోరునట్టి సంగీతమేది? మనము హృదయములలో ప్రభుని గూర్చి గానము చేయవలెనని పౌలు చెప్పుచున్నాడు. గనుక ఇది వాయిద్య సంగీతమును బహిష్కరించును. మొదటి క్రైస్తవులు స్తుతిగానములను పాడిరి. అనేక శతాబ్దములు తరువాత మానవులు వాయిద్యములను ఆరాధనలో ప్రవేశపెట్టిరి. అది దేవునిచే



ఏర్పాటు చేయబడలేదు. దేవుడు దానిని అంగీకరించడు. క్రైస్తవులు వాయిద్య సంగీతముతో ఆరాధన చేసి దేవుని స్తుతించలేదు.

4. వారు ప్రభు రాత్రి భోజనము పాలు పుచ్చుకొనుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7 లో దీని మాదిరి మనకొకటి యున్నది. మత్తయి 26:26-28 లోను, 1 కొరింథి 11వ అధ్యాయములోను, మనము రొట్టెను క్రీస్తు శరీరమునకు జ్ఞాపకార్థముగాను, ద్రాక్షరసమును క్రీస్తు రక్తమునకు జ్ఞాపకార్థముగాను చేయవలెనని వ్రాయబడియున్నది. నేడు మనము కూడ దీనిని ఇట్లు జరిగించవలెను.

5. వారు కానుకల నిచ్చిరి. గలతీయలోను, కొరింథులోను ఉన్న సహోదరులను పౌలు ఇట్లు హెచ్చరించెను: “నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను” (1 కొరింథీ 16:2). 2 కొరింథి 9:7ను కూడ చదువుము.

ఆదిమ క్రైస్తవులు దేవుని నారాధించుటకు ఆదివారమున కూడుకొనిరి (అపొ.కా. 20:7, 1 కొరింథి 16:2). “కొందరు మానుకొనుచున్నట్లుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగున చేయుడి” యని వారు హెచ్చరింపబడిరి (హెబ్రీ 10:24,25). నేటి క్రైస్తవులు కూడ ఆదివార దినమున ఆరాధన చేయవలెను గనుక ఈ హెచ్చరిక వారికిని వర్తించును.

సంఘారాధన బహు సులభమైనది, సూక్ష్మమైనది గనుక అనేకులు తడబడుచున్నారు. అది పూజలతోను, పునస్కారములతోను, మానవ కల్పిత ఆచరణలతోను, ఆడంబరముతోను ఉండవలెనని వారనుకొందురు.

అయితే అది అట్లు లేదు. ఆరాధనను గూర్చి దేవుడు తన చిత్తమును తన గ్రంథ మందు బయలుపరచెను. దానిని ఇసుమంతయును మార్చుటకు మానవునికి సెలవు లేదు. దేవుని శాపమునకు గురి కాకుండగా దానికి కలుపుటగాని దాని నుండి తీసివేయుట గాని జరుగ నేరదు. దేవుడే మాట్లాడెను గనుక ఆయన ప్రజలు ఆయనకు లోబడవలెను. అప్పుడు మాత్రమే మనము దేవుని స్తుతించి, మహిమపరచి, ఆరాధించగలము.



9 వ పాఠము

# సంఘము యొక్క పని

(Work of the Church)

సంఘము ఎందుకు ఉన్నది? దాని ప్రయోజనమేమి? దాని పని ఏమి? వాటిని తెలిసికొనుటకు మనము దేవుని వాక్యము నొద్దకు వెళ్లుదము.

సంఘము ఈ లోక సంబంధమైన వ్యాపారములో లేదు అని గమనించవలెను. పాఠశాలలను, ఆసుపత్రులను నడిపించుట దాని పని కాదు. ధనార్జన కొరకు గ్రంథములను ప్రచురించి విక్రయించు వ్యాపారము నందు అది లేదు. ఈ పనులన్నియును మంచివే. క్రైస్తవులు వ్యక్తిగతముగ వీటిని జరిగించు హక్కు కలిగినవారయినను, అవి మాత్రము సంఘము యొక్క పని కాదు. ఈనాటి క్రైస్తవ లోకము పైనుదహరింపబడిన పనులపై ఎక్కువ కేంద్రీకృతమై దేవుని నుండియు, బైబిలు నుండియు, ఆయన కార్యక్రమము నుండియు మరింత దూరమైపోయినది.

మనము దైవగ్రంథపు పుటలను తిరుగవేసిన యెడల సంఘము యొక్క పని మూడు విధములుగ నున్నదని గమనించగలము: సువార్తను ప్రకటించుట, ఆపదలలో నున్నవారిని ఆదుకొనుట, సంఘ క్షేమాభివృద్ధి కలుగ జేయుట. వీటిని ఒక్కొక్క దానిని ఇప్పుడు గమనించుదము:

1. సువార్తను ప్రకటించుట : క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచి పరలోకమున కెక్కిపోక ముందు తన శిష్యులకిట్లు బోధించెను: “కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి: తండ్రి యొక్కయు

కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను" (మత్తయి 28:19,20). "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింప బడును" (మార్కు 16:15,16). తరువాత యౌవన బోధకుడైన తిమోతిని పౌలు ఇట్లు హెచ్చరించెను: "వాక్యమును ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణ దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము" (2 తిమోతి 4:2). ఇంకను అట్టి అనేక వచనములను మనము చూడవచ్చును గాని ఈ పైన చెప్పబడిన వచనముల ద్వారా సువార్త ప్రకటన జరుగవలెననెడి దేవుని అభిలాష మనకు తప్పక వ్యక్తమగుచున్నది.

అపొస్తలులు కాలములో సంఘము ఏమి చేసెను? ప్రభువు వారిని ఏమి చేయవలెనని కోరెనో దానినే సంఘ సభ్యులు చేసిరి. వారు వాక్యమును ప్రకటించిరి. అపొస్తలులు కార్యములు అను పుస్తకము ఈ ఉదాహరణలతో నిండియున్నది. వాక్యమును బోధించుట ద్వారా జనులు మార్పు చెందిన సందర్భములందున్నవి. అపొస్తలుల కార్యములలో 2,8,9,10,16వ అధ్యాయములను చదువుము. వాక్యమును ఎవరు ప్రకటించి బోధించిరి? యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగిన తరువాత "చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" యని బైబిలు చెప్పుచున్నది (అపొ.కా. 8:4).



వారు ఏమి బోధించిరి? ఇది తెలిసికొనవలెనినిన అపొస్తలుల కార్యముల గ్రంథములో మార్పు చెందినవారి సంగతిని చదివిన చాలును. అయితే క్లుప్తముగా, వారు క్రీస్తు యొక్క దైవత్వమును బోధించిరి, రక్షణ మార్గమును, సంఘ ప్రాముఖ్యతను, ఆరాధనాంశములను, క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతను మొదలగు వాటిని బోధించిరి. దానినంతటిని పౌలు సంక్షిప్తముగ ఇట్లు నుడివెను: "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1 కొరింధి 1:18).

తన వాక్యము ప్రకటింపబడవలెనని ప్రభువు ఆజ్ఞాపించుటయే గాక, దేవుని వాక్యమును వినుట ద్వారా విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:32). మరల "వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండా వారెట్లు విందురు?" (రోమా 10:14). దీని యంతటి భావమేనగా– మానవుడు నశించిపోవుచున్నాడు (రోమా 3:23; 6:23). గనుక దేవుని ప్రేమ ప్రకటింపబడవలెను (యోహాను 3:16). మరియు దేవునికి విధేయత చూపుట ద్వారా మానవుడు పాపముల నుండి రక్షింపబడగలడు (రోమా 1:16,17; మార్కు 16:15,16). దేవుని చిత్తము నెవరు ఎరుగరో, ఆయనకు ఎవరు లోబడరో వారందరు నశింతురు(2 థెస్స 1:7–9). అందువలన దేవుని వాక్యము ప్రకటింపబడవలెను.

2. బీదలకు సహాయము చేయుట : ఆపదలలో నున్న వారి యెడల సంఘము ఆసక్తి కలిగియుండెనని, అట్టి వారికి శక్తి కొలది సహాయము

చేయుట జరిగెనని మనము దేవుని గ్రంథ మందు చూడగలము. అపొ.కా. 2:45 ఇట్లు చెప్పుచున్నది: "ఇదియు గాక వారు తమ చరస్థిరాస్థులను అమ్మి, అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి". ఇది హృదయ పూర్వకముగా చేయబడినది. అయితే అపొ.కా. 6వ అధ్యాయములో, అనుదిన పరిచర్యలో తమలోని విధవరాండ్రను చిన్న చూపు చూచిరని హెబ్రీయుల మీద గ్రీకు భాష మాట్లాడు యూదులు సణుగసాగినట్లు కన్పడుచున్నది. గనుక అపొస్తలులు శిష్యుల సమూహమును పిలచి సంఘములో ఈ ప్రత్యేక పనికి నియమింపబడు నిమిత్తము యేడుగురు మనుష్యులను ఏర్పరచిరి.

యెరూషలేములోనున్న పేద పరిశుద్ధుల పరిచర్యకు పౌలు వెళ్ళినట్లు మనము చదువగలము. "అయితే ఇప్పుడు పరిశుద్ధుల కొరకు పరిచర్య చేయుచు యెరూషలేము వెళ్లుచున్నాను. ఏలయనగా యెరూషలేములో ఉన్న పరిశుద్ధులలో బీదలైన వారి నిమిత్తము మాసిదోనియవారును, అకయవారును కొంత సొమ్ము చందా వేయనిష్టపడిరి" (రోమా 15: 25,26) అని పౌలు వ్రాసెను. కొరింథులో యున్న సహోదరులకు పౌలు ఇట్లు వ్రాసెను: "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతి వాడును తాను వర్ధిల్లినకొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింధి 16:1,2).

ఎవరికి సహాయము చేయవలెను? మొదటిగా సంఘమందు ఆపదలో నున్నవారికి అనగా బీదలు, వృద్ధులు, విధవరాండ్రు, క్రైస్తవ అనాథలు, ప్రమాదములలో చిక్కుకొనిని వారు మొదలగువారు. "కాబట్టి



మనకు సమయము దొరికినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10). ఎవరికిబడితే వారికి సహాయము చేయుటయని కాదు. 1 తిమోతి 5వ అధ్యాయములో మనము చూచిన యెడల నిస్సహాయులకు, ఆదుకొన బంధువులు లేనివారికి, నమ్మకమైన క్రైస్తవులని నిరూపించుకొనిన నిరాధా రులకు సహాయము చేయవలెనని గమించగలము. గనుక దేవుని ధనమును జాగ్రత్తగ వినియోగించవలెను, అడిగిన వారికందరికి పంచిపెట్టుట జరుగకూడదు.

సహాయము సంఘ సభ్యులకు మాత్రమే కాకుండా, సంఘ స్తోమతను బట్టి ఆపదలో నున్న వారికందరికి అందజేయవలెను. యాకోబు 1:27ను, యాకోబు 2వ అధ్యాయమును చదువుము. ప్రజలకు సువార్తను అందజేయు మార్గము ఇది ఒకటి.

ఇట్టి పనిని చేయుటకు ధనము ఎక్కడ నుండి వచ్చును? ప్రోత్సాహము కలిగి కానుకల నిచ్చు సభ్యుల నుండి వచ్చును (1 కొరింధి 16:1,2; 2 కొరింధి 9:6,7). అంటే క్రైస్తవులు కానుకల నియ్యని యెడల ఆపదలో నున్నవారికి సహాయము చేయుటకు సంఘమునకు అవకాశముండదు.

3. సంఘ క్షేమాభివృద్ధి కలుగజేయుట : క్షేమాభివృద్ధియనగా సంఘమును సమకూర్చుట, పటిష్టము చేయుట, ప్రోత్సహించుట, సభ్యులలో ఆత్మీయో ద్రేకమును కలుగజేయుట, క్షేమాభివృద్ధిని కలుగజేయునవేమి? దేవుని వాక్యము, సహవాసము, ఆరాధన, పరస్పర సహాయము, సత్క్రియలు, ప్రేమ మొదలగునవి. అపొ.కా. 9:31; రోమా 14:19; 1 కొరింధి 8:1; థెస్స 5:11; 1 కొరింధి 14:26; 2 కొరింధి

12:19; ఎఫెసీ 4:12 లను చదువుము.

ఈ పనులన్నిటిని సంఘము ఖండాంతర ఆర్గనైజేషన్ లేకుండను, ఒక మానవాధికారి లేకుండగను, ధనమును ప్రత్యేకముగ పోగుచేయకుండ గను ఎట్లు జరిగించగలదు అని అనేకులు ఆశ్చర్యపడుదురు. అయితే ప్రభువు మార్గమే సరియైన మార్గము. ఆయన పని చేయు మార్గము. అది ఒక్కటే. మనము దేవుని చిత్తమును నెరవేర్చుచు, తద్వారా ఈ భూమిపై మన ఉనికిని నిర్వర్తించుచున్న యెడల స్తుతి, మహిమ, ఘనతలు దేవునికి చెల్లును. క్రీస్తే సంఘమునకు శిరస్సై యున్నాడు. ప్రతి స్థానిక సంఘము, ప్రతి సభ్యుడు వారి వారి బాధ్యతలను నెరవేర్చవలెను. సంఘ సభ్యులు వర్ధిల్లినకొలది, దేవునికి ఇచ్చుట ద్వారానే సంఘము తన పనిని నిర్వర్తించుటకవకాశము దొరుకును.

సువార్త ప్రకటించుట, నిస్సహాయులకు సహాయము చేయుట క్షేమాభివృద్ధి కలుగజేయుట యనునవన్నియును మానవుల ఆత్మలను రక్షించుట కొరకు ఉద్దేశించబడిన పనులు మాత్రమే. వాటి ద్వారా దేవుడే స్తుతింపబడును. సంఘమునకు ఇది గాక వేరొక పనిని ఏదియును లేదు. రాజకీయములు, వ్యాపారము మొదలగునవి సంఘమునొక సాంఘిక సంస్థగా మాత్రమే తయారుచేయును. అవి దేవుని యొద్ద నుండి కలిగినవి కావు. క్రీస్తు సంఘము ఒక ఆత్మీయ సంస్థయై యున్నది. అది లోకములో యున్నది కాని లోకసంబంధమైనది కాదు. దేవునికి లోబడుచు మానవసేవ చేయుచు, సభ్యులందరి ఆత్మల రక్షణార్థము, పవిత్రముగను, పరిశుద్ధముగను ఉండి దాని సృష్టికర్తకు మహిమను తెచ్చుటయే దాని బాధ్యత. ఇదియే క్రీస్తు సంఘము, ఇదియే దాని కృషి. ఇదియే దాని కర్తవ్యము.





# సంఘ ఐక్యత

## (Unity of the Church)

సంఘ ఐక్యత కొరకు నేటి క్రైస్తవలోకము ముందెన్నడు లేనంత గట్టిగా పనిచేయుచున్నది. ప్రతి మానవుడు దీని నెరిగేయున్నాడు. ఏలయనగా ఈ లోకము అంతా మత శాఖలతో నిండియున్నది. అందరూ ఈ విభజనలను బట్టి విసిగిపోయి ఉన్నారు. అయితే మానవ కల్పిత శాఖలలో ఐక్యత నెలకొల్పుట అసాధ్యము. ఏలయనగా లోకమందంతటా మానవులు విభజనలు కలిగియుండుటకు ఏకమై యున్నట్లున్నారు! ఈ శాఖలలో ఒక రకమైన ఏకత్వము ఒక వేళ సంభవించినను విభేధములుండక మానవు. గనుక దానికి విరుగుడుయేమి? దాని విరుగుడు బైబిలు నందే యున్నది. నిజమైన ఐక్యత నెలకొల్పబడు నిమిత్తము మనుష్యులు వారి సొంత బోధనలను, సిద్ధాంతములను, నామములను, సంఘములను, ప్రమాణ పుస్తకములను పరిత్యజించవలయును. వారు బైబిలును పరిగ్రహించి, పఠించి, దానిని విశ్వసించి, విధేయత చూపవలెను. అప్పుడు మాత్రమే సరియైన ఐక్యత, యేసు ప్రభువు యోహాను 17లో ప్రార్థించినయట్టి ఐక్యత సాధ్యమగును. మానవులిట్లు చేయునప్పుడు వారందరు ఒకే విశ్వాసమును కలిగియుందురు, ఒకే బోధకు లోబడుదురు, ఒకే నామమును ధరించు కొందురు. అందరు కలిసి పనిచేయుదురు, ఒకే బోధను బోధింతురు, అందరు కలిసి పరలోకమునకు వెళ్లుదురు. మానవుడు మరియొక మానివుని వెంబడించుటమాని క్రీస్తుని వెంబడించుటకు మొదలిడిన యెడల

అతి సులభముగ ఐక్యత నెలకొల్పబడును.

లేఖనములు విభజనను ఖండించుచున్నవి. సహోదరులలో జగడములు, విభజనము పుట్టించువానిని దేవుడు అసహ్యించుకొనునని బైబిలు చెప్పుచున్నది (సామెతలు 6:19). 1 కొరింథి మొదటి అధ్యాయములో కొరింథులో నున్న సంఘము విభజింపబడియుండుట మనకు కన్పబడును. ఇట్టి దానిని చూచి హర్షించుట కంటె దానిని సమూలాగ్రముగ నాశనము చేయుటకు అపొస్తలుడైన పౌలు అతి త్వరితముగ పూనుకొనెను. అతడిట్లా రంభించెను: "సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలె ననియు, మీలో కక్షలు లేక యేక మనస్సుతోను, ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1 కొరింథీ 1:10). వారు చేసిన పనిలోని అసంగతములు వారికి కన్పడు రీతిగ మూడు ప్రశ్నల నతడు వారినడిగెను. అవేవన: క్రీస్తు విభజింపబడియున్నాడా? పౌలు మీ కొరకు సిలువేయ బడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా? ఈ మూడింటికి అట్లు కాదు అని వారు జవాబియ్యవలసి వచ్చెను. గనుక విభజింపబడిన స్థితిలో యున్న వారి బుద్ధిహీనతను అతడు వారికి బయలుపరచెను.

అదే అపొస్తలుడైన పౌలు రోమాలో యున్న సహోదరులకిట్లు వ్రాసెను: "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగచేయువారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి. అట్టి వారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు



ఇంపైన మాటల వలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17,18). కొలస్స 2:20–22లో అతడిట్లు చెప్పెను: "మీరు క్రీస్తుతో కూడ లోకము యొక్క మూలపాఠముల విషయమై మృతి పొందిన వారైతే లోకములో బ్రతుకుచున్నట్లుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి – చేతపట్టుకొనవద్దు, రుచి చూడవద్దు, ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల? అవన్నియు వాడుకొనుట చేత నశించి పోవును".

దీని అంతటి భావమేనగా మానవుల పద్ధతులు, ఆజ్ఞలు, బోధలు మానవులకే ఘనత నిచ్చును, బైబిలుకు వేరుగా యున్న గ్రంథముల ననుసరింపజేయుచు విభజనలను కల్పించును. అది అట్లుండగా క్రీస్తును వెంబడించుట ద్వారా ఐక్యతను సాధించి అనుభవించవచ్చును. క్రీస్తు ఇట్లు ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నా యందు నీవును నీ యందు నేనును ఉన్నలాగున వారును మన యందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నా యందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20,21). అసాధ్యమైనదాని కొరకు క్రీస్తు ప్రార్థించెనా? లేదు. గనుక ఐక్యత సాధించుట తప్పక సాధ్యమే. అయితే ఎప్పుడు? మనము క్రీస్తును మాత్రమే వెంబడించినప్పుడు. మానవ కల్పిత సిద్ధాంతములు మనలను విభజించును గాని బైబిలు బోధలు మనలను ఐక్యపరచును.

ఎఫెసీ 4:1–4 ఐక్యతను సాధించుట కొరకు సూత్రము మనకున్నది. దానిని ఇప్పుడు వినుము: "కాబట్టి మీరు సమాధానమను బంధము

చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగినవారై ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకొనవలెనని ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను. శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్న వాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు". ఇది ఐక్యత కొరకొక విన్నపము అని గమనించుము. చెప్పబడిన వన్నియును ఒక్కొక్కటే యున్నదని కూడ గమనించుము. ఒక్కటి కంటె ఎక్కువ యున్నవని తలంచగలవారెవరు?

సంఘ ఐక్యత క్రీస్తు పలుకులలోనే ఇమిడియున్నది. నా సంఘమును నేను కట్టుదును అని ఆయన చెప్పిన మాటలలో ఏకత్వమున్నది (మత్తయి 16:18). అది ఆయన ఆత్మీయ శరీరమైయున్నది (1 కొరింథి 12:27), దానికి ఆయన శిరస్సై యున్నాడు (కొలస్స 1:18). క్రీస్తుకు రెండు శరీరములు, రెండు తలలు ఉన్నవని ఎవడును ఆరోపించలేడు గదా. సంఘము దేవుని గృహమని, ఆయన కుటుంబమని కూడ వివరించబడినది (1 తిమోతి 3:15). అయితే ఎన్ని గృహములు లేక కుటుంబములు దేవునికి ఉన్నవి? ఒక్కటి మాత్రమే గదా! క్రీస్తు రాజైయుండగా క్రీస్తు రాజ్యమును గూర్చియు లేదా దేవుని రాజ్యమును గూర్చియు మనము చదువగలము (యోహాను 3:3-5; కొలస్స 4:11; 1 తిమో 6:15). దేవునికి ఎన్ని రాజ్యములున్నవి? రాజు లెంతమంది? ఈ రెండు సందర్భములలోను ఉన్నది ఒక్కటి మాత్రమే.



ఇంకా అనేక సంగతులు మనము చెప్పుకొనవచ్చును. డినామినేషన్లను, తద్వారా వచ్చిన విభజనలను బైబిలు తప్పక ద్వేషించుచున్నది. వ్యతిరేకించు చున్నది. సరి గదా అది ఐక్యతను, ఏకత్వమును, పరిపూర్ణతను, పరిశుద్ధతను వర్ణించుచున్నది. సంఘమనగా వివిధ విశ్వాసములతోను, ఆచారములతోను నిండియున్న సంస్థయని బైబిలు వర్ణించుట లేదు గాని, అది క్రీస్తుకు చెందినదని, పిలువబడినవారిచే అది సమకూర్చబడినదని, క్రీస్తును వెంబడించి ఆయన బోధకులోబడి రక్షించబడినవారితో అది నిండియున్నదని వర్ణించుచున్నది. క్రీస్తు విభజింపబడలేదు. ఆయన సంఘము కూడ విభజింపబడలేదు. విభజింపబడి యుండి, విభాగములను సమర్ధించుట యేసు క్రీస్తును, ఆయన చేసి ప్రార్థనను వ్యతిరేకించుటయగును.

11 వ పాఠము

# సంఘ విశ్వాసము

## (Creed of the Church)

Credo అను లాటిన్ పదము నుండి Creed అను ఆంగ్ల పదముద్భ వించినది. క్రీడ్ అను ఆంగ్ల పదమును ఇట్లు నిర్వచింపవచ్చును. "అధికార పూరితమైన భక్తి సూత్రము, ఒక విశ్వాసము; విశ్వాసము నొప్పుకొను ఏదైనా ఒక సూత్రము, పాటించబడు సిద్ధాంతము యొక్కయు, అభిప్రాయముల యొక్కయు సంగ్రహణ". విశ్వాస ప్రమాణము అనగా కొందరు "అపొస్తలులు విశ్వాస ప్రమాణము" లేదా "నైసీన్ ప్రమాణమును" తలంచుదురు. అయితే వానిలో ఏ ఒక్కదాని గూర్చియు బైబిలు నందు లేదు. అయితే ప్రతి మానవ కల్పివత సంఘము మానవకల్పిత ప్రమాణ పుస్తకములను కలిగియున్నది. అట్టివన్నియు దేవుని వాక్యమునకు అదనముగా కల్పించినట్టివే.

బైబిలులో ఉన్న దాని కంటె ఎక్కువ కలిగిన ప్రమాణ పుస్తకము ఏదైనను బైబిలు కంటె మితిమీరినదగును. బైబిలునందున్న దాని కంటె తక్కువ కలిగిన ప్రమాణ పుస్తకము బహు తక్కువ కలిగియుండును. బైబిలు నందున్న సంగతులే కలిగియున్న ప్రమాణ పుస్తకము, మన యొద్ద బైబిలు ఉన్నందున ప్రయోజనము లేనిదగును. మనము దేవుని వాక్యమునకు కలుపుటగాని, తీసివేయుటగాని లేదా వేరొకటి దానియందుంచుట గాని చేయరాదని ప్రకటన 22:18,19; గలతీ 1:6-9 లు వక్కాణించుచున్నవి. వేరొక మాటలో - లేఖనములు సంపూర్ణములు, అవి పరిపూర్ణములు (2 తిమో 3:16,17; యాకోబు 1:25). మనము దైవోక్తులను బోధింపవలెను (1 పేతురు 4:11). అందువలన ఇతర గ్రంథముల యొక్క అవుసరత ఏమియును లేదు.

నేటి క్రైస్తవ లోకమంతయు మానవ కల్పిత ప్రమాణముల వలననే విభజింపబడెను గాని బైబిలు ననుసరించుట వలన మాత్రము కాదు. ప్రతి సంఘము దాని ప్రత్యేక నియమమును కలిగియుండవలెనని కొందరు వాదింతురు. అలాగనుటలో వారు బైబిలును విసర్జించిరియని యర్థము ఎంత విచారము! అందువలననే మానవ కల్పిత గ్రంథములను విసర్జించి, దేవుని వాక్యమయిన బైబిలునొద్దకు మరలవలెనని మేము అందరినీ కోరుచున్నాము. బైబిలు మనలను యేసు క్రీస్తు నందు ఏకము చేయును గాని వేరు చేయదు.

క్రీస్తు సంఘము యొక్క విశ్వాస ప్రమాణము ఏమి? క్రీస్తు తప్ప వేరొక రక్షకుడు మనకు లేడు, బైబిలు తప్ప వేరొక ప్రమాణము మాకు లేదు. మత సంబంధమైన మన అభిప్రాయములు, తలంపులు నిష్ప్రయోజనములు. బైబిలును గూర్చిన స్వకీయ వివరణము మాకు లేదు. మాకు ఉన్నదంతయు బైబిలు మాత్రమే. దాని బోధలకు మేము లోబడియుంటిమి, మరియు ఇతరులకు దానిని సూచించుచుంటిమి. అందరును దానిని గ్రహించవలెనని మేము కోరుచున్నాము (యోహా 5:39; 2 తిమో 2:15). మనుష్యులందరు, అంతటను బైబిలు బోధించునట్లే చేయవలెనని మేము కోరుచున్నాము.

మేము అనుసరించు అదనపు గ్రంథము లేక గ్రంథములు ఏమియును లేవు. ఏ మానవుడును బైబిలుతో సరిసమానమగు నియమావళి వ్రాయలేడు అని మా విశ్వాసము. అట్టి గ్రంథమును వ్రాయుటకు ప్రభువు ఎవరికిని అధికారమునియ్యలేదు. అట్టి గ్రంథమును

వ్రాయుటకు పరిశుద్ధాత్ముడు ఎవరికిని ఆత్మీయావేశము నీయలేదని మా విశ్వాసము.

దేవుని యొద్ద నుండి, దైవావేశముచే నీయబడిన దేవుని వాక్యము మాత్రమే మనలను రక్షించును. సరిగదా ఆ దేవుని వాక్యమే మనలను అంత్యదినమందు తీర్పు తీర్చును (యోహా 12:48). అనేక ఇట్టి కారణముల వలన మత సంబంధ సంగతులలో దానిని మేము మార్గదర్శిగా అంగీకరించుచు, ఇతరులు కూడ అట్లే చేయవలెనని ప్రోత్సహించుచున్నాము.

బైబిలు సత్యము అయినందున సత్యమును ఎరుగుటకు దాని యొద్దకు మేము వెళ్లుదుము. సత్యస్థావరము నొద్దకు వెళ్ళని యెడల సత్యమును కనుగొనలేము గదా. అందువలన సత్యమును నమ్ముటకు ముందు నీవు సత్యమును వినవలెను (రోమా 10:17). మత సంబంధ సంగతులను గూర్చి నేడు అనేకులు మోసపోవుచున్నారంటే ఆశ్చర్యము లేదు. నేటి క్రైస్తవ లోకమందు గొప్ప భేదములు, గందరగోళము ఉన్నవంటే ఆశ్చర్యము లేదు. సహాయము కొరకు మానవులు దేవుని యొద్దకు వెళ్లుటకంటె మనుష్యుల బోధనల యొద్దకు వెళ్లుచున్నారు. మానవుడు రక్షింపబడవలెననిన అతడు తప్పక బైబిలు నొద్దకు మరలవలెను.

సంఘమును గూర్చిన సత్యమును తెలుసుకొనుటకు మానవులు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించుచున్నాము. నకిలీ సంఘము లనేకములు నేడు లోకమునందున్నవి. అయితే ఏది సరియైనది? ప్రతి ఒక్క దానిని ఒకడు పరిశోధింపవలెనా? అట్లు కాదు గాని సంఘము గూర్చి సత్యమును బోధించు గ్రంథమునతడు పరిశోధింపవలెను. క్రీస్తు సంఘమును గూర్చిన సత్యమును ఎరిగిన తరువాత, బైబిలు బోధలనను



సరించి నడుచుకొను సంఘమును కనుగొనుటకు కష్టము కాదు.

రక్షణ పొందుటకు మానవుడేమి చేయవలెనను సత్యమును తెలిసికొనుటకు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని వేము ప్రోత్సహించుచున్నాము. రక్షణ పొందుటకు అనేక మార్గములున్నవని మానవులు బోధింతురు. అయితే దేవుని వాక్యము నొద్దకు వెళ్ళిన యెడల, ఒకడు సత్యమును వినవలెనని, విశ్వసించవలెనని, తన పాపముల విషయమై మారుమనస్సు నొందవలెనని మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని గ్రహించ గలము (మార్కు 16:15,16; అపొ.కా. 2:38). మనుష్యులు బోధించు వాటిలో ఏమియును లేదు. రక్షించువాడు ప్రభువు గనుక ఒకడు ఆయన వాక్యమును విని ఆయనకు విధేయత చూపిన యెడల రక్షించబడగలడు.

దేవుని నారాధించుట యెట్లోయను సత్యము నెరుగుటకు మానవులు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించుచున్నాము. మానవులెన్ని చెప్పినను, ఆరాధన మార్గములనేకములు లేవు. ఒకే ఒక్క మార్గమున్నదని, ఆ మార్గము ఎట్టిదై యున్నదోయని కూడ ప్రభువు తన వాక్యము నందు వివరించెను (యోహా 4:24).

ఈ విషయములను గూర్చి మాత్రమే గాక జీవమును గూర్చియు, భక్తిని గూర్చియు ఉన్న ప్రతి అంశమును గూర్చిన సత్యమును తెలిసికొనుటకు అందరు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము కోరుచున్నాము. బైబిలును మనము అర్థము చేసికొనలేమని, అందరు ఒకే రీతిగ అర్థము చేసికొనలేరని మానవులు మనలను నమ్మించి యత్నించుచుండినను, అది సత్యము కాదు. మానవుడు నశించిపోవునట్లు బైబిలుకు అతడు దూరముగ యుండవలెనని అపవాది కోరుచున్నాడు.

అయితే రక్షింపబడవలెననిన అతడు బైబిలు యొద్దకు వచ్చి దానిని విశ్వసించి, భక్తి విషయములలో దానిని మాత్రమే మార్గదర్శిగా అతడుంచుకొనవలెను. అప్పుడు మాత్రమే అతడు సరియగును గనుక అప్పుడు మాత్రమే రక్షింపబడగలడు.

మా విశ్వాస ప్రమాణము ఏమిటి? యేసు క్రీస్తు, ఆయన వాక్యమును. ఆయన తప్ప వేరొకడు లేడు. క్రీస్తు దేవుని కుమారుడని మేము నమ్ముదుము. ఆయన వాక్యమే సర్వ సత్యము. మేము దానినంగీకరించి నడుతుము. అందరు అట్లే చేయవలెనని మేము కోరుచున్నాము. మానవ కల్పిత ప్రమాణములన్నియును ఒకే ఒక్క చోటునకు నడుపును–నరకము. యేసు "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6).



12 వ పాఠము

# సంఘ ప్రభువు రాత్రి భోజనము

( Supper of the Church)

క్రీస్తు యొక్క జన్మదినమును జ్ఞాపకముంచుకొనుడి యని గాని లేక ఆయన మరణ, పునరుత్థానములను సంవత్సరమునకొకసారి ఆచరించుడి యనిగాని దేవుని ప్రజలు ఆజ్ఞాపించబడలేదు. సంఘమంతయుగాని, లేక వ్యక్తిగత క్రైస్తవుడుగాని మతసంబంధమైన పండుగలను ఆచరించవలెనని ఎన్నడు కోరబడలేదు. క్రైస్తవులకు జ్ఞాపకార్థముగ ఈయబడిన సంస్థ లేక "పండుగ" ఒకేఒక్కటి యున్నది. అది ప్రభువు రాత్రి భోజనము.

ప్రభువు రాత్రి భోజనము అనగా నేమి ? దాని నెవరు నెలకొల్పిరి? దాని ప్రయోజన మేమిటి ? దానిలో పాలుపంచుకొనుటకు క్రైస్తవులకు ఒక ప్రత్యేక సమయము ఈయబడెనా ? ఈ పాఠములో ఈ ప్రశ్నలకును, మరికొన్నింటికిని జవాబును కనుగొందము.

ప్రభువు రాత్రి భోజనమును క్రీస్తే నెలకొల్పెను. దాని విషయమై సంపూర్తిగ తెలిసికొనుటకు లేఖనములను ఇప్పుడు చదువుదము : పులియని రొట్టెల పండుగలో మొదటి దినమందు శిష్యులు యేసునొద్దకు వచ్చి – పస్కాను భుజించుటకు మేము నీకొరకు ఎక్కడ సిద్ధపరచగోరుచున్నావని అడిగిరి. అందుకాయన – మీరు పట్టణమందున్న ఫలాని మనుష్యుని యొద్దకు వెళ్ళి నా కాలము సమీపమైయున్నది; నా శిష్యులతో కూడ నీయింట పస్కాను ఆచరించెదనని బోధకుడు

చెప్పుచున్నాడని అతనితో చెప్పుడనెను. యేసు తమ కాజ్ఞాపించిన ప్రకారము శిష్యులు చేసి పస్కాను సిద్ధపరచిరి. సాయంకాలమైనప్పుడు ఆయన పండ్రెండుమంది శిష్యులతో కూడ భోజనమునకు కూర్చుండెను. వారు భోజనము చేయుచుండగా ఆయన మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు వారు బహుదుఃఖపడి ప్రతివాడును – ప్రభువా, నేనా ? అని ఆయన నడుగగా ఆయన – నాతో కూడ పాత్రలో చెయ్యి ముంచిన వాడెవడో వాడే నన్ను అప్పగించువాడు. మనుష్య కుమారుని గూర్చి వ్రాయబడిన ప్రకారము ఆయన పోవుచున్నాడుగాని యెవని చేత మనుష్య కుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ; ఆ మనుష్యుడు పుట్టి యుండని యెడల వానికి మేలని చెప్పెను. ఆయనను అప్పగించిన యూదా, బోధకుడా నేనా ? అని అడుగగా ఆయన – నీవన్నట్టే అనెను.

వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి – మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి – దీనిలోనిది మీరందరు త్రాగుడి, ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము. నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు ఇకను దానిని త్రాగనని మీతో చెప్పుచున్నాననెను. అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్ళిరి (మత్తయి 26:17–30).

కొరింధులోని క్రైస్తవులకు పౌలు ఇట్లు చెప్పెను : “మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే



గదా? మనము విరుచు రొట్టె తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయే గదా ? మనమందరము ఆ యొకే రొట్టెలో పాలు పుచ్చుకొనుచున్నాము : రొట్టె యొక్కటే గనుక అనేకులమైన మనము ఒక్క శరీరమైయున్నాము” (1 కొరింధి 10:16–17). విగ్రహములను, ప్రభువును ఒకేసారి కొందరు ఆరాధించుటకు ప్రయత్నించునట్టి విగ్రహారాధికుల కాలములో జీవించుచు పౌలు ఇట్లనెను : “మీరు ప్రభువు పాత్రలోనిది దయ్యముల పాత్రలోనిది కూడ త్రాగనేరరు; ప్రభువు బల్లమీద ఉన్నదానిలోను, దయ్యముల బల్లమీద ఉన్నదానిలోను కూడ పాలుపొందనేరరు” (1 కొరింది 10:21).

పౌలు మరల కొరింధీయులకు ఇట్లు వ్రాసెను : “నేను మీకు అప్పగించిన దానిని ప్రభువు వలన పొందితిని. ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక రొట్టెను ఎత్తికొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, దానిని విరిచి యిది మీకొరకైన నాశరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తుకొని – యీ పాత్ర నా రక్తమువలననైన క్రొత్త నిబంధన; మీరు దీనిలోనిది త్రాగునపుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. మీరు యీరొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునపుడెల్ల ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుదురు. కాబట్టి ఎవడు అయోగ్యముగా ప్రభువుయొక్క రొట్టెను తినునో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధియగును. కాబట్టి ప్రతిమనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను; ఆలాగు చేసి ఆ రొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగవలెను. ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు”

(1 కొరింధి 11:23-29). పైన చెప్పబడిన ఈ వచనముల నుండి మనము ఈ దిగువ సంగతులను గ్రహించుకొనగలము.

1. యేసుప్రభువు రాత్రి భోజనమును స్థాపించి, దానిలో మనము పాలు పుచ్చుకొనుచుండగా మనతో యుందునని వాగ్దానము చేసెను.

2. రొట్టెను క్రీస్తు శరీరమునకు గురుతుగా భుజింపవలెను. అది క్రీస్తు యొక్క నిజ శరీరము కాదు. అది క్రీస్తు శరీర మాంసముగా మారదు. గాని అది సూక్ష్మముగా క్రీస్తు శరీరమునకు గురుతుగా, అంటే జ్ఞాపకార్ధముగా ఈయబడెను. రొట్టె మాత్రము పులియని రొట్టె అయ్యుండును. లోకమంతటా ఇది సులభముగా లభించును.

3. ద్రాక్షరసమును క్రీస్తు రక్తమునకు గురుతుగా సేవింపవలెను. అది నిజమైన రక్తము కాదు. అది రక్తముగా మారదు గాని మనకొరకై చిందింపబడిన క్రీస్తు రక్తమునకు గురుతుగా అది యున్నది : క్రీస్తు రక్తమును మన జ్ఞాపకమునకు అది తెచ్చును. ఒకే పాత్రను లేక అనేక పాత్రలను వినియోగింపవచ్చును. మనము పాత్రను గూర్చి కాదు గాని పాత్రలోని దానిని గూర్చి గ్రహించుకొనవలెను. ద్రాక్షారసము లోకమందంతటా దొరకును. దానిని సంపాదించుట కష్టము కాదు.

4. మానవుడు త్వరితముగా మరచిపోయే గుణము గలవాడని క్రీస్తు యెరుగును. అందువలన ఈ లోక పాపము నిమిత్తమై జరిగించబడిన బలిని అతడు జ్ఞాపకముంచుకొను నిమిత్తము ఆయన ప్రభువు రాత్రి భోజనము నిచ్చెను.

5. దానిలో పాలు పుచ్చుకొనుట ద్వారా మనము క్రీస్తు యొక్క మరణ, సమాది, పునరుత్థానములను నమ్ముచున్నామనియు ఆయన మరల



రాబోవుచున్నాడనియు లోకమునకు తెలియజేయుదుము.

6. ప్రతివాడును క్రైస్తవుడు ఉండవలసిన రీతిగా తాను యున్నాడో లేదో పరీక్షించుకొను సమయము ప్రభువు రాత్రి భోజనము, దానిలో యెవరు పాలుపుచ్చుకొనవలెనో, ఎవరు పాలు పుచ్చుకొనకూడదో నేను చెప్పజాలను, నేను గనుక నమ్మకమైన క్రైస్తవుని కానియెడల దానిలో పాలు పుచ్చుకొనక ముందు నా దోషమును సరిదిద్దుకొనవలెను. దానిలో పాలు పుచ్చుకొనకముందు నేను పాపము లేనివాడుగ యుండవలెనని ప్రభువు కోరుచున్నట్లు దీని ఉద్దేశము కాదు కాని నేను ఆయనకు నమ్మకముగా యుండవలెనని ఆయన యుద్దేశమై యున్నది. నమ్మకముగా యుండవలెనంటే ఆయన ఆజ్ఞాపించిన రీతిగ దానిలో నేను పాలు పుచ్చుకొనవలెను. నేనట్లు చేయకను, లేక దానిని అయోగ్యముగా చేసినను నా ఆత్మ నాశనముకొరకు నన్ను నేనే దానిని తిని ఆ పాత్రలోనిది త్రాగిన యట్లగును.

7. మనము ప్రభువు పాత్రలోనిది, దయ్యముల పాత్రలోనిది కూడ త్రాగనేరమనియు, ప్రభువు బల్లమీద ఉన్నదానిలోను దయ్యముల బల్లమీద ఉన్న దానిలోను కూడ పాలు పొందలేమనియు పౌలు చూపించెను. క్రైస్తవుడు ప్రభువు రాత్రి భోజనమును దేవునికి అంగీకారయోగ్యముగా చేయవలెనన్న అతడు విగ్రహారాధననుండియు అబద్ధ బోధల నుండియు తన్ను తాను ప్రత్యేకించుకొనవలెనని దీని యర్థము. ప్రభువు రాత్రి భోజనమును వారు సామాన్య భోజనముగా ఎంచరాదని కొరింధులోని క్రైస్తవులకు జ్ఞాపకము చేయబడెను. సరిగదా వారు తమతమ భోజనపానాదులను తమ యిండ్ల వద్ద జరిపించి, ప్రభువు రాత్రి భోజనమును భక్తిపూర్వకముగా ఆచరించవలెనని హెచ్చరింపబడిరి.

అయతే ఈ భోజనమును ఎప్పుడు జరిగించవలెను ? దానిని మనము యిష్టము వచ్చిన సమయములో అనుసరించవచ్చునా ? కొందరు నెలకొకసారి, మూడు నెలలకొకసారి మరికొందరు సంత్సరమునకొకసారి ఆచరించెదరని మనమెరుగుదుము. అయితే లేఖనములు ఏమి బోధించు చున్నవి ? క్రీస్తు ఆదివారమున పునరుత్థానుడయ్యెనని దేవుని వాక్యము బోధించుచున్నది. ఆయన తన శిష్యులకు ఒకటికంటె ఎక్కువ మారులు ఆదివారమున కనబడెననియు, సంఘు పెంతెకొస్తు దినమున అనగా ఆదివారపు దినమున స్థాపించబడెననియు లేఖనములు బోధించుచున్నవి. ఇది నిజముగా ప్రాముఖ్యమైనది. త్రోయలో యున్న క్రైస్తవులతో కలసి ఆదివారమునాడు ఆరాధించుటకు అక్కడ ఒక వారము దినములు పౌలు గడిపెను. లేఖనములలో ఇట్లు వ్రాయబడి యున్నది : "ఆదివారమున మేము రొట్టె విరుచుటు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" (అపొ.కా. 20:7). అదివారమున క్రీస్తు శిష్యులు రొట్టె విరుచుటకు ప్రత్యేకముగా కూడుకొనిరనియు,  ఆ సందర్భముగా పౌలు వారికి ప్రసగించెననియు దయచేసి గమనించుము. అయితే ఈ వచనములో "ప్రతి ఆదివారమునాడు" అని చెప్పబడుట లేదని కొందరు అందురు. అట్లయిన ధర్మశాస్త్ర ప్రకారము ప్రజలు "ప్రతి సబ్బాతును" ఆచరించ వలెనని దేవుడు చెప్పలేదు. గాని వారు ప్రతి సబ్బాతు దినమును ఆచరించవలెనని వారెరుగుదురు. అట్లే ప్రతి వారములోను ఒకేఒక్క ఆదివారమున్నది. అందువలన క్రైస్తవులు దేవుని నారాధించు నిమిత్తము, ఆరాధనలో ఒక భాగమైన ప్రభువు రాత్రి భోజనము ఆచరించు నిమిత్తము ప్రతి ఆదివారమున కూడుకొందురు. అట్లు కాదని చెప్పుటకు అధికారము ఎవరికి ఉన్నది ? ఆదివారము నుండి ప్రభువు రాత్రి భోజనమును



తొలగించు నిమిత్తము వారు ఏ వాక్యభాగమును చూపింతురు ?

మన కాలములో ప్రభువు రాత్రి భోజనము ఒక గొప్ప స్మారక చిహ్నామైయున్నది. క్రీస్తును ఆయన సంఘమును సమకూర్చునది అది. సంఘమును సజీవముగా యుంచి తద్వారా క్రీస్తును ఈ లోకమునకు ప్రకటించు ఒక మార్గమది. మన మనస్సులను క్రీస్తుపై కేంద్రీకరించుచు అది మనలను ఐక్యపరచును. అందువలన మనము ప్రభువురాత్రి భోజనములో పాలు పంచుకొను నిమిత్తము ఆదివారమున కూడుకొందుము. అందువలననే సంఘమునకు ప్రభువురాత్రి భోజనము ఎంతో ప్రాముఖ్యమైనది.

13 వ పాఠము

# సంఘ సంగీతము

( Music in the Church )

సంఘం ఆరాధనను గూర్చి మనము ఇంతకుముందే చదివియుంటిమి. దానిలో ప్రార్థన చేయుట, పాటలు పాడుట, వాక్యపఠనము చేయుట, ప్రభురాత్రి భోజనములో పాలు పుచ్చుకొనుట మరియు కానుకలిచ్చుట యనునవి దానియందు మిళితమైయున్నవని గమనించితిమి. అయితే ఇప్పుడు దేవుడు సంఘములో కోరునట్టి సంగీతమగు పాటలు పాడుటను కొంత విపులముగ పఠించుదము. ఈ అంశమును మనము విపులముగ ఎందుకు చదువవలెనంటే రెండు రకములైన సంగీతములున్నవి : అవి గాత్రము (vocal) జంత్రము (instrumental) అనునవి. అందువలన ఆరాధనలో ఈ రెండు రకములైన సంగీతములను వినియోగించవచ్చునని గాని లేక పాటలు పాడుటనే (గాత్రమునే) జరిగించవచ్చునని గాని బైబిలు దీని విషయమై ఏమి బోధించుచున్నదో మనము నిర్ణయించవలెను.

మొదటిగా, క్రీస్తు సంఘములో మొదటి శతాబ్దములో వాయిద్య సంగీతము ఉపయోగింపబడినట్లు అగుపడు ఆజ్ఞలుగాని మాదిరిగాని క్రొత్త నిబంధన లేఖనములలో ఎక్కడను కన్పడుటలేదు. సరిగదా మొదటి శతాబ్దములో గాని దాని తరువాత గాని క్రైస్తవులు ఆరాధనలో వాయిద్యములను వినియోగించినట్లు చారిత్రాత్మక ఋజువులు ఏమియును లేవు. అయితే క్రైస్తవులు పాటలు పాడవలెనని ఆజ్ఞాపింపబడినట్లు లేఖనములు తెలియజేయుచున్నవి. అట్టి కొన్ని వచనములను ఇప్పుడు



గమనించుదము :

1. అపొ.కా. 16:25 : "అయితే మధ్యరాత్రివేళ పౌలును సీలయు దేవుని ప్రార్థించుచు కీర్తనలు పాడుచుండిరి".

2. రోమా 15:9 : "ఈ హేతువు చేతను అన్యజనులలో నేను నిన్ను స్తుతింతును; నీ నామ సంకీర్తనము చేయుదును'' అని వ్రాయబడియున్నది.

3. 1 కొరింథీ 14:15 "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును. మనస్సుతోను ప్రార్థన చేతును, ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును".

4. ఎఫెసీ 5:19 : ''ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి".

5. కొలస్స 3:16 : ''సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు బుద్ధి చెప్పుచు, కృపాసహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి".

6. హెబ్రీ 2:12 : "నీ నామమును నా సహోదరులకు ప్రచురపరతును, సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును".

7. యాకోబు 5:12 : "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను ; ఎవనికైనను సంతోషము కలిగెనా ? అతడు కీర్తనలు పాడవలెను".

పైన చెప్పబడిన వచనములలో వాయిద్యములను గూర్చి ఏమియు చెప్పబడలేదని దయచేసి గమనించుము. ఎందువలన ? ఇదొక మంచి ప్రశ్న. ఈ వచనములలో ఏమి చెప్పబడెనో దానినే ప్రభువు ఆయన పిల్లలమగు తన సంఘమును చేయవలెనని కోరుచున్నట్లు ఋజువగుచున్నది. అదేమనగా మనమాయనను ఆరాధించునపుడు పాటలు పాడవలెను. దేవుడు యాంత్రిక సంగీతమును ఆజ్ఞాపింపలేదు. దాని విషయమై లేఖనములు మౌనముగా యున్నందున వాటిని వినియోగించు స్వాతంత్ర్యము మనకు లేదని నిరూపణయగుచున్నది. మానవ సృష్టియైన వాయిద్యములతో దేవుని మనము ఆరాధించవలెనని మనకు చెప్పబడలేదు. సరిగదా దైవసృష్టి దేవుని స్తుతించవలెనని దేవుడు కోరుచున్నాడు. మనము హృదయపూర్వకముగా భావనాప్రేరితమైన పాటలతో ఆత్మతో ఆయనను ఆరాధించవలనని ఆయన నిన్ను నన్ను కోరుచున్నాడు; దానికంటే తక్కువైన దానిని ఆయన అంగీకరించడు.

పైన చూచిన వచనములలో అనేక ప్రాముఖ్య సంగతులను నీవు గమనించగలవు :

1. స్తుతి గానములు దేవునికి అర్పించవలెను. సంతోషపడవలసినది ఆయనే గాని, నీవు, నేను లేక యితరులు కాదు. వాయిద్య సంగీతములు నుపయోగించువారు అది వారి కిష్టమైనందున ఉపయోగింతురు గాని బైబిలు దాని విషయమై బోధించుచున్నదని కాదు.

2. పాటలు దేవుని నామమున పాడవలెను, అనగా ఆయన అధికారము చొప్పున చేయబడవలెను.

3. పాటలు ఆత్మతోను, అర్థముతోను పాడవలెను. ప్రతి ఒక్కరును ఆత్మతో, అనగా వినయముతో, భక్తితో, నిష్కాపట్యముతో పాడవలెను.



ప్రతి ఒక్కరును అర్థముతో అనగా పాడుచున్న పాటయొక్క భావమును గ్రహించకొని పాడవలెను.

4. గీతములు, కీర్తనలు, ఆత్మసంబంధమైన పద్యములు వినియోగించవచ్చును. రకరకాల పాటలుండచ్చును గాని అవన్నియును వాక్యానుసారముగ యున్న ఆత్మీయ గీతములై యుండవలెను.

5. ఈ పాటల ద్వారా ఒకరికొకరు బోధించుకొనుట జరుగవలెను; అనగా ప్రతి పాటలోను ఒక సందేశము ఇమిడి యుండవలెను. అందువలన ఈ ఆరాధన క్రియలో ప్రతి ఒక్కరు పాలు పొందుట అత్యవసరము.

6. దేవుని గూర్చి హృదయములో గానము చేయవలెను. మన స్వరపేటికయే ఒక వాయిద్యము. స్వరపేటిక ద్వారా శబ్దము వచ్చుచుండగా మన హృదయములో లేక మనస్సులో గానము చేయవలెను.

7. సంఘమంతయు కలసి పాడవలెను. అందువలన ఏకకంఠ గాయకులు, యుగళ గాయకులు నీ కొరకు, నా కొరకు పాడలేరు.

హెబ్రీయులకు వ్రాసిన లేఖకుడు వ్రాసిన దానిని మనస్సు నందుంచుకొనుము : కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). వాయిద్య సంగీతము నుపయోగించువారు అనేక విధములుగ వాదింతురు గాని వారి వాదనలలో ఏదియును బైబిలు ఎదుట నిలువదు. ప్రతివారు తమకిష్టము వచ్చినట్లు ఆరాధింపవచ్చునని వారు వాదించుటలో వారి వాదన యొక్క బలమంతయు పోగొట్టుకొందురు. వాయిద్యములు లేకుండ కూడ దేవుని

నారాధించవచ్చునని వారు ఒప్పుకొందురు. గనుక ఒకడు వాయిద్యములు లేకుండ ఆరాధించవచ్చుననినప్పుడు వాయిద్యములను ఎందుకు విడనాడకూడదు ? అట్లుచేసి ఈ అంశముపై విభజన లేకుండ ఎందుకు ప్రయత్నించరాదు ?

దేవుని ఆరాధనలో వాయిద్యములకు ఏమాత్రమును తావులేదని అనేక మతశాఖల నాయకులగు మార్టిన్ లూధరు, జాన్‌వెస్లీ మొదలగువారు బహిరంగముగా ప్రకటించిరి. ఈ అంశముపై బైబిలు ఏమి చెప్పుచున్నదో ఈనాటి మత ప్రపంచము వినేరకపోయిన యెడల కనీసము వారి మత నాయకులు వాయిద్య సంగీతము గూర్చి ఏమి చెప్పిరో వినవచ్చునుగదా?

అందువలన సంఘ సంగీతము గాత్రమే (vocal music) . దేవుడు మాట్లాడెను. ఆయన కోరునది యేదో దానిని ఆయన బయలుపరచెను. ఇది తప్ప వేరొక నిర్ణయమునకు మనము రాలేము. ఈ అంశముపై మనము ఆయన వాక్యమునకు కలుపుటగాని, తీసివేయుటగాని లేదా దానిని మార్చివేయుట గాని చేయరాదని ప్రభువు మనలను హెచ్చరించెను (ప్రకటన 22:18,19; గలతీ 1:6-9). సరిగదా మనము లేఖనములను అతిక్రమించరాదు (2 యోహాను :9). అందువలన దేవుడు ఆరాధనలో దేనిని ఇమిడ్చెనో దానితోనే మన ఆరాధన జరిగించుటలో తృప్తినొందవలెను.



14 వ పాఠము

# సంఘ పునాది

## ( Foundation of the Church)

ఈ పాఠములో మనము సంఘ పునాదిని గూర్చి గమనించుదము. అది ఆత్మీయ మందిరమే అయినను, అన్నిటివలె అదియు కూడ ఒకదానిపై నిర్మించబడియున్నది. అదేమిటి ? అది మానవుడా, మానవ సిద్ధాంతములా, అపొస్తలులా లేక క్రీస్తా ? దేని బలమయినను దాని పునాదిపై ఆధారపడి యున్నందున, ఈ ప్రశ్నకు మనము జవాబును కనుగొనుట అవసరము.

మొదటిగా, మనము పాతనిబంధనలోని కొన్ని ప్రవచనములను గమనించుదము. దావీదు ఇట్లనెను : “ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను” (కీర్తన 118:22). “ప్రభువగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. సీయోనులో పునాది రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి, అమూల్యమైన తలరాయి, బహుస్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు” అని యెషయా ప్రకటించెను (యెషయా 28:16). ఇప్పుడు మత్తయి సువార్తలో చూచిన మనకు ఇట్లు కనబడును; “మరియు యేసు వారిని చూచి, ఇట్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను. ఇది ప్రభువు వలననే కలిగెను. ఇది మన కన్నులకు ఆశ్చర్యము అనుమాట మీరు లేఖనములలో ఎన్నడును చదువలేదా ?” (మత్తయి 21:42). దీనికి సమానాంతరముగ నున్న మార్కు 12:10, లూకా 20:11 లను కూడ చదువుము.

పౌలు ఇట్లు వ్రాసెను : "అయితే ఇశ్రాయేలు నీతి కారణమైన నియమమును వెంటాడినను ఆ నియమమును అందుకొనలేదు. వారెందుకు అందుకొనలేదు ? వారు విశ్వాస మూలముగా కాక క్రియల మూలముగా నైనట్లు దానిని వెంటాడిరి. ఇదిగో నేను అడ్డురాతిని అడ్డుబండను సీయోనులో స్థాపించుచున్నాను; ఆయునయందు విశ్వాసముంచువాడు సిగ్గుపరచబడడు అని వ్రాయబడిన ప్రకారము వారు అడ్డురాయి తగిలి తొట్రుపడిరి" (రోమా 9:31–33). పేతురు ఇట్లు పలికెను : "ప్రభువు దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను ఆపేక్షించుడి. మనుష్యులచేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడినదియు అమూల్యమును సజీవము రాయియగు ప్రభువు నొద్దకు వచ్చినవారై యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులు నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:1–6).

హెబ్రీయులకు వ్రాసిన లేఖకుడు ఇట్లు నుడువుచున్నాడు; "ప్రతి యిల్లును ఎవడైన ఒకనిచేత కట్టబడును; సమస్తమును కట్టినవాడు దేవుడే. ఇంటికంటె దానిని కట్టిన వాడెక్కువ ఘనత పొందినట్లు, ఈయన మోషే కంటె ఎక్కువ మహిమకు అర్హుడుగా ఎంచబడెను. ముందు చెప్పబోవు సంగతులకు సాక్ష్యార్థముగా మోషే పరిచారకుడై యుండి దేవుని యిల్లంతటిలో నమ్మకముగా ఉండెను. అయితే క్రీస్తు కుమారుడై యుండి, ఆయన యింటి మీద నమ్మకముగా ఉన్నాడు; ధైర్యమును నిరీక్షణ వలన ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లు" (హెబ్రీ 3:3–6). ఆ యిల్లే సంఘము అని పౌలు చెప్పుచున్నాడు. అతడిట్లనుచున్నాడు : "అయినను నేను ఆలస్యము చేసిన యెడల, దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను" (1 తిమోతి 3:15). సంఘమయిన ఈ యింటిని గూర్చి, "యెహోవా ఇల్లు కట్టించని యెడల దానిని కట్టువారి ప్రయాస వ్యర్థమే" అను సంగతిని జ్ఞాపకముంచుకొనుము (కీర్తన 127:1).

సంఘము దేనిపై నిర్మించబడెనో ఆ రాతిని గూర్చి పునాదిని గూర్చి మనము చదివిన తరువాత, మనము సహజముగా ఆ పునాది యేమిటి? అని యడుగవచ్చును. మనకు సంశయము ఏమియు లేకుండ లేఖనములు దీనిని విపులముగా జవాబునిచ్చుచున్నవి. కొరింథులో యున్న సంఘమునకు చెబుతూ పౌలు ఇట్లనెను : "మేము దేవుని జతపనివారమైయున్నాము ; మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునై యున్నారు. దేవుడు నాకనుగ్రహించిన కృప చొప్పున నేను నేర్పరియైన శిల్పకారునివలె పునాది వేసితిని, మరియొకడు దానిమీద కట్టుచున్నాడు; ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగా చూచుకొనవలెను. వేయబడినదితప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసుక్రీస్తే" (1 కొరింథి 3:9–11). ఈ సహోదరులకే అతడు వ్రాయుచు ఇశ్రాయేలీయులుకూడ అందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును భుజించిరనియు, ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరని, అది యేసుక్రీస్తే యనియు అతడు వ్రాసెను. "ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన

బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే" యని అతడు దృఢముగా ప్రకటించెను (1 కొరింథి 10:3, 4).

ఈ సంగతిని ఎరిగిన తరువాత, యేసు తన సంఘమును కట్టుదును అని చేసిన వాగ్దానము మనము సంపూర్తిగ గ్రహించుకొనగలము. పేతురుతోను, మిగిలిన అపొస్తలులతోను, ఆయనే సజీవుడైన దేవుని కుమారుడగు క్రీస్తు అని వారు ఒప్పుకొనిన తరువాత, ఆయన యిట్లనెను: "సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోకద్వారములు దానియెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:17, 18). ఆ బండ క్రీస్తే యని, ఆయన స్థిరమైన పునాదియని మనము తెలిసికొనినట్లయితే, నిజానికి సంఘమును ఆయనపైన లేక పేతురు ఒప్పుకొనిన రీతిగ ఆయన దేవుని కుమారుడై యున్నాడను గొప్ప సత్యముపైన నిర్మింపబోవుచున్నాడని మనమెరుగుదుము. పేతురు ఒక గొప్ప నాయకుడైనను ప్రభువు సంఘమును అతనిపైగాని లేదా వేరొక మనుష్యునిపైగాని నిర్మించి యుండలేదు. ఆయన అట్లు చేసిన యెడల పేతురు పడిపోగానే, సంఘము కూడ పడిపోవును గాని సంఘము దేనికి తావు ఇయ్యనట్టియు, పడిపోనట్టియు దానిపై నిర్మించబడవలెను. అది నేటివరకును క్రీస్తుపైనే ఆధారపడియున్నది.

సీయోనులో అనగా యెరూషలేములో ముఖ్యమైన మూలరాయి వేయబడునని చేయబడిన ప్రవచనమును ముందే మనము చదివియుంటిమి. ఇంతకుముందు చదివిన పాఠములలో సంఘము యెరూషలేములో ఎట్లు ఆరంభమాయెనో తెలిసికొంటిమి (అపొ,కా. 2).



అటు తరువాత యెరూషలేము నాయకులతో పేతురు మాటలాడుచు ఆ మూలరాయి క్రీస్తే అని గుర్తించెను. అతడిట్లనెను : "మీరందరును ఇశ్రాయేలు ప్రజలందరును తెలిసికొనవలసినదేమనగా, మీరు సిలువవేసి నట్టియు, మృతులలోనుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసుక్రీస్తు నామముననే వీడు స్వస్థతపొంది మీయెదుట నిలుచుచున్నాడు. ఇల్లు కట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే. ఆ రాయి మూలకు తలరాయి ఆయెను. మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏనామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:10–12). క్రీస్తు పునాదిరాయి మాత్రమేగాక అతి ప్రాముఖ్యమైన మూలరాయి అయ్యున్నాడని పేతురు చెప్పుట గమనించుము. దేవుని మందిరమైన సంఘమునకు ముఖ్యమైన మూలరాయిగా క్రీస్తు ఉండగా, ప్రవక్తలును, అపొస్తలులును వారు చేసిన బోధలవలన ఆ పునాదిలో ఎట్లు భాగస్తులైయుండిరో పౌలు చెప్పుచున్నాడు: "కాబట్టి మీరికమీదట పరజనులును, పరదేశులనై యుండక, పరిశుద్ధులతో ఏకపట్టణస్థులును, దేవుని యింటివారునైయున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమైయుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19–22).

సరియైన పునాదియొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పుచు క్రీస్తు ఇట్లు బోధించెను : "కాబట్టి యీ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని

పోలియుండును. వానకురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెనుగాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు. మరియు యీ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7:24-27). నీవు దేనిపై నిర్మించుచున్నావు? ప్రభువు సంఘమునకు బండయైన, ముఖ్యమైన మూలరాయిమైన, పునాదియైన క్రీస్తుపై నిర్మించగోరుచున్న యెడల ఆయన మాటలను విని వాటి ప్రకారము చేయవలెను. నీవు అట్లు చేసినప్పుడు ప్రభువు నిన్ను రక్షించి తన సంఘమందు నిన్ను చేర్చుకొనును. నిశ్చలమైన క్రీస్తు యేసు అను పునాదిపై ఆధారపడియున్న ప్రభువు యొక్క గృహములో భాగస్థునిగా నిన్ను చేయును (మార్కు 16:16; అపొ.కా. 2:47; 1 పేతురు 2:5).



15 వ పాఠము

# సంఘము యొక్క ఆత్మ

( Spirit of the Church )

సంఘ సంబంధముగా పరిశుద్ధాత్ముని యొక్క పనిని గూర్చి అనేకులు నేడు తడబడుచున్నారు. ఈ అంశముపై బైబిలు ఏమి బోధించుచున్నదో ఈ పాఠములో నేర్చుకొందము.

మనము పాతనిబంధననుండి ఆరంభింతము. యోవేలు ఇట్లు ప్రవచించెను : "తరువాత నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతును; మీ కుమారులును, కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు; మీ ముసలివారు కలలుకందురు. మీ యౌవనస్థులు దర్శనములు చూతురు. ఆ దినములలో నేను పనివారిమీదను, పనికత్తెల మీదను నా ఆత్మను కుమ్మరింతును... యెహోవా సెలవిచ్చినట్లు సీయోను కొండమీదను యెరూషలేములోను తప్పించుకొనిన వారందరు, శేషించిన వారిలో యెహోవా పిలుచువారు కనబడుదురు. ఆ దినమున యెహోవా నామమునుబట్టి ఆయనకు ప్రార్దన చేయు వారందరు రక్షింపబడుదురు" (యోవేలు 2:18, 29, 32).

"ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని" క్రీస్తు తన శిష్యులతో పలికెను (మార్కు 9:1). అప్పటికి అతి త్వరలో స్థాపింపబడబోవుచున్న సంఘమే ఇక్కడ చెప్పబడిన రాజ్యము (మత్తయి 16:18, 19). అది బలముతో లేక పరిశుద్ధాత్మ శక్తి యొక్క

నడిపింపుతో వచ్చునను సంగతిని కూడ నీవు గమనించుము.

ఆయన అతి త్వరలో పరమున కెక్కిపోవలసియుండెనని క్రీస్తు ఎరుగును. ఆయన వ్యక్తిగతముగా అపొస్తలుల నేర్పరచుకొని వారికి అనేక సంగతులను బోధించి, తర్ఫీదునిచ్చినను కొంత నడిపింపు లేనిదే వారు అనేక సంగతులను మరచిపోయి తాము చేయవలసిన పనిని చేయలేరని ఆయన ఎరుగును. గనుక ఆదరణకర్తను అనగా పరిశుద్ధాత్మని వారియొద్దకు పంపుదుననియు, ఆయన వారిని నడిపించుటయేగాక యేసు యేమైతే వారికి బోధించెనో ఆ సంగతులను వారికి జ్ఞాపకము చేయుననియు ఆయన వారికి వాగ్దానము చేసెను. వారు దేవుని యొద్దనుండి వచ్చినవారని ప్రజలు విశ్వసించునట్లు వారు అద్భుతములు చేయుటకును, వారెక్కడికి వెళ్ళినను అక్కడ ప్రజల భాషలో బోధించునట్లును పరిశుద్ధాత్ముడు వారికి శక్తినిచ్చును. "నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియైన ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు; ఆయన ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును" అని యేసు వారికి చెప్పెను (యోహాను 14:16,17). "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). "తండ్రి యొద్దనుండి నేను పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును. మీరు మొదటినుండి నాయొద్ద ఉన్నవారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" (యోహాను 15:26, 27). "అయితే ఆయన, అనగా



సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13).

యేసు పరమందున్న తండ్రి యొద్దకు వెళ్ళకముందు తన శిష్యులను ఆయన చుట్టూ సమకూర్చి, "క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలో నుండి లేచుననియు, యెరూషలేము యొదలుకొని సమస్తజనములలో ఆయన పేరట మారు మనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను" (లూకా 24:46-49). "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని వారతో చెప్పెను" (అపొ.కా. 1:8).

చివరిగా, సంఘస్థాపననుగూర్చి అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో మనము చదువగలము. ఈ మాటలను వినుడి : "పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కరిమీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో

మాట్లాడసాగిరి" (అపో.కా. 2:1-4). పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన ఈ మనుష్యులెవరు ? ఆదరణకర్తను ఎవరియొద్దకు పంపుదునని క్రీస్తు వాగ్దానము చేసెను ? అవును, అపొస్తలులకే, అంతేగాక యేసు మార్కు 9:1 లో చెప్పిన శక్తి యిదే. ఏలయనగా ఆ శక్తి వలన వారు ఇతర భాషలలో మాటలాడసాగిరి. ఇట్టి ఆశ్చర్యకరమైన సంగతిని వివరించుచు పేతురు యిట్లనెను : "యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే, ఏమనగా – అంత్య దినముల యందు నేను మనుష్యులందరిమీద నా ఆత్మ కుమ్మరించెదను. మీ కుమారులును, కుమార్తెలును ప్రవచించెదరు. మీ యౌవనులకు దర్శన ములు కలుగును, మీ వృద్ధులు కలలు కందురు" (అపో.కా. 2:16, 17).

ఆ దినమందు పేతురును, మిగిలిన అపొస్తలులును కూడి వచ్చి ప్రజలకు సువార్తను బోధింపసాగిరి. దాని విషయమై లేఖనములు ఇట్లు చెప్పుచున్నవి: వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా మేమేమి చేతుమని పేతురును, కడమ అపొస్తలులను అడుగగా, పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు, ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచినవారి కందరికిని చెందునని వారితో చెప్పెను... కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి... మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అపో.కా. 2:37, 38, 39, 41, 47).

లేఖనములను చదువుట ద్వారా అపొస్తలులును, కొర్నేలి



యింటివారును మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరియని మనము గ్రహించుకొనగలము. సువార్త బోధించుటయందు, ఉపదేశించుటయందు నడిపింపబడు నిమిత్తమును, క్రీస్తు వాగ్దానము చేసినరీతిగ సంఘము నాటబడుటకును అపొస్తలులు దానిని పొందిరి. వారు దేవుని మనుష్యులని ప్రజలు నమ్ము నిమిత్తము అపొస్తలులే యితర భాషలలో మాట్లాడిరి. అద్భుతములు, మహత్కార్యములు అనేకములు చేసిరి. అప్పటికి క్రొత్త నిబంధన లిఖితపూర్వకముగా ఇయ్యబడలేదు గనుక అట్టి అద్భుత సహాయము అవసరమాయెను. కొర్నేలి యింటివారితో సహా అన్యజనులుగా యున్నవారు కూడ యూదులవలె దేవునికి అంగీకారయోగ్యులే యని నిరూపించుటకు కొర్నేలి యింటివారు దానిని పొందిరి (అపో.కా. 10:11).

చేయవలసిన పనినంతటిని అపొస్తలులే చేయలేనందున మరికొందరు కూడ అద్భుతములు చేయగల్గునట్లు వారిపై అపొస్తలులు చేతులుంచు అధికారము కలిగియుండిరి. అట్టి సందర్భములో ఏర్పరచుకొనబడినవారు బాప్తిస్మము పొంది, పరిశుద్ధాత్మ వరమును పొంది, సంఘసభ్యులైయుండినవారు, అయితే అపొస్తలులు వారి మీద చేతులుంచుట ద్వారా మాత్రమే వారు పరిశుద్ధాత్ముని యొక్క అద్భుత శక్తిని పొందగలిగిరి. అపో.కా. 6:1-3 మరియు అపో.కా. 8:5-25 లను చదువుము. ఈ అద్భుతశక్తిని యితరులు పొందగల్గునట్లు అపొస్తలులు మాత్రమే వారిపై చేతులుంచు అధికారమును కలిగియుండిరి. గనుక వారును, వారు చేతులుంచినవారును మరణించగా అద్భుతములు చేయు కాలము గతించిపోయెను; ఏలయనగా అప్పటికి క్రొత్త నిబంధన సంపూర్తిగ లిఖింపబడి యుండెను. గనుక అద్భుతములు, అన్యభాషలు మాటలాడుట మొదలగువాటి అవసరత యిక లేకపోయెను, ఏలయనగా

సత్యమును తెలిసికొను నిమిత్తము బోధింపబడు సంగతులు అవునో కాదో నిర్ధారణ చేసికొను నిమిత్తము ఒకడు దేవుని వాక్యమును పరిశోధింపవచ్చును (1 కొరింధీ 13; యాకోబు 1:25; యోహాను 20:30–31).

సంఘము ఆరంభమయిన నాటినుండి అపొస్తలులు తప్ప ప్రభువునకు విధేయత చూపిన వారందరు (అనగా బాప్తిస్మము పొందిన వారందరు) పరిశుద్ధాత్మ అను వరమును పొందిరి. ఈ వరమును పొందినవారెవరికిని అద్భుతములు చేయు శక్తి లేదు. వారు ఆత్మను పొందిరి. ఆత్మ వారిలో నివసించెను. గానిఆయన వారిలోగాని, లేక వారి ద్వారా గాని అద్భుతములు చేయలేదు. అట్లు చేయు అవుసరత ఏమియును లేదు. క్రైస్తవులందరు అద్భుతములు చేయు శక్తిని పొందియుండి, వారందరు లోకమందంతటా అద్భుతములు చేయుచున్న యెడల ప్రపంచ మందంతటా కలుగు గందరగోళమును నీవు ఊహించగలవు గదా ? అందున్న శక్తివలన అనేకులు క్రైస్తవ్యమునకు అకర్షించబడుదురు. దేవుని వరమును ధనముతో సంపాదించవలెనని ప్రయత్నించిన సీమోను నీకు జ్ఞాపకమున్నాడా ?

సంఘమునకు పరిశుద్ధాత్ముడు నేడు ఎట్లు వర్తించును ? ప్రతి సభ్యుడు కూడ బాప్తిస్మము పొందినందువలన పరిశుద్ధాత్మ అను వరమును కలిగియున్నాడు. అనేకులు బోధించుదానికి భిన్నముగా ఈనాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము లేదు. అందువలన ఈనాడు అద్భుతములు చేయబడుటలేదు. క్రైస్తవులు, సంఘము కూడ ఆత్మ యొక్క మాటలు (కొత్త నిబంధన) వలన ఈనాడు నడిపింపబడుచున్నారు. ఆయన చిత్తము జరిగించబడుచుండగా మన జీవితములో కలుగు ఫలితము, ఆత్మ



ఫలములు (గలతి 5:21–25). మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు (రోమా 8:16). పౌలు ఇంకా ఇట్లు చెప్పుచున్నాడు : “అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్ధన చేయవలెనో మనకు తెలియదుగాని ఉచ్చరింపశక్యము కాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు” (రోమా 8:26).

క్రైస్తవులవలె సంఘము కూడ ఆత్మ ద్వారా జీవింపజేయబడుచున్నది. గనుకనే “ఆత్మయు, పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను; దప్పిగొనినవానిని రానిమ్ము, ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము” అని వ్రాయబడియున్నది (ప్రకటన 22:17).

16 వ పాఠము

# సంఘ పవిత్రత

( Purity of the Church )

సిద్ధాంతములోను, నైతికముగాను సంఘము యొక్క పవిత్రతను గూర్చి ఈ పాఠములో గమనింతము : సంఘము సజీవమై ప్రత్యేకముగా యుండవలెనన్న ఈ రెండును అవుసరమై యున్నవి.

మొదటిగా, సిద్ధాంతరీత్యా సంఘముయొక్క పవిత్రతను గమనించుదము. సంఘమును కట్టుదునని క్రీస్తు వాగ్దానము చేసెను. ఆ పని సరిగ జరిగించుటకు అపొస్తలులను నడిపించు నిమిత్తము పరిశుద్ధాత్ముని పంపించెదనని ఆయన వాగ్దానము వేసెను (మత్తయి 16:18; యోహాను 16:13; అపొ.ఆ. 2). ప్రవచింపబడిన రీతిగను, ప్రభువు వాగ్దానము చేసిన రీతిగను సంఘము స్థాపించబడెను (యెషయా 2:2, 3; యోవేలు 2:28, 29; మార్కు 9:1). అపొస్తలులను, వారు చేతులుంచిన వారిని క్రొత్త నిబంధన లిఖితపూర్వకముగా ఇయ్యబడువరకు పరిశుద్ధాత్ముడు నడిపించెను. అప్పటి నుండియు సంఘము యొక్క మార్గదర్శివలె క్రొత్త నిబంధన పనిచేయుచున్నది. (అపొ.కా. 2:1-4; 6:1-6; యాకోబు 1:25; 2 తిమోతి 3:16, 17). ప్రభువునకు లోబడుటలో ఆ మాదిరి ననుసరించువారే క్రీస్తు సంఘమైయున్నారు. వారు తమ ఆచరణలోను, బోధలోను దానిని మాత్రమే అనుసరించి నడచుకొనినంత కాలము, ప్రభువు తన ప్రజలనుండి ఎట్టి పవిత్రతను కోరుచున్నారో అట్టి పవిత్రతను వారు కలిగియుందురు.



సంఘము స్థాపించబడిన వెంటనే "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్ధన చేయుటయందును ఎడతెగక యుండిరి" యని మనము చదువగలము (అపొ.కా. 2:42). అంటే వారు అపొస్తలుల బోధలో నిలకడగా యుండిరి. క్రీస్తు వారికి బోధించిన బోధను అపొస్తలులు బోధింపవలెనని ఆజ్ఞాపింపబడిరి (మత్తయి 28:19, 20). ఉపదేశము యొక్కయు, సిద్ధాంతము (బోధ) యొక్కయు ఆరంభ స్థావరమును పరిశోధించి కనుగొనగలిగిన యెడల వాటి పవిత్రత సాధ్యమగును. అపొస్తలులు వెళ్ళి సమస్త జనులకు బోధించి, బాప్తిస్మమిచ్చి, యేసు వారికి ఏయే సంగతులను ఆజ్ఞాపించెనో వాటినన్నిటిని వారును గైకొనవలెనని బోధించుడి యని ఆయన వారికి చెప్పెను. పౌలు ఇట్లనెను : "అనేక సాక్షుల యెదుట నా వలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్ధ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" (2 తిమోతి 2:2).

హితబోధను బోధించుట ఎంతో ప్రాముఖ్యమని చెప్పబడెను. పౌలు ఇట్లు వ్రాసెను : "తాను హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడువారి మాటలు ఖండించుటకును శక్తిగలవాడగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడై యుండవలెను" (తీతు 1:9). "నీవు హితబోధ కనుకూలమైన సంగతులను బోధించుము" అని అతడు మరల చెప్పెను (తీతు 2:1). తిమోతికి వ్రాయుచు అతడిట్లు హెచ్చరించెను : "దేవుని యెదుటను, సజీవులకును, మృతులకును తీర్పు తీర్చు క్రీస్తు యేసు యెదుటను, ఆయన ప్రత్యక్షత తోడు ఆయన రాజ్యము తోడు నేను ఆనబెట్టి చెప్పునదేమనగా, వాక్యమును ప్రకటింపుము; సమయమందును

అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము" (2 తిమోతి 4:1, 2). "నిన్ను గూర్చియు, నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము; వీటిలో నిలకడగా ఉండుము; నీవీలాగుచేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు" అని అతడు మరల తిమోతికి వ్రాసెను (1 తిమోతి 4:16). మొదటి శతాబ్దములో యున్నవారికి ఈ హెచ్చరిక మాటలు ఎట్లు వర్తించెనో అట్లే యివి మనకు ఈనాడు వర్తించవా ?

లేఖనములకు మనము కలుపుట, తీసివేయుట, మార్చివేయుట, వాటిని అతిక్రమించుట జరిగించరాదని మనము పదేపదే హెచ్చరింపబడియున్నాము (ప్రకటన 22:18, 19; గలతీ 1:6-9; 2 యోహాను 1:9). దేవుడు మాట్లాడెను. ఆయన తన చిత్తమును మనకు బయలుపరచెను. దానిని మనము హృదయపూర్వకముగా అక్షరాల అనుసరింపవలెనని ఆయన కోరుచున్నారు. విశ్వాసమునుండి కొందరు తొలగిపోవుదురు అని పౌలు, యితరులు మనలను హెచ్చరించిరి. ఈ హెచ్చరికను లక్ష్యపెట్టనందున ఈనాడు క్రైస్తవలోక మంతయు విభజింపబడి యున్నదని మన మెరుగుదుము. మన చుట్టు యున్న క్రైస్తవ లోకమును మనము గమనించిన తరువాత ప్రభువు మనలను ఏమి చేయవలెనని కోరుచున్నారో తెలిసికొను నిమిత్తము మనము పరిపూర్ణముగ బైబిలు నొద్దకు మరలుట అత్యవసరము. మనము ఆయన సత్యము నొద్దకు మరలవలసినదని క్రీస్తు నిశ్చయముగా మనలను ఆహ్వానించు చున్నాడు, హెచ్చరించుచున్నాడు, విజ్ఞాపన చేయుచున్నాడు; మనమందరము ఏకమై యుండవలెనని ఆయన ప్రార్థించెను (యోహాను 17:20-23). పౌలు విభజనలను ఖండించుట మాత్రమేగాక, మనమందరము ఏకీభావము కలిగి యుండవలెనని హెచ్చరించుచు,



మనమెట్లు ఐక్యత కలిగి యుండగలమో కూడ చూపించెను (రోమా 16:17, 18;1 కొరింధి 1:10; ఎఫెసీ 4:1-6).

పవిత్రముగా యుండవలెనన్న, బైబిలులో యున్న సంఘము యొక్క సత్యమును అంగీకరించి బోధించవలెను. సంఘ నామమును గూర్చి పాలన పద్ధతిని గూర్చి, అందు ప్రవేశించుటకున్న షరతులను గూర్చి సంఘారాధన మొదలగు వాటిని గూర్చిన సత్యములను బైబిలునందున్న రీతిగ అనుసరించి బోధించవలెను. మనము నైతికముగా ఎంత పవిత్రులమైనను, క్రీస్తు బోధ మనలో లేనప్పుడు మనము దేవుని బిడ్డలము కాజాలము.

తరువాత, సంఘము నైతికముగా పవిత్రత కలిగియుండవలెను. మరల సంఘము సిద్ధాంతరీత్యా ఎంత పవిత్రురాలైనను, అది నైతిక పవిత్రతను కలిగియుండనియెడల దేవుని సంతోషపరచలేము. మనము భక్తిని పరిశుద్ధతను బోధించుట మాత్రమేగాక వాటిని అలవరచుకొనవలెను.

సంఘములో పాపమును గూర్చియు, లౌకిక అలవాట్లను గూర్చియు లేఖనములు మనలను హెచ్చరించుటయే గాక వాటిని ఖండించుచున్నవి. కొరింధీయులు వారిలోయున్న భక్తిహీనతనుండి తొలగిపోవలెనని పౌలు హెచ్చరించెను (1 కొరింధి 5). మనము ఈ లోకమును, దానిలో ఉన్న వాటిని ప్రేమింపకూడదని యోహాను వ్రాసెను (1 యోహాను 2:15-17). పౌలు తీతుకు యిట్లు వ్రాసెను : "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై, మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది"

(తీతు 2:11, 12). లేఖనములు సంఘములో యున్న పాపమును ఖండించుచు తద్వారా కలుగు ప్రతిఫలమును గూర్చి చెప్పు అనేక వచనములను మనము చూడగలము. దేవుని ప్రజల హృదయములోను, జీవితములోను పాపమునకు తావు ఎక్కడ ఉండరాదు.

క్రైస్తవుడు తగిన జీవితమును జీవించుటకు అతని ప్రోత్సహించు నిమిత్తము లేఖనములు ప్రాధమికముగా వ్రాయబడెను. అందువలన అతడు స్వస్థబుద్ధితోను నీతితోను భక్తితోను బ్రదుకుచుండవలెను. రక్షింపబడిన వారితో సంఘము సమకూడియున్నది. తన ప్రజలు ఆయనకు నమ్మకముగా యుండవలెనని ప్రభువు కోరుచున్నారు. క్రీస్తు యిట్లనెను: "హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). మరియు ఆయన అందరితో ఇట్లనెను – ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తుకొని నన్ను వెంబడింపవలెను" (లూకా 9:23). యాకోబు ఇట్లనుచున్నాడు : "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా – దిక్కు లేని పిల్లలను, విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే" (యాకోబు 1:27). పవిత్రమైన సంఘము కొరకు ప్రభువు తిరిగి వచ్చుచున్నాడని పౌలు చెప్పుచున్నాడు. అతడిట్లనెను : "క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను... దానిని నిలువబెట్టుకొనవలెనని, దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:27).

అయితే క్రీస్తు సంఘము నైతికముగాను, ఆత్మీయముగాను పవిత్రముగా ఎట్లుండును ? వాక్యమును అనుసరించుట ద్వారా, ప్రార్థన



ద్వారా, క్రైస్తవులతో సహసము కలిగియుండుట ద్వారా, దేవుని పనియందు నిమగ్నులై యుండుట ద్వారా, ఇతరులకు సహాయము చేయుటద్వారా, మేలైన వాటిని యోచించుట ద్వారా, దేవునికి మన ధనమును, మన శరీరములను అప్పగించుకొనుటద్వారా సంఘము పవిత్రత కలిగియుండును. మనము ప్రభువు కొరకై ప్రత్యేకించుకొనిన యెడల ఒక దినమందు ఆయన వచ్చి ఆయన ఉన్నచోటుననే మనమును ఉండులాగున ఆయన మనలను కొనిపోవును అని వాగ్దానము చేయబడియున్నది. ఈలోగా మన జీవితములోను బోధనలోను మనము కనబరచు పవిత్రత ఇతరులను కూడ ఆకర్షించును. ఏలయనగా పవిత్రమైన దానికంటె ఆకర్షించు గుణము కలది మరొకటి లేదు. దేవునిలోను, ఆయన చిత్తము లోను వేరొక చోట అగుపడని పవిత్రత మనకు కనబడుచున్నది. గనుక మన జీవితమును శుద్ధి చేసుకొని వాటిని పవిత్ర పరచుటలో మనము ఆయనవలె తయారగుదుము. ఒక ఆశ్చర్యకరమైన సంగతి ఏమంటే క్రీస్తుకు లోబడుచు లేఖనములలో బయలుపరచబడిన ఆయన అడుగుజాడల ననుసరించి నడచుకొనినయెడల అందరును పవిత్రులై యుండగలరు.

17 వ పాఠము

# సంఘ సహవాసము

( Fellowship of the Church )

సహవాసము అనగా స్నేహము, సుహృద్భావము, సహకారము, అంగీకారము, పంచుకొనుట, సహాయము చేయుట, కలిసి పనిచేయుట, ఏకీభవించి యుండుట, ఒకే విశ్వాసమునకు చెందియుండుట మొదలగునవి. సంఘములోనికి సంఘము ఎవరిని అంగీకరించునో మరియు ఎవరిని అంగీకరించక యుండునో యనునవి సంఘమునకు వర్తించును.

క్రైస్తవులుగను, క్రీస్తు సంఘముగను యున్న మనము ఈ లోకముతోను అందున్న అన్ని రకములైన మతస్థులతోను సహవాసము కలిగి యుండగలమా ? యితర మతస్థులను అంగీకరించగలమా ? వారితో కలసి ఆరాధించగలమా ? వారిని ప్రోత్సహించగలమా ? అట్లు చేయలేము గదా? ఇంకను విపులముగ చెప్పుకొనవలెనంటె ఈ దిగువ నుదహరించిన వారితో మనము సహవాసము చేయరాదు :

1. దయ్యములకు బలి అర్పించువారితో మనము సహవాసము చేయరాదు. "అన్యజనులర్పించు బలులు దేవునికి కాదు. దయ్యములకే అర్పించుచున్నారని చెప్పుచున్నాను. మీరుదయ్యములతో పాలివారగుట నా కిష్టము లేదు" (1 కొరింథి 10:20).

2. అవిశ్వాసులతో మనము సహవాసము కలిగియుండరాదు. "మీరు అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకుడి, నీతికి దుర్నీతితో ఏమి



సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు ? క్రీస్తునకు బెలియాలుతో ఏమిసంబంధము ? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది ? దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక ? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము ; అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు : "నేను వారితో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నా ప్రజలై యుందురు. కావున మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైనదానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును. మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథీ 6:14 : 18).

3. నిష్ఫలమైన అంధకార క్రియలలో మనము పాలివారమై యుండరాదు. "నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక వాటిని ఖండించుడి" (ఎఫెసీ 5:11). "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింకుడి, ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు" (1 యోహాను 2:15). "వ్యభిచారిణులారా, యీ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా ? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4).

4. అబద్ధ బోధకులతో మనము సహవాసము కలిగి యుండరాదు. "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను

ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పవద్దు శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలినవాడగును" (2 యోహాను 9-11). "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటలవలనను, ఇచ్చకములవలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17, 18).

5. అసత్యారాధనను జరిగించు వారితో మనము సహవాసము కలిగియుండరాదు. ఏథెన్సు ప్రజలకు పౌలు ఇట్లు చెప్పెను; "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచుచున్నాను" (అపొ.కా. 17:23). "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యేసు పలికెను (మత్తయి 15:9).

6. అపనమ్మకముగా యున్న క్రైస్తవునితో మనము సహవాసము చేయరాదు. అట్టివారిని సంఘ సహవాసము నుండి తొలగించవలెనని పౌలు చెప్పుచూ ఇట్లు వ్రాసెను : "ఇప్పుడైతే, సహోదరుడనబడిన వాడెవడైనను జారుడుగాగాని, లోభిగాని, విగ్రహారాధికుడుగాని, తిట్టుబోతుగాని, త్రాగుబోతుగాని, దోచుకొనువాడుగాని అయియున్న యెడల, అట్టి వానితో సాంగత్యము చేయకూడదు, భుజింపనుకూడదని



మీకు వ్రాయుచున్నాను" (1 కొరింధి 5:11). అట్టివానిని మనము అన్యునిగాను, సుంకరిగాను ఎంచవలెను.

పైన చెప్పబడినవారితోను, లేక దేవుని నెదిరించు వారితోను మనము సహవాసము చేయరాదు, అట్టివారిని మనము ప్రోత్సహించరాదు. వారిని గుర్తించుటగాని, అంగీకరించుటగాని, వారికి సహాయము చేయుటగాని కూడదు. వారిని సహోదరులు అని పిలువలేము. వారితో కలిసి ఆరాధించలేము, వారి వాయిద్యములతో కలసి పాడలేము వారు చేయుచున్న పనికి ఆర్థికముగా సహాయము చేయలేము. సరిగదా మనము వారిని ఎదిరించవలెను. వారిని గూర్చి యితరులను హెచ్చరించవలెను. వేరుగా యుండవలెని మన కోరిక కాదు, వారిని మనము ప్రేమించుట లేదని కాదు, మనము స్వనీతిపరులమని కాదు గాని మనమేమి చేసినను బైబిలును బట్టియే చేయవలెను. ఈ రీతిగ మనము ప్రజలకు సహాయపడుదుము. ముందుగా వారు దాని ప్రయోజనమును ఎరుగకపోవచ్చునుగాని వారిని సహవాసము నుండి తొలగించుటవలన వారికి అన్నిటికంటె అది చివరకు ప్రయోజనకారి యగును. మనము వారితో సహవాసము చేయుచు యున్న యెడల వారి ప్రవర్తనను మనము సమర్ధించిన వారమగుదుము. వారు తాము ఉన్న స్థితిలోనే యుందురు. అట్టివారితో సత్యమును మనము పంచుకొనలేము.

సంఘము ప్రత్యేకమైన ప్రజలతో సమకూర్చబడినది. వారు రక్షింప బడినవారు, క్రీస్తు శరీరమైనవారు గనుక భూమిపై క్రీస్తును సూచించువారు. అందువలన ప్రతిదానిని వారు అంగీకరించలేరు. వారి చుట్టు జరుగుచున్న ప్రతిదానిని వారు సమ్మతింపలేరు. అసత్యమునకు వారు చేయూత నీయలేరు. దానికి శుభమని చెప్పలేరు. సరిగదా వారు లోకమునుండియు, క్రీస్తును సరిగ అనుసరించలేనివారి నుండియు తమ్మును తాము

వేరుపరచుకొనవలెను. వారు విభజనలను తిరస్కరించి ఐక్యత కొరకు పనిచేయవలెను. వారు ప్రతిష్ఠింపబడినవారు, ప్రత్యేకపరచబడినవారు, వారు క్రైస్తవులు మాత్రమే. వారు దేవునితోను, క్రీస్తుతోను, ఆయన ప్రజలతోను మాత్రమే సహవాసము కలిగియున్నవారు. బైబిలు బోధించునది అదే. ఈ క్రిందివాటిని దయచేసి గమనించుము :

1. మనము దేవునితో సహవాసము కలిగియుండవలెను. "మాతో కూడ మీకును సహవాసము కలుగునట్లు మేము చూచిన దానిని, వినిన దానిని మీకును తెలియజేయుచున్నాము. మన సహవాసమయితే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసు క్రీస్తుతో కూడను ఉన్నది" (1 యోహాను 1:3; 1 యోహాను 1:6ను కూడ చదువుము).

2. మనము క్రీస్తుతో సహవాసము కలిగియుండవలెను. "ఆయన మరణ విషయములో సమానానుభవము గలవాడనై, ఆయనను ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తము, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును సమస్తమును నష్టపరుచుకొంటిని" యని పౌలు వ్రాసెను (ఫిలిప్పీ 3:10). "మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు" (1 కొరింధి 1:9).

3. మనము ఆత్మతో సహవాసము కలిగియుండవలెను. "కావున క్రీస్తునందు ఏ హెచ్చరికయైనను, ప్రేమవలన ఏ ఆదరణయైనను, ఆత్మయందు ఏ సహవాసమైనను, ఏ దయారసమైనను, వాత్సల్యమైనను ఉన్నయెడల మీరు ఏక మనస్కులగునట్లుగా ఏక ప్రేమ కలిగి, ఏకభావము గలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి" (ఫిలిప్పీ 2:1-2).



4. నమ్మకముగానున్న క్రైస్తవులతో మనము సహవాసము కలిగియుండవలెను. "అయితే ఆయన వెలుగులో నున్నప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము : అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).

5. ఆరాధనలో మనము సహవాసము కలిగి యుండవలెను. "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్ధన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42). "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకు సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:25).

6. సువార్త ప్రకటించుటలో మనము సహవాసము కలిగి యుండవలెను. "మొదటి దినమునుండి ఇదివరకు సువార్త విషయములో మీరు నాతో పాలివారై యుండుట చూచి, మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను. గనుక మీ అందరి నిమిత్తము నేను చేయు ప్రతి ప్రార్ధనలో ఎల్లప్పుడు సంతోషముతో ప్రార్ధన చేయుచు, నేను మిమ్మును జ్ఞాపకము చేసికొనినప్పుడెల్ల కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నా బంధకముల యందును, నేను సువార్త పక్షమున వాదించుటయందును, దానిని స్థిరపరచుటయందును మీరందరు ఈ కృపలో నాతో కూడ పాలివారై యున్నారు గనుక నేను మిమ్మును నా

హృదయములో ఉంచుకొనియున్నాను" (ఫిలిప్పీ 1:3-7).

7. పరిశుద్ధుల పరిచర్యలో మనము సహవాసము కలిగియుండవలెను. "ఈ కృప విషయములోను, పరిశుద్ధుల కొరకైన పరిచర్యలోను పాలుపొందు విషయములోను మనఃపూర్వకముగా మమ్మును నేడుకొనుచు వారు తమ సామర్థ్యము కొలదియే గాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చుచున్నాను (2 కొరింథి 8:3-4).

8. ప్రతి సత్కార్యములోను మనము సహవాసము కలిగియుండవలెను. "ఎవడైనను వీటిలో చేరక తన్ను తాను పవిత్రపరచుకొనిన యెడల వాడు పరిశుద్ధపరచబడి యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును" (2 తిమోతి 2:21).

క్రీస్తు సంఘ సభ్యుడైన ప్రతివాడును దేనితో సహవాసము చేయవలెనో, దేనితో సహవాసము చేయకూడదో ఎరిగి యుండవలెను. సహవాసము చేయుగలిగిన దానిని అతడు చేయుూతనిచ్చి ప్రోత్సహించవలెను. అంటే అతడు ఆర్థిక సహాయము నిచ్చుచు, సహోదరులతో కలిసి పనిచేయుచు, తన పూర్తి సహకారము నీయవలెను. సహోదరుల సహవాసము నుండి కలుగు ప్రోత్సాహముకన్న మిన్న అయినది వేరొకటి లేదు. సహోదరులతో సహవాసము కలిగియుండుటలోను, సత్కార్యమును జరిగించుటలోను వారి ప్రోత్సాహముఎంతో మేలుకరముగా యుండును. దేవుని బిడ్డలకంటె సన్నిహితులైన ప్రజలు మరొకరు లేరు. "మనందరినీ కలిపిన ప్రేమబంధము ఎంతో ధన్యమైనది".



18 వ పాఠము

# సంఘ క్రమశిక్షణ

## ( Discipline of the Church)

క్రీస్తుసంఘ సభ్యులు పవిత్రముగాను, భక్తితోను, ప్రభువునకు నమ్మకముగా జీవించునట్లు సంఘము ప్రతి సభ్యుని ప్రోత్సహించవలెను. ఎవరైనను పాపములోనికి మరలిపోవుచున్న వారున్న యెడల అట్టివారు నీతిమార్గమునకు మరలునట్లు వారికి బోధించి, ఉపదేశించి, సన్మార్గమున నడిపించుటకు కృషి చేయవలెను. అట్టి ప్రయత్నములన్నియును విఫలమైన యెడల చివరకు అట్టి సభ్యులను సహవాసమునుండి తొలగించినట్టి క్రమశిక్షణ చర్యను తీసికొనవలసియుండును. అట్టివానిని నిత్యనరకమునకు పాత్రునిగా చేయుటకు అట్టిచర్య తీసుకొనబడలేదు గాని, అతడు తన స్థితిని పునరాలోచన చేసుకొని దేవుని యొద్దకు తిరిగి చేరుకొనుటకే అది జరిగించబడవలెను.

కొరింథులోయున్న సంఘములో పాపము ఉన్నట్లు పౌలు కనుగొనెను. జారత్వము జరిగించిన వానిని గూర్చి వ్రాయుచు అతడిట్లనెను: "మీలో జారత్వమున్నదని వదంతి కలదు. మీలో ఒకడు తన తండ్రి భార్యను ఉంచుకొన్నాడట, అట్టి జారత్వము అన్యజనులలోనైనను జరుగదు. ఇట్లుండియు, మీరుప్పొంగుచున్నారేగాని మీరెంతమాత్రము దుఃఖపడి యీలాటి కార్యము చేసినవానిని మీలో నుండి వెలివేసిన వారు కారు. నేను దేహవిషయమై దూరముగా ఉన్నను, ఆత్మ విషయమై సమీపముగా ఉండి, మీతో కూడ ఉండినట్టుగానే యిట్టి కార్యము ఈలాగు చేసినవానిని గూర్చి యిదివరకే తీర్పు తీర్చియున్నాను.

ఏలయనగా ప్రభువైన యేసు దినమందు వాని ఆత్మ రక్షింపబడినట్లు శరీరేచ్ఛలు నశించుటకై మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీరును, నా ఆత్మయు మన ప్రభువైన యేసుక్రీస్తు బలముతో కూడి వచ్చినప్పుడు అట్టివానిని సాతానుకు అప్పగింపవలెను. మీరు అతిశయపడుట మంచిది కాదు. పులిసిన పిండి కొంచమైనను ముద్దంతయు పులియజేయునని మీరెరుగరా ? మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్తముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతేగాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను. గనుకపాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండ నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము. జారులతో సాంగత్యము చేయవద్దని నా పత్రికలో మీకు వ్రాసియుంటిని. అయితే ఈ లోకపు జారులతోనైనను, లోభులతోనైనను, దోచుకొనువారితోనైనను, విగ్రహారాధికులతోనైనను ఏమాత్రము సాంగత్యము చేయవద్దని కాదు; అలాగైతే మీరు లోకమునుండి వెళ్ళిపోవలసి వచ్చునుగదా ? ఇప్పుడైతే, సహోదరుడనబడిన వాడెవడైనను జారుడుగాని, లోభిగాని, విగ్రహారాధికుడుగాని, తిట్టుబోతుగాని, త్రాగుబోతుగాని, దోచుకొనువాడుగాని అయియున్న యెడల, అట్టి వానితో సాంగత్యము చేయకూడదు. భుజింపనుకూడదని మీకు వ్రాయుచున్నాను. వెలుపలివారికి తీర్పు తీర్చుట నాకేల ? వెలుపలివారికి దేవుడే తీర్పు తీర్చును గాని మీరు లోపలివారికి తీర్పు తీర్చువారు గనుక ఆ దుర్మార్గుని మీలో నుండి వెలివేయుడి" (1 కొరింధి 5).

1 కొరింధి 5వ ధ్యాయములో ఒక సహోదరుడు చేసిన పాపమును పౌలు చూపించుచు, సంఘము అతని వెలివేయవలెనని చెప్పుట



గమనించుము. వారు ఆ పనిని చేయని యెడల వారు కూడ కల్మషులగుదురని అతడు చెప్పెను. ఎందుకనగా పులిపిండి కొంచమైనను ముద్దంతయు పులియజేయును గదా ? అంటే ఒకడు తన పాపములోనే కొనసాగుటను సంఘము సహించిన యెడల, మిగిలినవారు అతని మాదిరి ననుసరించి అందరును పాపములో పడుటకు అవకాశమున్నది. అందువలన వారిలోయున్న పాపమును వారు వెలివేయవలెనని కొరింధులోని క్రైస్తవులను పౌలు హెచ్చరించెను. ఇట్లు చేయుటద్వారా సంఘము పవిత్రముగా యుండుట మాత్రమేగాక అతని ఆత్మకూడ చివరకు రక్షింపబడే అవకాశమున్నది. క్రమశిక్షణ యొక్క ఉద్దేశమే అది (మత్తయి 5:29, 30).

థెస్సలోనికయలోయున్న సంఘమునకు పౌలు ఇట్లు వ్రాసెను : "సహోదరులారా, మా వలన పొందిన బోధ ప్రకారముగా అక్రమముగా నడచుకొను ప్రతి సహోదరుని యొద్దనుండి తొలగిపోవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మీకు ఆజ్ఞాపించుచున్నాను" (2 థెస్స 3:5). "మీలో కొందరు ఏ పని చేయక పరుల జోలికిపోవుచు అక్రమముగా నడచుకొనుచున్నారని వినుచున్నాను. అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు, సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట వారిని ఆజ్ఞాపూర్వకముగా హెచ్చరించుచున్నాము. సహోదరులారా, మీరైతే మేలు చేయుటలో విసుకవద్దు. ఈ పత్రిక మూలముగా మేము చెప్పిన మాటకు ఎవరైనను లోబడని యెడల అతనిని కనిపెట్టి అతడు సిగ్గుపడు నిమిత్తము అతనితో సాంగత్యము చేయకుడి. అయినను శత్రువుగా భావింపక సహోదరునిగా భావించి బుద్ధి చెప్పుడి" (2 థెస్స 3:11-15). హెబ్రీయులకు వ్రాసిన

పత్రికలో అతడిట్లనెను : "నా కుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము, ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుగకుము. ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతికుమారుని దండించును అని కుమారులతో సంభాషించునట్లు మీతో సంభాషించు ఆయన హెచ్చరికను మరచితిరి. శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు : దేవుడు కుమరులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు ? కుమాళ్ళయిన వారందరు శిక్షలో పాలుపొందుచున్నారు. మీరు పొందనియెడల దుర్బీజులేగాని కుమారులు కారు. మరియు శరీర సంబంధులైన తండ్రులు మనకు శిక్షకులై యుండిరి. వారియందు భయభక్తులు కలిగియుంటిమి; అట్లయితే ఆత్మలకు తండ్రియైనవానికి మరియెక్కువగా లోబడి బ్రతుకవలెనుగదా ? వారు కొన్ని దినముల మట్టుకు తమకిష్టము వచ్చినట్లు మనలను శిక్షించిరి గాని మనము తన పరిశుద్ధతలో పాలు పొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును" (హెబ్రీ 12:5-11).

యేసు ఇట్లనెను : "మరియు నీ సహోదరుడు నీ యెడల తప్పిదము చేసిన యెడల నీవుపోయి, నీవును అతడును ఒంటరిగా నున్నప్పుడు అతనిని గద్దించుము : అతడు నీ మాట వినిన యెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి. అతడు వినని యెడల, ఇద్దరు ముగ్గురు సాక్షులనోట ప్రతిమాట స్థిరపరచబడునట్లు నీవు ఒకరి నిద్దరిని వెంటబెట్టుకొని అతని యొద్దకు పొమ్ము. అతడు వారి మాట వినని యెడల ఆ సంగతి



సంఘమునకు తెలియజెప్పుము. అతడు సంఘపు మాటయు వినని యెడల అతడు నీకు అన్యునిగాను, సుంకరిగాను ఎంచుకొనుము" (మత్తయి 18:15-17). ఈ వచనమును బట్టియు, ఇంతకుముందు చూచిన వచనములను బట్టియు సంఘము అక్రమముగానున్న భక్తిహీనుడైన సభ్యునిపై చర్య తీసుకొనవలెనని మనము గ్రహించుకొనవలెను. ఈ అక్రమ సభ్యుడు మారుమనస్సు పొందిన యెడల మంచిదే. లేనియెడల పాపము చేసినవానితో ఒక సహోదరుడు మాటలాడినను అతడు మార్పునొందని యెడల, ఇద్దరు ముగ్గురు వెళ్ళి అతనితో మాటలాడవలెను. అప్పుడు కూడ అతడు సరిదిద్దుకొనని యెడల సంఘము అతనిపై చర్య తీసుకొనునట్లు అతని సంగతి సంఘమునకు తెలియజేయవలెను. సంఘము యొక్క హెచ్చరికను కూడ అతడు మన్నన చేయని యెడల అతనిని వెలివేయవలెను (తీతు 3:10, 11). అది జరిగిన తరువాత అతడు అన్యునిగా పరిగణింపబడవలెను. సభ్యులు అతనితో భుజించుటకును, అతని సాంగత్యము చేయుకును తిరస్కరించవలెను. సంఘముతో అతనికిగల సహవాసమును పూర్తిగా లేకుండ చేయుట దీని యుద్దేశము. ఆ విధముగ చేయుట ద్వారా అతడు పాపములో యుంటూ సంఘమునకు అంగీకారయోగ్యుడు కాదని తెలియజేయుట జరుగును. అందువలన అతడు మారుమనస్సు పొందుటకును అతని దోషములు ఒప్పుకొనుటకును క్షమాపణ నడుగుటకును అతడు ప్రోత్సహించబడును (1 థెస్స 3:14, 15; యాకోబు 5:16). ఈ విధముగా మాత్రమే అతడు క్షమింపబడుటకు అవకాశము కలదు.

భక్తహీనుల యెడల సంఘము ప్రభువు యొక్క మార్గము నుపయోగించి క్రమశిక్షణను లేఖనములు ప్రకారము

ఉపయోగించినప్పుడు అది పవిత్రుగా యుంచబడి దానికి కలుగు అనేక సమస్యలనుండి స్వతంత్రముగా యుండగల్గును. క్రమశిక్షణ వినియోగింపబడలేనప్పుడు అందరుకూడ దాని ప్రతిఫలము ననుభవింపవలసి వచ్చును. సభ్యులు సంఘము నుండి నెట్టివేయబడవలెనని, త్రోసివేయబడవలెనని దేవుని ఉద్దేశము కానేకాదు. అయినను సంఘ సభ్యుల జీవితములో పాపమును ఖండించకుండ యుండుట ఆయన చిత్తము కానేకాదు. నిజముగా ప్రభువు మార్గమే సరియైన మార్గము. క్రమశిక్షణలో లేఖనములలో నుంచబడిన ఆయన మార్గమునే మనము అనుసరించవలెను.

ఇశ్రాయేలీయులను, అననీయ, సప్పీరాలను శిక్షించిన రీతిగ నేటి సంఘ సభ్యులను ప్రభువు శిక్షించుటలేదు గనుక అందరు ఆయనకు కృతజ్ఞులై యుండవలెను. వారిని ఆయన భౌతికముగా నాశనము చేసెను. (1 కొరింథి 10:12; అపో.కా. 5:1-11). మన జీవితములను మనము సరిదిద్దుకొనుటకును, అవసరమైనప్పుడు మన సహోదరులు మనలను క్రమశిక్షణలో యుంచుటకును తరుణమును అనుగ్రహించి నిశ్చయముగా మన ప్రభువు మనలను దీవించెను.



19 వ పాఠము

# సంఘమునకు తిరిగి చేరుకొనుట

## ( Return to the Church)

సంఘమందున్న ప్రతి సభ్యుడు ప్రభువునకు నమ్మకముగా యుండవలెనని ఆయన కోరుచున్నాడు. అతనిని ప్రోత్సహించు నిమిత్తము క్రొత్త నిబంధనలో ఎక్కువ భాగము వ్రాయబడియున్నది. అయితే విచారకరమైన సంగతి యేమంటే, ప్రభువునకు అందరు నమ్మకముగా యుండుటలేదు. అందరివలెనే సంఘ సభ్యులు కూడ మానవులే. మరియు శరీరము బలహీనమైనది. రక్షింపబడని వానికంటె క్రైస్తవునికి అతని శోధనలలో ప్రభువు సహాయముండుట, యితర క్రైస్తవుల సాంగత్యముండుట, దేవుని పనిలో నిమగ్నుడైయుండుట అను గొప్ప తరుణములున్నను, అతడు విశ్వాసమునుండి పడిపోవుట సాధ్యమే. వారు పడిపోవనవసరము లేదు; వారు పడిపోనవసరము లేకుండ అనేక కారణములు కలవు గాని వారు పడిపోవుట జరుగును.

విశ్వాసమునుండి తొలగిపోవుట సాధ్యమేయని బోధించు కొన్ని వచనములను మనము ఇప్పుడు చూచుకొనుట మంచిది. యేసు చెప్పిన అనేక ఉపమానములు ఈ సత్యమును ప్రాముఖ్యముగ చూపించుచున్నవి. విత్తువాని ఉపమానములో సత్యము నంగీకరించిన తరువాత శోధనలు, హింసలు రాగా పడిపోయినవానిని గూర్చి యేసు బోధించెను. మరియు సత్యమునకు విధేయుడైన తరువాత ఐహిక విచారము వలనను, ధనమోసమువలనను దానినుండి తొలగిపోయిన వానిని గూర్చిఆయన బోధించెను (మత్తయి 13:18-23). ప్రభువు తిరిగివచ్చుసరికి క్రైస్తవులు

కూడ ఎట్లు సిద్ధపడి యుండరో పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము బోధించుచున్నది (మత్తయి 25:1-13). తలాంతులను గూర్చినట్టియు, తప్పిపోయిన కుమారుని గూర్చినట్టియు ఉన్న ఉపమానములు ఈ సత్యమును బోధించుచున్నవి (మత్తయి 25:14-30; లూకా 15:11-32). మిగిలిన రిఫరెన్సులకొరకు ఈ వచనములను చదవండి : అపో.కా. 5:1-11; 8:9-24; 2 పేతురు 2:20-22; మత్తయి 13:41, 42. విశ్వాసమునుండి తొలగిపోవుటను గూర్చి హెచ్చరించుచు ప్రభువునకు నమ్మకముగా జీవించుట అత్యవసరమని లేఖనములు బోధించుచున్నందున, ఒకడు ఆ హెచ్చరికలను గైకొనక నమ్మకముగా జీవించనియెడల విశ్వాసమునుండి పడిపోవుట సాధ్యమే యని గ్రహింపగుచున్నది. పాపములో పడిపోయిన వారికి ఏమి జరుగును? వారట్లు పాపములోనికి జారిపోయినందున వారు నశించిపోవుదురని దీని యర్థమా ? నిజమే, అట్టిది జరుగుట సాధ్యమే. అయితే అట్టి వ్యక్తికి కూడ శుభవర్తమానము ఒకటి యున్నది. ఏలయనగా అతిక్రమములో యున్న క్రైస్తవుని క్షమించుటకు దేవుని యాజ్ఞ ఒకటి యున్నది (గలతీ 6:1; యాకోబు 5:19, 20; మత్తయి 18:21, 22, 35).

తప్పు చేసిన క్రైస్తవుడు తన పాపములను గూర్చి మారుమనస్సు పొంది, తన తప్పిదములను ఒప్పుకొని తన పాపములు క్షమించబడునట్లు దేవుని ప్రార్థించవలెనని బైబిలు బోధించుచున్నది. ఒకడు దేవుని యెదుట తన హృదయములో పాపము చేసిన యెడల అతడా పాపమును గూర్చి మారుమనస్సు పొంది, దానిని దేవుని యెదుట ఒప్పుకొని, క్షమాపణను అడుగవలెను (మత్తయి 6:13). ఒకడు తన బంధువు లేక మిత్రుడు లేక పొరుగువాని యెడల పాపము చేసిన యెడల అతడు వాని యొద్దకు



వెళ్ళి తన తప్పిదమును ఒప్పుకొని క్షమాపణ కొరకు దేవుని నడుగవలెను (మత్తయి 5:23, 24). అయితే ఒకని పాపము బహిరంగముగయుండి దేవుని సంఘమునకు, దేవుని నామమునకు సిగ్గు తెచ్చునట్టిది అయిన యెడల అతడు తన పాపము విషయమై మారుమనస్సు పొంది, సంఘము యెదుట తన తప్పిదమును ఒప్పుకొని పాపక్షమాపణ కొరకు దేవుని ప్రార్థించవలెను. ఆ వ్యక్తి నిజముగా దేవుని యొద్దకు తిరిగి చేరుకొనవలెనని వెదకుచున్న యెడల ప్రభువు అతని నంగీకరించుటయేగాక సంఘము అతని దోషములను క్షమించి ప్రభువునకు పునరుద్ధరింపబడిన వానివలె అతని నంగీకరించును (మత్తయి 6:14-15).

సంఘముతో తిరిగి చేర్చబడుటకు ఒకడు చేయవలసిన పనులను ఇప్పుడు కొంత జాగ్రత్తగా చూచుకొందము. పాపము చేసి ప్రభువు నొద్దకు తిరిగి చేరవలెనని ఆశించుచున్న క్రైస్తవునికే ఈ షరతులు వర్తించునని దయచేసి గుర్తుంచుకొనుము. ఆ షరతులు యివి :

1. అతడు తన పాపముల విషయమై మారుమనస్సు నొందవలెను. క్రైస్తవుడొకడు బుద్ధిపూర్వకముగనో, బుద్ధి పూర్వకముగా గాకనో సంఘమునుండి దూరమైపోయిన యెడల లేక తన బాధ్యతను తాను నిర్వర్తించని యెడల లేక భక్తిహీనునివలె జీవించుచున్న యెడల అట్టివాడు ప్రభువు నొద్దకు మరల చేరుకొనుటకు తన పాపముల విషయమై మొదటిగా మారుమనస్సు పొందవలెను. అనగా అతడు తన పాపపు జీవితమును విసర్జించవలెను. అతడు మార్పునొంది సరియైన మార్గమున నడచుకొనవలెను. ప్రభువునకు లోబడి అటు తరువాత దేవుని వరమును ధనముతో సంపాదించవలెననుకొని పాపము చేసిన సీమోనుతో పేతురు

యిట్లనెను : "కాబట్టి యీ నీ చెడుతనము మానుకొని మారుమనస్సు నొంది ప్రభువును వేడుకొనుము, ఒకవేళ నీహృదయాలోచన క్షమింపబడవచ్చును" (అపొ.కా. 8:22). తప్పిపోయిన కుమారుడు తన పాపపు జీవితమును విడనాడి తండ్రియొద్దకు తిరిగి వచ్చి అతడు మారుమనస్సు పొందినట్లు నిరూపించెను. ఒకడు పాపములోనే యుంటూ అతని ప్రభువు, సంఘము అంగీకరించవలెనని కోరుట సరికాదు.

2. ఒకడు తన దోషములను ఒప్పుకొనవలెను, "మీ పాపములను ఒకనితో నొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహుబలముగలదై యుండును" అని యాకోబు వ్రాసెను (యాకోబు 5:16). ఒకడు తన పాపములన్నియు పూసగుచ్చినట్లు వరుసగ విపులముగ వర్ణించవలెనని దీని భావము కాదు గాని అతడు తన్ను తాను తగ్గించుకొని తన సహోదరులయెదుట తన దోషములను ఒప్పుకొనవలెను. తప్పిపోయిన కుమారుడు ఇట్లు ఒప్పుకొనెను : "తండ్రీ! నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని: ఇకమీదట నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను" (లూకా 15:18, 19). ఒకడు గర్వముతో నిండినవాడై తన పాపమును ఒప్పుకొనుటకు నిరాకరించుచున్న యెడల అతడు పునరుద్ధరించబడుటకు సంసిద్ధుడుగా లేడు. అతడు షరతులపై తిరిగి చేరుటకు ఆశించలేడు గాని అతడు ప్రభువు చిత్తమునకు లోబడవలెను. అట్లయినప్పుడు అతడు తన పాపములను ఒప్పుకొనవలెను. సీమోను తన పాపపు స్థితిని గూర్చి చెప్పబడినప్పుడు "మీరు చెప్పిన వాటిలో ఏదియు నా మీదికి రాకుండా మీరే నాకొరకు ప్రభువును వేడుకొనుడని చెప్పెను" (అపొ.కా. 8:24). గనుక సీమోను తన పాపము నంగీకరించి దానిని సరిజేసుకొనగోరెను.



3. క్షమాపణకొరకు ఒకడు దేవుని ప్రార్థించవలెను. ఒకడు తన పాపములను ఒప్పుకొనుట మాత్రమేగాక, క్షమాపణ నిమిత్తము దేవుని ప్రార్థించవలెనని యాకోబు 5:16లో చెప్పబడియున్నది. తన తప్పిదములను ఒప్పుకొనుచు తప్పిపోయిన కుమారుడు తండ్రి యొద్దకు వచ్చెను. తండ్రి కృపతో అతనిని తిరిగి చేర్చుకొనెను (లూకా 15:21-25).

ఒక వ్యక్తి తన కుటుంబములోనికి జన్మించగా అతడు ఎల్లప్పుడు ఆ కుటుంబ సభ్యునిగా యుండును. దేవుని కుటుంబ విషయములోకూడ అది సత్యమే. ఆయన సంఘము అయితే తండ్రియొద్దనుండి కలుగు వారసత్వమును పోగొట్టుకొనలేము అని దీని అర్థము కాదు. ఒకడు పరలోకపు వారసత్వమును పోగొట్టుకొనినయెడల నిత్యనాశనమునకు పోవును. అది బహు భయంకరమనది. అయితే ఒకడు దేవుని నుండియు, సంఘమునుండియు తొలగిపోయినను, ఇదివరకటి స్థానమునకు తిరిగి చేరుకొనుటకు ఒక మార్గము కలదని తెలిసికొనుట ధన్యకరమైనది.

ఒకడు క్షమింపబడునట్లు ప్రభువు యొక్క షరతులకు లోబడినయెడల అతని పరలోకపు తండ్రియు, సంఘమును వారియొక్క ప్రేమలోనికి, సహవాసములోనికి తిరిగి చేర్చుకొనగలరు. బైబిలు దీనిని బోధించుచున్నది గనుక దీనిని సంఘము బోధించుచు అనుసరించుచున్నది.

20 వ పాఠము

# సంఘమందలి దీవెనలు

## ( Blessings in the Church)

క్రీస్తు సంఘమును అనేకులు మతశాఖల దృక్పథముతో చూచెదరు. అందువలన వారు తమ గౌరవమును పోగొట్టుకొనిరి. వారు క్రైస్తవులవలె యుండవలెనని యనుకొందురు గాని క్రీస్తు సంఘముతో మాత్రము పొత్తు కలిగియుండరు. బైబిలు వర్ణించు రీతిగ వారు సంఘమును గమనించగలిగితే, వారి మనస్తత్త్వము చాల వేరుగ యుండును. అప్పుడు వారు కూడ అందులో భాగస్థులై యుండవలెనని కోరుదురు. క్రీస్తు సంఘములో లేకుండ క్రైస్తవులై యుండుట అసాధ్యమని వారు తప్పక గ్రహించుకొనగలరు. ఈ సంగతి సత్యము. మరియు వారు దీవెనలతో నిండియున్న గృహములో సభ్యులుగ యున్నామని ఇట్టే గ్రహించగలరు.

ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును క్రీస్తునందును (ఎఫెసీ 1:3), ఆయన శరీరమయిన సంఘమందును ఉన్నవని పౌలు చెప్పుచున్నాడు (కొలస్స 1:18; ఎఫెసీ 1:22, 23). అందువలన అట్టి ఆశీర్వాదములన్నియును సంఘమందున్నవి. అవన్నియును సంఘమందున్న యెడల, సంఘమునకు వెలుపల ఆత్మీయ ఆశీర్వాదములు ఏమియును లేవని దీని యర్థము. ఇది సత్యము గనుక తరువాత మన ప్రశ్న సహజముగ ఏమంటే – ఒకడు క్రీస్తులోనికి, ఆయన సంఘములోనికి ఎట్లు ప్రవేశించును ?

క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి ప్రవేశించు మార్గము ఒకేఒక్కటియున్నదని బైబిలు బోధించుచున్నది. అది ఆయన సువార్తకు లోబడుటద్వారా మాత్రమే. ఒకడు రక్షించబడవలెనంటే అతడు సువార్తను



వినవలెను (రోమా 10:17). దానిని విశ్వసించవలెను (హెబ్రీ 11:6). తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (అపొ.కా. 17:30). క్రీస్తును ఒప్పుకొనవలెను (మత్తయి 10:32). బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:38) అని లేఖనములు బోధించుచున్నవి. అందువలననే "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ?" అని వ్రాయబడి యుండుట మనము చూడగలము (రోమా 6:3). మరల, ''యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని వ్రాయబడి యుండుట చూడగలము (గలతీ 3:26, 27). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందుట యనగా ఆయన శరీరములోనికి లేక సంఘము లోనికి బాప్తిస్మము పొందుటయే యని గమనించుటకు ఈ దిగువ వచనమును గమనించుము : "ఏలాగనగా, యూదుల మైనను, గ్రీసు దేశస్తులమైనను, స్వతంత్రులమైనను మన మందరము ఒక్క శరీరములోనికి, ఒక్క ఆత్మ యందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి" (1 కొరింధి 12:13). క్రీస్తులోనికి, ఆయన శరీరములోనికి ఒకడు చేరే మార్గము ఇది ఒక్కటే.

సంఘమందు ప్రవేశించుట యెట్లో మన మెరిగిన తరువాత, అందున్న ఆత్మీయ ఆశీర్వాదములను గూర్చి చూచుకొందము. వాటిలో కొన్ని ఏమిటి ? వాటిని ఈ దిగువ నుదహరించుదము :

1. క్షమాపణ : ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను. ఆ కుమారుని యందు మనకు నిత్య విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స

1:13, 14). ఇక్కడ చెప్పబడిన రాజ్యము సంఘమే (మత్తయు 16:18, 19). అది క్రీస్తు రక్తముచే కొనబడెను (అపొ.కా. 20:28). ఆయన రక్తము ద్వారా మనకు పాపక్షమాపణ కలుగును.

2. రక్షణ : "అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను" (2 తిమోతి 2:10). క్రీస్తు యేసునకు లోబడుటద్వారా మనము పాపముల నుండి రక్షించబడుదుము (మార్కు 16:16). గనుక ఆయన సంఘములో చేర్చబడుదుము (అపొ.కా. 2:47).

3. విమోచన : "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7). దుష్టునినుండి మనము విమోచింపబడితిమి. విడుదల చేయబడితిమి.

4. శిక్షావిధి యుండదు : "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు". అట్టివారు శరీరము ననుసరింపక ఆత్మ ననుసరించియే నడచుకొందురు (రోమా 8:1-3). శిక్షావిధి యుండదు అను వాగ్దానము క్రీస్తు నందున్న వారికి, సంఘమందున్న వారికి చేయబడెను. వారు శరీరానుసారముగా గాక ఆత్మానుసారముగా నడచుకొనవలెనను షరతుపై అది చేయబడెను.

5. నూతన సృష్టి యగుట : "కాగా ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి : పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17). అనగా మనము క్రీస్తునందును, ఆయన సంఘమునందును నూతన జనులమైయుందుము. మన జీవితములు నూతనముగ ఆరంభించు తరుణము ఇది, అదియే ఒక గొప్ప దీవెనయైయున్నది. తమ జీవితమును మరల ఆరంభింపవలెనని ఈ



లోకములో ఎంత మంది కోరుటలేదు ?

6. సమాధానము : "తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని యీలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధానకారకుడై యున్నాడు" (ఎఫెసీ 2:16).

7. కృప : "నా కుమారుడా, క్రీస్తు యేసునందున్న కృప చేత బలవంతుడవు కమ్ము" (2 తిమోతి 2:1).

8. ప్రేమ : "మరియు మన ప్రభువు యొక్క కృపయు, క్రీస్తు యేసునందున్న విశ్వాసమును, ప్రేమయు అత్యధికముగా విస్తరించెను" (1 తిమోతి 1:14).

9. దేవుని బిడ్డలగుట : "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" (గలతీ 3:26, 27).

10. ప్రార్ధన : "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" (1 యోహాను 5:15). యోహాను 9:31 ని కూడ చదువుము.

11. సహవాసము : "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల, మనము అన్యోన్య సహవాసముగలవారమైయుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).

12. నిరీక్షణ : "విశ్వాసముతో కూడిన మీ పనిని, ప్రేమతో కూడిన మీ ప్రయాసమును, మన ప్రభువైన యేసుక్రీస్తునందలి నిరీక్షణతో కూడిన మీ ఓర్పును మేము మన తండ్రియైన దేవుని యెదుట మానక జ్ఞాపకము చేసికొనుచున్నాము" (1 థెస్స 1:3).

13. ప్రభువు సన్నిధి కలిగియుండుట : "యుగ సమాప్తి వరకు ఆయన మనతో యుందునని వాగ్దానము చేసెను" (మత్తయి 28:20).

14. పరిశుద్ధాత్మ అను వరము : "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపో.కా. 2:38).

15. ఆత్మీయ ఆశీర్వాదములన్నియు : "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక, ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" (ఎఫెసీ 1:3).

ఇట్టి ఆశీర్వాదములనేకములున్నవి. అవన్నియును సంఘమందున్న వారికే కలుగును గాని దాని వెలుపలనున్న వారికి కలుగవు. అందువలననే ఒకడు క్రీస్తు సంఘముతో పొత్తు కలిగియున్న యెడల అతడు దానిలో ఒక భాగమై యుండగోరునని ఈ పాఠము మొదటిలో మనము చెప్పుకొంటిమి, నీవు సంఘమునకు వెలుపల జీవించవలెనని కోరుచున్నావా ? చేయబడిన వాగ్దానముల నొకమారు వెనుకకు తిరిగి గమనించుము, క్రీస్తునకు వెలుపల జీవించుచు వాటన్నిటిని పోగొట్టుకొనుటకు నీవు ఇష్టపడుచున్నావా ?



21 వ పాఠము

# సంఘ ఆర్థికం

( Support of the Church)

సంఘమునకు ఆర్థిక సహాయము ఎక్కడనుండి వచ్చును ? సంఘము మిగిలిన మత సంస్థలన్నిటికంటె వేరైన సంస్థ గనుక ఇది సరియైన ప్రశ్నయే. మిగిలిన సంస్థలవలె ఆర్థిక సహాయము కొరకు సంఘము మామూలు స్థలములలో వెదుకరాదు. ఉదాహరణకు సంఘము ప్రభుత్వమునుండి ఆర్థిక సహాయము కొరకు ఎదురుచూడరాదు. డబ్బును పోగుచేసే సభలు అది నడిపించరాదు. సభ్యులు, సభ్యులు కానివారు కూడా చందాలియ్యవలసినదని అది అట్టి సభలలో ఒత్తిడి చేయరాదు. ప్రత్యేక వస్తువులను అమ్ముటద్వారా గాని, లాటరీ టిక్కెట్లు అమ్ముటద్వారా గాని అది డబ్బును పోగుచేయరాదు. అది ఇతర మత సంస్థలతో సహవాసము కలిగియుండదు గనుక సహాయము కొరకు వాటిని అభ్యర్థించలేదు. అట్లయిన సంఘమునకు ఆర్థికముగ సహాయము ఎక్కడనుండి వచ్చును ? ఈ సంగతిని లేఖనములు అతి సులభముగా విపులముగా మనకు జవాబిచ్చుట మనము చూడగలము.

క్రీస్తు సంఘము అనేక స్థానిక సంఘములతో సమకూడియున్నది. ప్రతి స్థానిక సంఘము పెద్దలను, పరిచారకులను, బోధకులను, ఉపదేశకులను, సభ్యులను కలిగియున్నది. ప్రతి స్థానిక సంఘము తన విధులను, బాధ్యతలను, అవుసరతలను, పనిని కలిగియున్నది. ప్రతి స్థానిక సంఘము మిగిలిన స్థానిక సంఘములనుండి స్వతంత్రత కలిగియున్నందున, దేని ఆర్థికావుసరములను అదే తీర్పు తీర్చుకొనవలెను.

అంటే క్రీస్తు సంఘమునకు ప్రపంచమందు ఒక ముఖ్యకేంద్రముగాని, ముఖ్యాధికారిగాని, ఆర్గనైజేషన్‌గాని లేదు. అందువలన ఒక స్థానిక సంఘము సహాయము కొరకు ఒక సార్వజనాధికారిని అభ్యర్థించవలసిన పనిలేదు. ఒక స్థానిక సంఘము చిన్నదైయుండి, అవుసరతలో యున్న యెడల, దాని అవుసరములలో సహాయపడు నిమిత్తము మరికొన్ని స్థానిక సంఘములు దానితో సహవాసము కలిగియుండవచ్చును. సంఘములు అట్లు సహాయపడవలెనని నిర్బంధము ఏమియులేదు. గనుక ప్రతి స్థానిక క్రీస్తుసంఘము అది చిన్నదేమి, పెద్దదేమి తన ఆర్థికావుసరములను తానే తీర్చుకొనవలెను.

ప్రతిస్థానిక సంఘము వ్యక్తిగత క్రైస్తవులతో సమకూడియున్నది. అయితే ప్రతివారును కానుకల నీయవలసినదని ప్రభువు ఆజ్ఞాపించెను. కొరింధులోయున్న స్థానిక సంఘమునకు పౌలు ఇట్లు వ్రాసెను : "పరిశుద్ధులకొరకైన చందావిషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1 కొరింధి 16:1-2). వారికి మరల అతడు ఇట్లు వ్రాసెను : "సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2 కొరింధి 9:7). సంఘ సభ్యులు చందా నిచ్చుటకు, స్థానిక సంఘమునకు ఆర్థికముగా సహాయపడుటకు ఈ వచనములలో వారు పాటించవలసిన కొన్ని నియమములను అతడు వ్రాసెను. దయచేసి వాటిని గమనించుము :



1. వారు ప్రతి ఆదివారమున చందానీయవలెను. అది వారు ఆరాధనకు కూడుకొనిన దినము (అపొ.కా. 20:7). అందువలన తమ సొమ్మును తీసుకొనివచ్చుటకు అది చాల అనుకూల దినము.

2. ఇచ్చుటలో ప్రతివారు పాలుపొందవలెను. వారు తమ ధనమునుగాని, ధాన్యముగాని లేక మరియేదయిననుగాని ఇయ్యవచ్చును. ఇచ్చునది సంఘమునకు ఉపయోగకరము గాను, ఇచ్చువానికి అనుకూలమైనదిగాను ఉన్నదానిని ఇయ్యవచ్చును.

3. క్రైస్తవుడు తాను వర్ధిల్లినకొలది ఇయ్యవలెను. వారు ఎక్కువ డబ్బును సంపాదించిన యెడల ఎక్కువ చందానీయవలెను. వారు ఒక వారములో ఏమియు సంపాదించలేని యెడల ఆ వారములో ఇయ్యనవుసరము లేదు. అయితే వారు సంపాదించినదానిలో ఎంతభాగము ఇయ్యవలెను? వారు ఒక వారములో ఏమియు సంపాదించలేని యెడల ఆ వారములో ఇయ్యనవుసరములేదు. అయితే వారు సంపాదించినదానిలో ఎంతభాగము ఇయ్యవలెను ? ఇంతియ్యవలెనని నేను చెప్పజాలను. అది వ్యక్తిగతముగా నిర్ణయించుకొనవలెను. బైబిలు బోధించురీతిగ యిచ్చు ప్రతివారు ఎంత నియ్యవలెనో ఎరిగియేయుందురు. యూదులు తమ ఆదాయములో దశమభాగమును యిచ్చెడివారు. గాని మనము వారి కంటె శ్రేష్ఠమైన చట్టము క్రింద యున్నాము. వారికంటె శ్రేష్ఠమైన వాగ్దానములను కలిగియున్నాము. గనుక వారికంటె ఎక్కువ యిచ్చుటకు మనము ప్రోత్సహించబడవలెను.

4. వారు ఇవ్వవలసినరీతిగా ఆదివారమున ఇచ్చిన యెడల అవసరము వచ్చుసరికి స్థానిక సంఘములో డబ్బు ఉండును. ఈ రీతిగ

కానుకలు ఇయ్యని యెడల దేవుని పని జరుగుటకు అభ్యంతరము కలుగును.

5. ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిరీతిగ ఇయ్యవలెను. దీనినిబట్టి ఒకడు ఇచ్చుటకుముందు ఎంత ఇయ్యవలెనో నిశ్చయించుకొని ఇయ్యవలెను. ఎంత ఇయ్యవలెనో ఆలోచించకుండగ చందా ఎత్తు సమయమున జేబులో చెయ్యిపెట్టి చేతికి దొరికిన నాణెమును ఏదో ఇచ్చిన యెడల అతడు ఇయ్యవలసినంత దేవునికి ఇయ్యకపోవును. లేఖనముల ప్రకారము మనము ఇయ్యవలెనన్న ముందుగనే ఆలోచించుకొని ఇయ్యవలెను.

6. ఒకడు సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ఇయ్యవలెను. ఎవరో బలవంతము చేయుట వలన ఒకడు ఇయ్యరాదు గాని అతనికి ఇయ్యవలెనని మనస్సున్నది గనుక మనస్ఫూర్తిగా ఇయ్యవలెను.

7. ఇచ్చు ప్రతి కానుకయు సంతోషముతో ఇయ్యవలెను. అతడు దేవునిచే ఆశీర్వదించబడియున్నందున దేవునికి కానుకల నిచ్చుటకు అతడు సంతోషించుచు కృతజ్ఞత కలిగి యుండవలెను.

సంఘసభ్యులు ఈ రీతిగా ఈయవలెను. స్థానిక సంఘమునకు ఆర్థిక సహాయము ఈ విధముగానే లభించును. దేవుడు తన పని నిమిత్తము ధనసహాయమును అందించు విధానము వేరొకటి లేదు. సంఘసభ్యులు తమ ఇష్టపూర్వకముగా యిచ్చిన కానుకలపై సంఘము ఆధారపడియున్నది. ఒకడు సంఘసభ్యుడు కాగానే, సంఘము తన పనిని నిర్వర్తించునట్లు సంఘమునకు ఆర్థికముగా సహాయము చేయు బాధ్యతను



స్వీకరించును.

సభ్యులు ఇచ్చిన తరువాత, ఆ సొమ్మును దేవుని సేవ నిమిత్తమై జ్ఞానయుక్తముగా వినియోగించు బాధ్యతను సంఘము కలిగియున్నది. ఆ సొమ్మును సంఘము ప్రాముఖ్యముగా సువార్తను బోధించుటకును, ఆపదలోయున్న వారికి సహాయము చేయుటకును వినియోగించవలెను. స్థానిక సంఘము తన యొద్ద నున్న సొమ్ములో ఎక్కువ భాగమును తన యొక్క భౌతికావుసరముల నిమిత్తము వినియోగించకుండా జాగ్రత్తపడవలెను.

సభ్యులందరు లేఖనముల ప్రకారము యిచ్చుట అత్యవసరమని బోధించుట జరుగవలెను. పుచ్చుకొనుటకంటె యిచ్చుట ధన్యము అని యేసు చెప్పెను (అపో.కా. 20:35). మనము దేవుని రాజ్యమును మొదట వెదుకవలెనని క్రీస్తు చెప్పెను (మత్తయి 6:33). అనగా మనము కానుకలనిచ్చునపుడు ఆయన రాజ్యమును మొదట గమనించవలెనని యర్థము. మాసిదోనియలోని క్రైస్తవులు తమ శక్తికొలదికంటె ఎక్కువ యిచ్చిరి గనుక వారు కొనియాడబడిరి. అన్నిటికంటే ముందుగా వారు తమ్మును తాము దేవునికర్పించుకొనిరి.

ఒక బీద విధవరాలు తనకు కలిగినదంతయు ఎట్లు యిచ్చెనో నీకు జ్ఞాపకమున్నదా ? అననీయ, సప్పీరాలు వారు యిచ్చుచున్న దానిని గూర్చి అబద్ధమాడగా ఎట్లు తమ ప్రాణములను కోల్పోయిరో జ్ఞాపకమున్నదా ? (అపో.కా. 5:1-11). ఒకడు దేవునికి ఇయ్యవలసినది ఇయ్యకపోతే అతడు దేవుని నుండి దొంగిలించినయట్లగునని లేఖనములు బోధించుచున్నవి. దేవుడు కానుకలు యిచ్చుటలో తన ప్రజలతో యిదివరలో చేసినట్లు ఇప్పుడు కూడ చేసిన యెడల యేమగును ?

మనలో ఎంతమంది జీవించగలరు ?

నేటి సంఘము ఎక్కువపని చేయవలెను. లోకమున కంతటికిని సువార్తను బోధించు బాధ్యత అది యెక్కువ కలిగియున్నది. ఆ పనిని జరిగించుటకు ఎక్కువ ధనము అవుసరమై యున్నది. గనుక సంఘము తన పనిని నిర్వర్తించులాగున నీవు, నేను క్రైస్తవులవలె ఎక్కువ ఈయవలెను. మనందరము లేఖనముల ప్రకారము ఇచ్చిన యెడల లోకమున కంతటికిని సువార్త బోధించుటకు కావలసినదానికంటె ఎక్కువ సొమ్ము సంఘములో యుండును.



22 వ పాఠము

# సంఘముకై క్రీస్తు రాకడ

## ( Christ's Return for the Church)

ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితము క్రీస్తు వచ్చెను. ఆయన ఇంచుమిచ్చు 30 సంవత్సరములపాటు ఈ లోకములో జీవించినను, ప్రపంచ చరిత్రను అంతటిని ఆయన మార్చివేసెను. ఈ లోక పాపముల నిమిత్తము ఆయన సిలువపై మరణించుట ఆయన సల్పిన కృషికి కిరీటమాయెను. ఆయన సమాధి చేయబడి పునరుత్థానుడైన తరువాత పరమందున్న తన తండ్రి యొద్దకు ఆరోహణుడాయెను. అది మాత్రమే కాదు. ఒక దినమందు ఆయన మరల రాబోవుచున్నాడు. ఆ సమయమందు ఆయన తన సంఘమును తీసికొనిపోవును.

ఈ పాఠములో సంఘమును తన యొద్దకు తీసుకొనివెళ్ళు నిమిత్తము క్రీస్తు మరల వచ్చు సంగతి గూర్చి తెలిసికొందము. యేసు వెళ్ళిపోకముందు, తన శిష్యులతో యిట్లనెను : “మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి, నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచవెళ్లుచున్నాను; నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును” (యోహాను 14:1–3). ఆయన తిరిగివచ్చునని క్రీస్తు మాత్రమేగాక, క్రొత్త నిబంధన లేఖకులు అనేకులు అది యదార్థమని వ్రాసియుండిరి. లూకా, ఆయన పరలోకమున

కెక్కిపోవుటకు వర్ణించుచు ఇట్లు వ్రాసెను : "ఆయన వెళ్లుచుండగా వారు ఆకాశమువైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలచి – గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు ? మీ యొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో, ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అపొ.కా. 1:10–1).

పౌలు ఇట్లు వ్రాసెను : "సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్నవారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టములేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగి వచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు, ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత నొకనినొకడు ఆదరించుకొనుడి" (1 థెస్స 4:13–18). మన ప్రభువు తిరిగి వచ్చునప్పుడు ఏమి జరుగునో పేతురు మనకు ఇట్లు తెలియజేయుచున్నాడు : "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో



లయమైపోవును. భూమియు, దాని మీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునని గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో ఆపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశముల కొరకును, క్రొత్త భూమి కొరకును కనిపెట్టుచున్నాము; వాటియందు నీతి నివసించును" (2 పేతురు 3:10–13).

పెండ్లి కుమార్తెయైన తన సంఘముకొరకు ప్రభువు వచ్చునప్పుడు జరుగు సంగతులలో కొన్నిటిని గూర్చి పౌలు ఇట్లు వ్రాసెను : "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తు శరీరమునకు రక్షకుడై యున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి అది కళంకమైనను, ముడతయైనను, అట్టిది మరియేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదక స్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:23–27). సంఘమేరాజ్యమని యెంచి దానికొరకై ప్రభువు వచ్చునప్పుడు జరుగు సంగతిని అతడిట్లు మరల వ్రాసెను : "ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము

వచ్చెను గనుక మనుష్యునిద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. ప్రతివాడును తన వరుసలోనే బ్రతికింపబడును; ప్రధమఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయన వారు బ్రతికింపబడుదురు. అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికిరాజ్యమును అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" (1 కొరింథి 15:20-24).

సంఘము క్రీస్తు యొక్క పెండ్లికుమార్తెయై యున్నదను సంగతిని మరొకమారు ఆలోచింతము. ఒక స్త్రీ, తన భర్త చనిపోయినయెడల వేరొక పురుషుని వివాహము చేసికొనవచ్చునని పౌలు చూపించిన తరువాత, ధర్మశాస్త్రము గతించిపోయెను గనుక మనము క్రీస్తు అను వేరొకని చేరుటకు స్వతంత్రులమైతిమి యని అతడు బోధించెను (రోమా 7:1-4). గనుక క్రీస్తునకు వివాహము చేయబడిన మనము (అనగా సంఘము) ఆయన పెండ్లి కుమార్తెయైయున్నాము. మత్తయి 25వ అధ్యాయములో క్రీస్తు పదిమంది కన్యకలను గూర్చియు, పెండ్లికుమారుని రాకడను గూర్చియు ఒక ఉపమానమును బోధించెను. పదిమంది కన్యకలు పెండ్లికుమార్తెను సూచించుచున్నారు. పెండ్లి కుమారుడు క్రీస్తే. పెండ్లియాడుటకు ఆయన వచ్చుచున్నట్లు అక్కడ వర్ణించబడినది. ఆయన వచ్చినప్పుడు పెండ్లికుమార్తె ఆయన యొద్ద ఉండుటకై ఆమెను కొనిపోవును. బాప్తిస్మమిచ్చు యోహాను ఇట్లు చెప్పెను : "పెండ్లి కుమార్తె గలవాడు పెండ్లికుమారుడు; అయితే నిలువబడి పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు ఆ పెండ్లి కుమారుని స్వరము విని మిక్కిలి సంతోషించును; ఈ నా సంతోషము పరిపూర్ణమైయున్నది" (యోహాను



3:29).

తన పెండ్లికుమార్తెయైన సంఘము కొరకు క్రీస్తు తిరిగి వచ్చుటను ఆలోచించుము. ఆయన ఏమి కనుగొనగోరును ? ఆయన నామమును ధరించి పవిత్రముగా ఆమె యుండవలెనని ఆయన కోరును. ఆయన ఒకే పెండ్లి కుమార్తె దగ్గరకు అనగా ఒకే సంఘము యొద్దకు వచ్చును. ఇది సత్యమే అయిన యెడల నీవు, నేను ఆయన సంఘ సభ్యులము కాని యెడల ఏమగును ? మనకేమి జరుగును ? అయితే ఆయన సంఘములో యుండవలెనన్న ఒకే ఒక్క మార్గమున్నది. అదేమనగా ప్రభువునకు లోబడి ఆయన సంఘముతో చేర్చబడుటయే (మార్కు 16:16; అపో.కా. 2:47). ఆయనకు విధేయులు కానివారినిగూర్చి పౌలు ఇట్లు చెప్పుచున్నాడు : "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునపుడు మిమ్మును శ్రమపరుచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతి అనుగ్రహించుటయు దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచ బడుటకును, విశ్వసించిన తనవారందరియందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖమునుండియు, ఆయన ప్రభావమందలి మహిమ నుండియు పారద్రోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు. ఏలయనగా మేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి" (2 థెస్స 1:7-10).

క్రీస్తు మరల వచ్చినప్పుడు రాజ్యమునుగూర్చి దైవవేదము ఇట్లు చెప్పుచున్నది : "మనుష్య కుమారుడు తనదూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను

సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులు గలవాడు వినును గాక" (మత్తయి 13:41-43). తీర్పు దినమున ఆయన నీతిమంతులను, అనీతిమంతులను వేరుచేయునపుడు ఏమి జరుగునో మత్తయి 25:31-46లో వ్రాయబడి యున్నది. "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి, నా తండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి" అని చెప్పును (మత్తయి 25:33). అప్పుడు మనము ఇంతకుముందు చదివిన రీతిగ క్రీస్తు తన రాజ్యమును తండ్రికి అప్పగించును (1 కొరింధి 15:24).

ఇక్కడ చెప్పబడిన రాజ్యము, సంఘమే (మత్తయి 16:18, 19). అది స్థాపించబడకముందు మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలలో పరలోకరాజ్యము అని పిలువబడెను. పరలోకమునుండి క్రీస్తు వచ్చి దానిని స్థాపించును గనుక అది అట్లు పిలువబడెను. ఆయన వాగ్దానము చేసినరీతిగ అది అపొ.కా. 2వ అధ్యాయములో స్థాపించబడెను (యెషయా 2:2,3; యోవేలు 2:28, 29; దానియేలు 2:44). అప్పటి నుండి అది స్థాపించబడియున్నట్లు లేఖనములలో చెప్పబడెను (కొలస్స 1:13; హెబ్రీ 12:26; యాకోబు 2:5; 2 పేతురు 1:11). దానిపై క్రీస్తే రాజు, దానికి ఆయన శిరస్సు (కొలస్స 1:18; ఎఫెసీ 1:22, 23). దాని పౌరులే సంఘసభ్యులు.

ఆయన ప్రజలతో సమకూడిన రాజ్యముకొరకు తన ఒకే ఒక్క రాజ్యముకొరకు క్రీస్తు తిరిగి వచ్చుచున్నాడు. ఆ రాజ్యపౌరులు ఆయన నామమును ధరించుకొని ఆయన ఆజ్ఞలకు లోబడుట ద్వారా ఆయనను



గౌరవింతురు. నీవు రాజ్యపౌరుడవా" నీవు ప్రభువు సంఘ సభ్యుడవా ? కాని యెడల ప్రభువు నీకొరకు వచ్చుటలేదు. అంటే నీవు నిత్యనాశనము కొరకు విడిచి పెట్టబడుదువు.

క్రీస్తు మరల ఎప్పుడు వచ్చును ? మనకు తెలియదు. ఆయన ఈ రోజుగాని, రేపుగాని లేక కొన్నివేల సంవత్సరముల తరువాతగాని రావచ్చును. ఆయన ఎప్పుడు వచ్చునో మనకు గాని, మరియే మానవునికిగాని తెలియదు. దేవదూతలకుగాని చివరకు క్రీస్తుకుగాని అది తెలియదు. దేవుడు ఒక్కడు మాత్రమే ఎరుగును. క్రీస్తు ఇట్లు చెప్పెను: "అయితే ఆ దినమును గూర్చియు, ఆ ఘడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మత్తయి 24:36). గనుక నీవు, నేను ఎల్లప్పుడు సిద్ధపడియుండుట అతి ప్రాముఖ్యము. బైబిలు చెప్పు రీతిగ మనము సిద్ధపడియున్న యెడల క్రీస్తు వచ్చినప్పుడు ఆయన మనలను తనయొద్దకు కొనిపోవును. అట్లే ఆయన తన రాజ్యపౌరులైన సంఘమును గూడ కొనిపోవును.

23 వ పాఠము

# సంఘ చరిత్ర

## (History of the Church)

అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో క్రీస్తు సంఘ స్థాపన కొరకు లేదా ఆయన రాజ్యారంభము కొరకు సమస్తము సంసిద్ధమై యున్నట్లు మనము చూడగలము. అపొస్తలులందరు యెరూషలేములో యుండిరి. పరిశుద్ధాత్మ వారిపై దిగెను. పెంతెకోస్తు నాచరించుటకు అనేక జనములలో నుండి వచ్చిన వారక్కడ యుండిరి. పేతురును, మిగిలిన అపొస్తలులును లేచి యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే యని ప్రకటించిరి. క్రీస్తు చనిపోయెను గనుక అంత్యదినములారంభ మాయెను; మారుమనస్సు, పాపక్షమాపణలు ప్రకటించబడెను. సువార్త ప్రకటింపబడగా ఇంచుమించు మూడువేల మంది విని బాప్తిస్మము పొందిరి. వారిని ప్రభువు తన సంఘముతో చేర్చెను. అప్పుడు సువార్త యెరూషలేము నుండి యూదయ సమరయ దేశముల యందంతటను, భూదిగంతముల వరకును, ఆకాశము క్రింద యున్న సర్వ జనాంగములు, సర్వ సృష్టి వినునంత వరకును ప్రకటింప బడెను (అపో.కా. 1:8; మత్త 28:19,20; మార్కు 16:15,16; కొలస్స 1:23).

అపొస్తలుల కాలములో సంఘము బహుగా అభివృద్ధి చెందెను. అది త్వరగా వ్యాప్తి చెందెను. పౌలు మార్పు చెందిన తరువాత, యూదులకు మాత్రమే గాక అన్యజనులకును సువార్త బోధించుచు అతడు మూడు ముఖ్య ప్రయాణములు చేసెను. అందువలన ఆసియాలోను, ఐరోపాలోను అనేకులు మార్పు చెందిరి. మరియు క్రీస్తు సంఘములనేకములు



స్థాపించబడెను. అయితే గొప్ప హింస కలిగినందున ఇది తేలికగా జరుగలేదు. మొదట యెరూషలేమునందున్న సంఘమునకు గొప్ప హింస కలిగెను. గనుక శిష్యులు అనేక ప్రాంతములలోనికి చెదిరిపోయిరి. చెదిరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి (అపో.కా. 8:1-4). కాలము గడిచిన కొలది, రోమీయులు వారి ప్రతి సమస్యలకు క్రైస్తవులను నిందించిరి, సరిగదా రోమా పట్టణములోను, వారి సామ్రాజ్యమందంతటను యున్న క్రీడాస్థలములలో క్రైస్తవులను ఘోరముగ హింసించుచు ఆనందించిరి. చివరకు పౌలు కూడ పట్టుబడి తీర్పు కొరకు రోమాకు కొనిపోబడెను. యోహాను తప్ప అపొస్తలులందరును క్రీస్తు నామము కొరకు హతసాక్షులైరియని చరిత్ర చెప్పుచున్నది. అంతే కాదు వందల కొలది, వేల కొలది బహుశ లక్షల కొలది క్రైస్తవులు కూడ తమ ప్రాణములను కోల్పోయిరి.

హింసలు కలుగుచున్నను సంఘము అభివృద్ధి చెంది వ్యాపించెను. సంఘమునకు కలిగిన గొప్ప నష్టము హింసల వలన కలుగలేదు గాని, సంఘము లోపల నుండియే కలిగెను. విశ్వాస భ్రష్టత్వము జరుగునని అపొస్తలుడైన పౌలు ముందుగానే హెచ్చరించెను. అనగా క్రీస్తు సంఘ సభ్యులనేకులు అసత్య మార్గములోనికి తొలగిపోవు దినము వచ్చుచున్నదని అతడు హెచ్చరించెను. అతని మాటలనిప్పుడు గమనించుదము: “సహోదరులారా, ప్రభువు దినమిప్పుడే వచ్చియున్నట్టుగా ఆత్మ వలన నైనను, మాట వలన నైనను, మా యొద్ద నుండి వచ్చినదని చెప్పిన పత్రిక వలన నైనను, ఎవడైనను చెప్పిన యెడల మీరు త్వరపడి చంచల మనస్కులు కాకుండ వలెననియు, బెదరకుండ వలెననియు, మన ప్రభువైన యేసు క్రీస్తు రాకడను బట్టియు, మనము ఆయన యొద్ద కూడుకొనుటను బట్టియు మిమ్మును వేడుకొనుచున్నాము. మొదట భ్రష్టత్వము సంభవించి

నాశన పాత్రుడగు పాప పురుషుడు బయలుపడితేనేగాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్ను తానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి. నేనింకను మీయొద్దనున్నప్పుడు ఈ సంగతులను మీతో చెప్పినది మీకు జ్ఞాపకము లేదా? కాగా వాడు తన సొంతకాలమందు బయలుపరచబడవలెనని వానిని అడ్డగించునది ఏదో అది మీరెరుగుదురు. ధర్మ విరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియ చేయుచున్నది. గాని యిది వరకు అడ్డగించు చున్నవాడు మధ్య నుండి తీసివేయబడువరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలుపరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరి చేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశము చేత నాశనము చేయును. నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్య విషయమైన ప్రేమను అవలంబింపకపోయిరి గనుక, వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనబరచు బలమును అనుసరించియుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతి యందు అభిలాషగలవారందరును శిక్షా విధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స 2:1-12).

ఆ దుర్నీతి అప్పటికే క్రియ చేయుట మొదలిడెనని పౌలు చెప్పునది గమనించుము. ఇంకా అతడిట్లనుచున్నాడు: "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధ యందును లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని



ఆత్మతేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు వాతవేయబడిన మనస్సాక్షి గల వారై వివాహము నిషేధించుచు సత్య విషయమైన అనుభవ జ్ఞానము గల విశ్వాసుల కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహార వస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుదురు" (1 తిమోతి 4:1-3). ఎఫెసులో యున్న సంఘ పెద్దలతో మాట్లాడుచు, పౌలు ఇట్లనెను. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేని యందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి. నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొనిపోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు. కావున నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్లు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసికొని మెలకువగా ఉండుడి" (అపొ.కా. 20:28-31).

పౌలు హెచ్చరించిన రీతిగనే, సంఘములో యున్న వారే కొందరు క్రీస్తు అనుచరులను అసత్యములోనికి ఈడ్చుకొనిపోవుట మొదలిడిరి. ఈ భ్రష్టత్వము సంఘ పాలన పద్ధతిపై జరిపిన తిరుగుబాటు ద్వారా మొదలిడెనని చరిత్ర చెప్పుచున్నది. ప్రతి స్థానిక సంఘము అందున్న పెద్దలు, పరిచారకు లతో బాటు స్వతంత్రము కలిగియుండవలెననెడిది ప్రభువు చిత్తము. అయితే కొంత కాలమగుసరికి అనేక స్థానిక సంఘములు ఒకే ఒక్క పెద్దను మిగిలిన వారందరిపై ఉన్నతముగ నియమించిరి. ఇట్లు హెచ్చింపబడిన యతనిని అనేక సంఘములపై అధికారము గలవానిగ చేసిరి. ఇది చివరకు సంఘ మంతటిపై సార్వజనిక అధ్యక్షతకు

దారి తీసినది. ఇదంతయు ఒకే రోజున జరుగలేదు గాని అనేక సంవత్సరముల కాలములో జరిగెను. అందువలన క్రీ॥శ॥ 606 నాటికి మొదటి సార్వజనిక అధ్యక్షుడు లేక పోపు అనునతడు విశ్వాస భ్రష్టత్వములో యున్న సంఘమునకు శిరస్సుగా నియమింపబడెను. తత్ఫలితమే ఈనాడు మనమెరిగిన రోమన్ కథోలిక్ సంఘము. అయితే క్రీస్తు సంఘమునకేమి జరిగెను? విశ్వాసమందు నమ్మకముగా నిలిచియున్న వారు బహుశ వారి ఉనికిని ఎవరు గుర్తింపకయే కొనసాగిరి. ప్రభువైతే ఆయన రాజ్యము లేక సంఘము సదా కాలము నిలుచునని చెప్పెను. సంఘము చేయవలసినది కూడ అదే.

క్రైస్తవ లోకమునందయితే కేథలిక్కు సంఘము ఏలుబడి చేసెను. నిజానికి దాని ప్రభావము లోకమునందంతయు వ్యాపించినట్లాయెను. అది పలుకబడిలోయుండి నియంతృత్వమును కొనసాగించిన కొన్ని వందల సంవత్సరముల కాలమును "చీకటి యుగములు" అని చరిత్రలో పిలువబడు నంతవరకు వచ్చెను. కేథలిక్కు సంఘస్వాములే బైబిలును చదివి అర్థమును గ్రహించుటకు అర్హులు అని చెప్పుచు సామాన్య ప్రజలు బైబిలును చదువ కుండగ అది బహిష్కరించెను. గనుక లోకమందంతటా చీకటి యుగము ఆరంభమాయెను. కేథలిక్కు స్వాములే బైబిలును చదివి బోధించుట కర్తృత గలవారని అది చాటించెను. దీనిని బట్టి ప్రజలు ఏమి తెలిసికొనవలెనని ఈ స్వాములు కోరేవారో దానినే వారు బోధించిరి.

అట్టి ఈ కాలమందు కేథలిక్కు సంఘము చిలకరింపు, వాయిద్య సంగీతము అను అంశములపై రోమన్ కేథలిక్కులనియు, గ్రీకు కేథలిక్కు లనియు రెండు శాఖలుగా విభజింపబడెను. కాలము గడచిన కొలది రోమన్ కేథలిక్కు సంఘము అనేక సిద్ధాంతములు, బోధనలను కనుగొని



బోధించెను. చివరిగా 16వ శతాబ్దము ఆరంభమగుసరికి కేథలిక్కు సంఘము బోధలోను, నీతిలోను బహు కలుషితమైపోవుటచే మార్టిన్ లూథరు అనునతడు, ఆ సంఘమందు స్వామిగా పనిచేయుచు దానిని దిద్దుబాటు చేయవలెనని ప్రయత్నించెను. అందువలన అతడు బహిష్కరింపబడెను. అతడా సంఘము వీడి తాను సరియైనదని భావించిన దానిని బోధించుటకును, అనుసరించు టకును మొదలిడెను. తద్వారా సవరణోద్యమము లేదా ప్రొటెస్టాంట్ ఉద్యమము అరంభమాయెను. దీని నుండి నేటి వరకును మన మెరిగిన మతశాఖల తత్వము ఉద్భవించెను. లూథరు అనుసరించిన విధానమును బట్టి ప్రపంచమందనేక చోట్ల బైబిలు నొద్దకు మరలు దమనెడి ఉద్యమ మారంభమాయెను. అయినను అది సంపూర్ణ విజయమును సాధించ లేకపోయెను.

17వ శతాబ్దములోను, 18వ శతాబ్దములోను యూరపులోను, అమెరికాలోను మతశాఖలను గూర్చియు, విభజనలను గూర్చియు విసిగి పోయిన కొంత మంది డినామినేషన్ ప్రజలుండిరి. క్రమేపి వారున్న అబద్ధ బోధల నుండి విడుదల పొంది సంపూర్తిగ బైబిలు ననుసరించుటకు మొదలిడిరి. లేఖనములు బోధించు సంఘము నొద్దకు మరలుటయే వారి ఉద్దేశము గాని ఒక క్రొత్త సంఘమును స్థాపించుట వారి కోరిక కాదు. దానిని వారు సాధించిరి. అప్పటి నుండియు పరిపూర్ణ క్రొత్త నిబంధన క్రైస్తవ్యము గూర్చిన విజ్ఞాపన లోకమందంతటా ప్రకటింపబడుచున్నది. అందుచే లక్షలాది ప్రజలు మనుష్యులు కల్పించిన పద్ధతులను, బోధలను విడనాడి, కేవలము క్రైస్తవులగుటకును, క్రీస్తు సంఘ సభ్యులగుటకును బైబిలును మాత్రమే వారి మార్గదర్శిగా యుంచుకొనుటకును నిశ్చయించు కొనుచున్నారు. సత్యమును బోధించుటకు లోకమందంతటా వెళ్ళిన క్రైస్తవులు ఆఫ్రికా, ఇండియా,

రష్యా, పోలెండు దేశములలో పవిత్రముగాయున్న క్రీస్తు సంఘములుండుట కనుగొనిరి. ఆ సంఘము ఎల్లప్పుడు ఉండిన రీతిగానే ఇప్పుడును యున్నది. అది బైబిలు సంఘమేయని నిరూపించుట కొరకు దాని చరిత్రను సంఘారంభము వరకు తడువనవుసరము లేదు. సంఘము యొక్క మాదిరి బైబిలునందున్నది. మనము దాని నవలంబించినపుడు మనమే క్రీస్తు సంఘమవుదుము. విత్తనము దేవుని వాక్యము (లూకా 8:11). అపొస్తలుల కాలమందు అది దేనినుద్భవింపజేసెనో దానినే అనగా క్రైస్తవులను, క్రీస్తు సంఘ సభ్యులను అది ఈనాడు కూడ ఉద్భవింపజేయును. దేవుని రాజ్యము నిరతము నిలుచునని మన మెరుగుదుము. గనుక అది స్థాపింపబడిన నాటి నుండియు నిలిచియేయున్నది. అది సదా కాలము నిలుచుచునే యుండును. దానిని నాశనము చేయుటకు మానవునికి గాని, అపవాదికి గాని శక్తి లేదు. ఇదియే ప్రభువు రాజ్యము, ఆయన సంఘము, ఆది నుండి అంతము వరకు విజయవంతమై చివరిగా ప్రభువుతో సదా కాలముండు సంఘము యిదే, అది క్రీస్తు సంఘము!!



24 వ పాఠము

# నేటి క్రీస్తు సంఘము

## (The Church today)

క్రీస్తు సంఘము ఇంచుమించు రెండు వేల సంవత్సరములు క్రితమే స్థాపించబడెను (అపొ.కా. 2). అయితే ఆనాడున్న రీతిగనే అది ఈనాడున్నది. “ఇది ఎట్లు సాధ్యమగును?” అని నీవడుగవచ్చును. క్రొత్త నిబంధనలో యున్న సంఘ మాదిరి ననుసరించుట ద్వారా సాధ్యమగును.

ఈనాడున్న సంఘమే మొట్టమొదట ఆరంభింపబడిన సంఘమని నిరూపించుటకు, దాని చరిత్రను సంవత్సరముల వారీగా పెంతెకోస్తు వరకు వెనుకకు తడువవలెనని కొందరి యభిప్రాయము. అయితే అది అవుసరం లేదు. మొదటిగా ఆయన రాజ్యమెన్నటికీ నాశనము కాదనియు, అది నిత్యము నిలుచుననియు ప్రభువే మనకు వాగ్దానము చేసెను (దానియేలు 2:44; లూకా 1:33; హెబ్రీ 12:28). దీనిని బట్టి ఆయన సంఘము ఆరంభమయిన నాటి నుండి నేటి వరకు ప్రపంచమందు ఎక్కడో ఒక చోట నిలబడియే యున్నదని యర్థము. రెండవదిగా, ఆయన రాజ్యపు విత్తనమును క్రొత్త నిబంధన యందు భద్రపరుచబడి మనము కలిగియున్నాము (లూకా 8:11). అపొస్తలుల కాలములో అది క్రైస్తవులను జనింపజేసినట్లయితే నేడు కూడ అది క్రైస్తవులనే జనింప జేయును. అపొస్తలుల కాలములో సంఘము క్రైస్తవులతో సమకూర్చబడినట్లయితే నేడు కూడ అది అట్లే జరుగును. అందువలన క్రొత్త నిబంధన ఎక్కడ ఉన్నదో అక్కడ దానిని కలిగినవారు అది చెప్పురీతిగ చేసిన యెడల క్రీస్తు సంఘము ఉండుట సాధ్యమే.

దేవుడు తన ప్రజలు అనుసరించుటకు ఒక మాదిరిని ఎల్లప్పుడు

ఇచ్చుచునే యుండెను. ఓడను నిర్మించుటకొరక మాదిరిని ఆయన నోవహుకు ఇచ్చెను (ఆదికాండము 6). ప్రత్యక్ష గుడారమును నిర్మించుటకొరక మాదిరిని ఆయన మోషేకు ఇస్తూ "కొండ మీద నీకు చూపబడిన మాదిరి చొప్పున సమస్తమును చేయుటకు జాగ్రత్తపడుము" అని ఆయన హెచ్చరించెను (హెబ్రీ 8:5). అందువలన క్రొత్త నిబంధన యందు ప్రభువు సంఘము యొక్క పరిపూర్ణ మాదిరి మనకు బయలుపరచబడెను. నోవహు, మోషేలకు ఈయబడిన మాదిరి ననుసరించి వారెట్లు నడుచుకొనవలెనో, అట్లే సంఘపు మాదిరిని బట్టి కూడ మనము నడుచుకొనవలెను. ఓడను, ప్రత్యక్ష గుడారమును నిర్మించుటలో నోవహు మోషేలు దేవుడు ఇచ్చిన మాదిరి ననుసరించగా దేవుడెట్లు సంతోషించెనో, అట్లే మనము సంఘపు మాదిరి ననుసరించినపుడు దేవుడు సంతోషించును, ఏలయనగా ఏవిధమైన కలుపుట, తీసివేయుట లేకుండా ఆయన కోరు రీతిగ సంఘముండును (ప్రకటన 22:18,19).

సంఘ రూపు రేఖలన్నియును క్రొత్త నిబంధన యందు విపులముగ వర్ణించబడినవి. సంఘమనగా ఏమిటో, దానినెవరు స్థాపించిరో, ఎక్కడ అది స్థాపించబడెనో, ఎప్పుడు స్థాపించబడెనో, అది ఏ నామమును బట్టి పిలువబడవలెనో, సభ్యుల నామమేమై యుండవలెనో, దాని యందు సభ్యులగుట యెట్లో, దాని ఆరాధన యెట్లో, దాని కృషి యేమిటో యను విషయములను గూర్చి ప్రభువే తన వాక్యము నందు వివరించెను. సంఘ శిరస్సు ఎవరో, అది కొనబడిన విలువ ఎట్టిదో, దాని రక్షకుడెవరో యను విషయములను గూర్చి అది విశదీకరించుచున్నది. సంఘమనగా ఏమిటో, దాని కృషి యేమిటో తెలిసికొనుటకు అది సందేహము లేనంత విపులముగ బోధించుచున్నది. దేవుని వాక్యము ఎంత విపులముగ నున్నదో అంత విపులముగ దాని మాదిరి అందున్నది.



గనుక బైబిలు నందున్న నిజసంఘమును తెలిసికొనుటకు మనము చేయవలసినదంతా బైబిలును చదువుటయే. దాని సత్యము మనము గ్రహించి నపుడు, దానినవలంబించినపుడు దాని సభ్యులమగుదము. అట్లు క్రీస్తు ఆదిలో స్థాపించిన తన సంఘమగుదుము. ప్రతి విత్తనము దాని జాతి ప్రకారము ఫలమునిచ్చును. అందువలన దేవుని వాక్యము క్రైస్తవులను, క్రీస్తు సంఘ సభ్యులను ఆనాడు ఎట్లు జనింపజేసెనో నేడును అట్లే జనింప జేయును.

ప్రపంచమందంతటా నేడు క్రీస్తు సంఘమును కనుగొనవచ్చును. అది ప్రతి చోట యున్నది. మానవులు బైబిలు చెప్పిన రీతిగా చేయునపుడు ఎక్కడైనను, ఎప్పుడైనను, అది ఉండగలదు. ప్రజలు దేవుని చిత్తమును జరిగించుట ఎప్పుడు మానివేయుదురో అది అప్పుడు ఉండకుండ పోవును.

క్రీస్తు సంఘము బైబిలునే అనుసరించుటవలన, బహుగ అభివృద్ధి జెందుచు వ్యాపించుచున్నది. అది విభజనను ఖండించుచున్నది. క్రీస్తును మహిమ పరుచుచున్నది. బైబిలు నందు నీవు కనుగొను నిజసంఘము యిదే. అది డినామినేషన్ కాదు. డినామినేషన్ల కలయిక అంతకు ముందే కాదు. అది ప్రొటెస్టాంట్‌గాని, కేథలిక్కుగాని, ఒక తెగకాని కాదు. అయితే అదేమిటి? అది ప్రభువు సంఘము. అంతే.

ప్రభువు సంఘమునకు భూమిపై ముఖ్యకేంద్రము గాని, అధికారి గాని లేదు, ఏ మానవుని అది ఘనపరచదు. భూసంబంధ జ్ఞానము చొప్పున అది ఆర్గనైజ్ చేయబడలేదు. ప్రతి స్థానిక సంఘము పెద్దలను, పరిచారకు లను, బోధకులను, ఉపదేశకులను, సభ్యులను కలిగి స్వాతంత్ర్యము కలిగినదై యున్నది. గురువులు, సామాన్య సభ్యులు అను భేదము లందు లేవు గనుక ఒక సభ్యుడు మరొక సభ్యుని కంటె ఘనుడుగా

ఎత్తబడుట అందు జరుగదు.

క్రీస్తు సంఘము ఎల్లప్పుడు శత్రువులను కలిగే యుండెను. గనుక నేడు కూడ దానికి శత్రువులు లేకపోలేదు. మానవ కల్పిత సంఘములు నేడు దాని నెదిరించుచున్నవి. ఏలయనగా అది వారి ననుసరించుట లేదు. వాటితో క్రీస్తు సంఘము సహవాసము కలిగియుండుటగాని, వాటికి శుభమనిగాని అది చెప్పునందున వారు దాని నెదుర్కొనుచున్నారు. వారు మానవ కల్పిత బోధలను అనుసరించుచుండగా బైబిలును మాత్రమే వెంబడించువారు కొందరున్నారని ఎరిగియున్నారు. వారు మానవుల ననుసరించుచూ, మానవ నామములు ధరించుకొని యుండగా మేము క్రీస్తుని వెంబడించుచు క్రీస్తు నామమునే ధరించియున్నామని వారు జాగ్రత్తపడుచున్నారు. మాపై వారు సత్యమను ఆయుధమును గాక, ప్రజల మనస్సులలో ద్వేషము కల్పించి, అపార్థమును జనింపజేయుచున్నారు. అయితే వారి ప్రయత్నములన్నియు వ్యర్థమే.

యుగయుగముల నుండియు క్రీస్తు సంఘము విజయమును సాధించుచున్నది. ఈ లోకమందున్న శత్రువులందరు, నరకమందున్న దయ్యములన్నియు దానిని ఆపలేవు. తనచుట్టునున్న వారి కంటె అది సంఖ్యలో తక్కువగా కన్పడును; రక్షింపబడువారు నిజానికి కొందరే (మత్తయి 7:13,14). క్రీస్తుకు ఒకే ఒక్క సంఘమున్నది. ఆ ఒక్క సంఘము కొరకు ఆయన రాబోవుచున్నాడు (ఎఫెసీ 5:27; యోహాను 14:1-6). ఆయన రాజ్యముపై ఆయనే రాజు. ఆ రాజ్యమును తండ్రియైన దేవునికి అప్పగించుటకు ఆయన వచ్చును (1 కొరింధి 15:24). ఆయనకు ఒకే ఒక్క పెండ్లికుమార్తె యున్నది (ప్రకటన 21:9). ఆయన నామమును ధరించియున్న ఆ ఒక్క వధువు కొరకు ఆయన ఒక దినమందు రాబోవు చున్నాడు. అయితే మిగిలినవాటి సంగతియేమి? మీరెవరో నేనెరుగనని



ఆయన వాటిని గూర్చి చెప్పబోవుచున్నాడు. ఆయన వాటినన్నిటిని పెల్లగించును (మత్తయి 15:13). వాటినన్నిటిని పోగు చేయించి ఆయన అగ్నిలో వేయును.

పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్యమే నేడు మా విజ్ఞాపనయైయున్నది. బైబిలు నొద్దకు మరలుము. దానినే నీ మార్గదర్శిగా యుండనీయుము. బైబిలును నీవెరిగిన యెడల సత్యమును నీ వెరుగుదువు. అది చెప్పు రీతిగ చేసిన యెడల నీవు రక్షింపబడుదువు. ప్రభువు సంఘముతో చేర్చబడుదువు. దానిని గూర్చియే నీవు బైబిలునందు చదువగలవు.

నీవు క్రీస్తు సంఘ సభ్యుడవు కాని యెడల, త్వరలో సభ్యుడవు కావలెనని నిన్ను ప్రోత్సహించుచున్నాము. దేవుని యందు విశ్వాస ముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని నీవు రక్షింపబడగల్గునట్లు బాప్తిస్మము పొందుము (మార్కు 16:16; రోమా 10:10; అపొ.కా. 2:38). అప్పుడు ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చును. నీవొక క్రైస్తవుని వగుదువు (అపొ.కా. 2:47; 11:26). నీవు అట్లు చేయుదువా? నిన్నెవరును బలవంతము చేయుట లేదు గాని నీవు నీ బైబిలును పఠించిన యెడల నీవు క్రైస్తవునిగా మాత్రము ఉండగోరుదువని మా విశ్వాసము. అట్లు చేయుచు నీ జీవిత మంతయు ప్రభువు కొరకు జీవించుచు ఆయన రాజ్య వ్యాప్తి కొరకు నీవును కృషి చేయుదువని మా విశ్వాసము.

Translated from English to Telugu
by
JOSHUA GOOTAM